ప్రభాత
ఆదివారం
వెలుగు
20.01.2019
www.v6velugu.com
హైదరాబాద్
సంపుటి: 4 సంచిక: 334 పేజీలు: 12+12+12+12 | ₹6
SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | WARANGAL | JAGTIAL

టాకీస్
నా స్థాయేంటో నాకు తెలుసు
బాలీవుడ్ హీరోయిన్లలో దీపికా పదుకొనె టాప్‌లో ఉంది. అలాంటిది తనను తక్కువ చేస్తే ఊరుకుంటుందా?


09

జనరల్
రేపే పంచాయతీ తొలి దశ
769 ఏకగ్రీవం.. 3,710 గ్రామాల్లో ఎన్నికలు. ఉదయం 7 నుంచి ఒంటి గంట వరకు పోలింగ్. 2 గంటల నుంచి కౌంటింగ్.. వెంటనే ఫలితాలు.


03

బిజినెస్
కరీంనగర్.. కొత్త ఐటీ హబ్
కరీంనగర్‌లో ఐటీ టవర్ నిర్మాణం 70 శాతం పూర్తి. ఇది అందుబాటులోకి వస్తే యువతకు ఉపాధి.



10

దేశం - విదేశం
మెక్సికోలో పైప్‌లైన్ పేలుడు
సెంట్రల్ మెక్సికోలో అక్రమ ఫ్యూయల్ ట్యాప్ దగ్గర జరిగిన అగ్నిప్రమాదంలో 21 మంది చనిపోయారు. 71 మందికిపైగా గాయపడ్డారు.


05

ప్లే
ధోనీ, చాహల్‌కు ఫస్ట్ క్లాస్
కెప్టెన్ విరాట్‌కోహ్లీ, భువనేశ్వర్ సూపర్.. ధవన్ ఫెయిల్.. ఆసీస్‌తో వన్డే సిరీస్‌లో టీమిండియా రిపోర్ట్ కార్డ్


11



2014 జూన్ వరకు మొత్తం రుణం రూ. 54,90,763కోట్లు
2018 సెప్టెంబర్ నాటికి 82,03,253 కోట్లకు చేరిక
నాలుగున్నరేళ్లలో 50 శాతం పెరిగిన భారం
ఆర్థిక శాఖ డేటాలో వెల్లడైన వాస్తవాలు
కొత్త పథకాలకు మరింత అప్పు తప్పదా?

న్యూఢిల్లీ:
కేంద్ర ప్రభుత్వంపై అప్పుల భారం నానాటికీ రెట్టింపవుతోంది. నాలుగున్నరేళ్ల మోడీ సర్కార్ పాలనలో అప్పులు 50 శాతం పెరిగాయి. కేంద్రం మొత్తం అప్పులు 2014 జూన్ వరకు రూ. 54,90,763 కోట్లు ఉండగా.. అది 2018 సెప్టెంబర్ నాటికి రూ. 82,03,253 కోట్లకు చేరింది. ఇందులో నాలుగున్నరేళ్ల కాలంలో మోడీ ప్రభుత్వం చేసిన అప్పులే రూ. 27,12,490 కోట్లు. కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ తాజా లెక్కలు చెప్తున్న చేదు వాస్తవాలివి. మరో 12 రోజుల్లో బడ్జెట్‌ను ప్రవేశపెట్టేందుకు సిద్ధమవుతున్న మోడీ సర్కార్.. రాబోయే లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా కొత్త పథకాలను ప్రకటించాలని యోచిస్తోంది. ఇప్పటివరకు చేసిన అప్పులే తడిసిమోపెడవుతుండగా.. మళ్లీ కొత్త పథకాలకు లక్ష కోట్ల రూపాయలు ఖర్చు చేయాల్సి ఉంటుందని, వాటికి కూడా చేయి చాపాల్సిందేనని ఆర్థిక రంగ నిపుణులు అంటున్నారు.

మిగతా 2లో

హామీలన్నీ సర్కారు నెరవేరుస్తుంది
మార్చి నెలాఖరుకు మిషన్ భగీరథ పూర్తి
త్వరలో పింఛన్ల పెంపు
నిరుద్యోగ భృతి అమలు
కొత్త జిల్లాలుగా ములుగు, నారాయణపేట
రాష్ట్రంలో 20 వేల 171 చెరువుల పునరుద్ధరణ



“57 ఏళ్లు నిండినవారందరికీ వృద్ధాప్య పెన్షన్లు, నిరుద్యోగులకు రూ. 3,016 భృతి అందిస్తాం. లక్ష వరకు ఉన్న రైతు రుణాలను మాఫీ చేస్తాం. రైతు బంధు సాయాన్ని ఏడాదికి ఎకరాకు రూ.10వేలు ఇస్తాం. చట్టసభల్లో బీసీలకు 33 శాతం, మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల అమలు కోసం ప్రభుత్వం పోరాడుతున్నది. ఐకేపీ ఉద్యోగుల సర్వీసులను క్రమబద్ధీకరించాలని ఆలోచిస్తున్నది.
— గవర్నర్ నరసింహన్

అన్ని రంగాల్లో మనమే టాప్

చట్టసభల ఉమ్మడి సమావేశంలో గవర్నర్

హైదరాబాద్, వెలుగు:
సకల జనుల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ అన్నారు. సీఎం కేసీఆర్ సమర్థ పాలనతో అనేక రంగాల్లో దేశంలోనే తెలంగాణ అగ్రగామిగా నిలుస్తోందని చెప్పారు. ఆరు దశాబ్దాల పోరాటం తర్వాత తెలంగాణ ప్రజలు ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకున్నారని గుర్తుచేశారు. శనివారం అసెంబ్లీ హాల్‌లో ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగించారు. ఉదయం 11.30 గంటలకు ప్రారంభమైన ప్రసంగం మధ్యాహ్నం 12.03 గంటల వరకు కొనసాగింది. మొదట రెండు నిమిషాల పాటు తెలుగులో మాట్లాడి ఆ తర్వాత ఇంగ్లిష్‌లో ప్రసంగించారు. కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. అందరూ ప్రజాసేవలో నిమగ్నమవ్వాలని కోరారు. కేసీఆర్ చేసిన అభివృద్ధికి ఇటీవల జరిగిన ఎన్నికల్లో ప్రజలు విశ్వాసాన్ని ప్రకటించారని చెప్పారు. ఈ అపూర్వ విజయం పునాదిగా బంగారు తెలంగాణ నిర్మాణానికి ప్రభుత్వం పునరంకితమవుతుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన అన్ని హామీలను నెరవేర్చేందుకు చిత్తశుద్ధితో పనిచేస్తుందని, కొత్త ప్రభుత్వంలో మరిన్ని అభివృద్ధి సంక్షేమ పథకాలు అమలవుతాయని తెలిపారు. రాష్ట్రంలో 2014 నుంచి 2018 వరకు 17.17 శాతం సగటు వార్షిక ఆదాయ వృద్ధి రేటు నమోదైందన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో నవంబర్ వరకు 29.93 శాతం ఆదాయాభివృద్ధి రేటు సాధించినట్లు వివరించారు. జీఎస్టీ వసూళ్లలోనూ రాష్ట్రం మొదటి స్థానంలో ఉందన్నారు.

మిగతా 2లో




అన్ని పంచాయతీలకూ బీటీ రోడ్లు
అద్భుతంగా ఉండేలా ప్రణాళిక రూపొందించండి
నిధులు ఇవ్వటానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది
రోడ్లు, భవనాల శాఖ సమీక్షలో సీఎం కేసీఆర్
కాళేశ్వరంలో భూములు కోల్పోయిన వారికి వెంటనే పరిహారమివ్వండి
అధికారులకు ముఖ్యమంత్రి ఆదేశం
04


శనివారం కోల్‌కతాలోని బ్రిగేడ్ మైదానంలో ‘యునైటెడ్ ఇండియా ర్యాలీ’పేరుతో జరిగిన బహిరంగ సభకు హాజరైన జనం. వారిని ఉద్దేశించి ప్రసంగిస్తున్న పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ

రోజులు దగ్గరపడ్డాయి
మోడీ సర్కార్‌పై కోల్‌కతా సభలో పశ్చిమ బెంగాల్ సీఎం మమత ఫైర్
చంద్రబాబు, కుమారస్వామి, కేజ్రీవాల్, స్టాలిన్, ఖర్గే, అఖిలేశ్, శరద్‌పవార్ సహా 20 మంది హాజరు
సోనియా, రాహుల్, మాయావతి డుమ్మా.. త్వరలో మరిన్ని సభలకు వ్యూహం

“కేంద్రంలోని నరేంద్రమోడీ ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయి. నాలుగున్నరేళ్ల బీజేపీ పాలన అంతా కుంభకోణాలమయం. ఎన్నికల్లో గెలుపు కోసం మోడీ సర్కార్ దేశాన్ని లూటీ చేస్తోంది. బీజేపీకి రాజ్యాంగ వ్యవస్థలపై నమ్మకం లేదు. బీజేపీని అధికారం నుంచి దించేయడానికే ప్రతిపక్షాలు ఏకమయ్యాయి. వచ్చే లోక్ సభ ఎన్నికల్లో బీజేపీకి ఘోర పరాజయం తప్పదు. దేశానికి ప్రస్తుతం సమష్టి నాయకత్వ అవసరం. అందుకే 20 ప్రతిపక్ష పార్టీలకు చెందిన లీడర్లమంతా ఇక్కడ సమావేశమయ్యాం.
05


ధ్రువ్ అరోరా సాయికిరణ్

జేఈఈలో మెరిశారు మనోళ్లు
టాప్15లో నలుగురు మనోళ్లే
ఐఐటీ, ఎన్ఐటీల్లో ఇంజనీరింగ్ ప్రవేశాల కోసం నిర్వహించిన జేఈఈ మెయిన్స్ 2019 ఫలితాల్లో రాష్ట్ర విద్యార్థులు సత్తా చాటారు. దేశవ్యాప్తంగా 100 పర్సెంటైల్ సాధించిన 15 మందిలో మనోళ్లే నలుగురు ఉన్నారు. తెలంగాణ టాపర్‌గా ఆదెల్లి సాయికిరణ్ నిలిచారు. రాష్ట్రానికే చెందిన ఇందుకూరి జయంత్ ఫణిసాయి, కె.విశ్వనాథ్, బట్టేపాటి కార్తికేయ, ఏపీకి చెందిన బొజ్జ చేతన్‌రెడ్డి 100 పర్సెంటైల్ సాధించారు. కాగా, జేఈఈ మెయిన్స్ టాపర్‌గా మధ్యప్రదేశ్‌కు చెందిన ధ్రువ్ అరోరా నిలిచారు.
02




04
పోలీసులు స్వాధీనం చేసుకున్న ఫోన్లు, ల్యాప్‌ట్యాప్, లామినేషన్ మిషన్

సిమ్ సిగ్నల్ పోయిందా..
బ్యాంకులో సొమ్ము గోవిందా
ఫిషింగ్ మెయిళ్లు, హ్యాకింగ్ ద్వారా యూజర్ల బ్యాంకు అకౌంట్లు, కార్డులు, ఫోన్ నంబర్, వ్యక్తిగత వివరాలను సేకరిస్తారు. ఈ డేటాతో నకిలీ ఐడీ కార్డులను తయారు చేసి, సిమ్ కార్డుల స్వాపింగ్ కోసం దరఖాస్తు చేస్తారు. కస్టమర్ల ఫోన్‌లోని సిమ్ డీయాక్టివేటై.. అదే నంబర్‌తో తాము తీసుకున్న సిమ్ యాక్టివేట్ కాగానే పని మొదలుపెడతారు. బ్యాంకు అకౌంట్లు, కార్డుల వివరాలతో ఆన్‌లైన్‌లో లాగిన్ అయి సొమ్మును ట్రాన్స్‌ఫర్ చేసేసుకుంటారు. ఇందుకోసం ఆ మొబైల్ నంబర్లకు వచ్చిన ఓటీపీలను వినియోగించుకుంటారు. ఇలా హైటెక్ పద్ధతిలో కోట్లు కొల్లగొడుతున్న కోల్‌కతా ముఠాను సైబరాబాద్ పోలీసులు పట్టుకున్నారు. ఆరుగురిని అరెస్టు చేశారు. ఈ సైబర్ దొంగలు దేశవ్యాప్తంగా ఇప్పటివరకు 20 కోట్లకుపైగా సొమ్మును స్వాహా చేశారు.


శనివారం గుజరాత్‌లో ఎల్అండ్‌టీ ఫిరంగుల ఫ్యాక్టరీని ప్రారంభించిన తర్వాత ఓ వార్ ట్యాంక్‌లో దర్జాగా ప్రధాని మోడీ

జనం సొమ్ము దోచుకోవడానికే మహాకూటమి
ప్రధాని నరేంద్ర మోడీ ధ్వజం
05


02

ఏ దేశానికైనా భవిష్యత్తు యువతే
అంతర్జాతీయ యువ నాయకత్వ సదస్సులో అన్నా హజారే
“ఏ దేశానికైనా యువతే భవిష్యత్తు. యువత శక్తివంతులుగా ఉంటే దేశం శక్తివంతంగా ఉంటుంది. సంపూర్ణంగా జీవించడం అంటే తినడం, తాగడం, నిద్రపోవడం కాదు.. లక్ష్యాలను ఏర్పరచుకొని వాటిని సాధించడం” తెలంగాణ జాగృతి అంతర్జాతీయ యువజన నాయకత్వ సదస్సులో ప్రముఖ గాంధేయవాది అన్నాహజారే అన్న మాటలివీ. ‘గాంధేయ మార్గంలో సుస్థిర అభివృద్ధినూతన ఆవిష్కరణ’అంశం ప్రధాన ఎజెండాగా జరిగిన ఈ సదస్సు శనివారం హైదరాబాద్‌లోని నోవాటెల్ హోటల్లో ప్రారంభమైంది. ఈ సదస్సుకు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎంపీ కవిత అధ్యక్షత వహించారు.

వెన్‌కాబ్
(ఫారం గేట్ ధర)

హైదరాబాద్ 77.00	వరంగల్ 77.00	మహబూబ్‌నగర్ 77.00
కరీంనగర్ 78.00	నిజామాబాద్ 77.00	ఖమ్మం 76.00


కార్తికేయ జయంత్ విశ్వనాథ్ చేతన్‌రెడ్డి

'జేఈఈ'లో మెరిసిన మనోళ్లు

టాప్15లో నలుగురు.. ఏపీ నుంచి ఒకరు

- టాపర్‌గా మధ్యప్రదేశ్‌కు చెందిన ధ్రువ్ అరోరా
- తెలంగాణ టాపర్ సాయికిరణ్

హైదరాబాద్, వెలుగు: దేశంలోని ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలైన ఐఐటీ, ఎన్ఐటీల్లో ఇంజనీరింగ్ ప్రవేశాల కోసం నిర్వహించిన జేఈఈ మెయిన్స్-2019 ఫలితాల్లో రాష్ట్ర విద్యార్థులు సత్తా చాటారు. దేశవ్యాప్తంగా 100 పర్సంటైల్ సాధించిన15 మందిలో మనోళ్లే నలుగురు ఉన్నారు. ఈ నెల 9 నుంచి 12 వరకు దేశవ్యాప్తంగా జేఈఈ మెయిన్స్ ఎగ్జామ్స్ జరగ్గా 8,74,469 మంది పరీక్షలు రాశారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) శనివారం ఫలితాలను విడుదల చేసింది. టాప్ 15లో ఐదుగురు తెలుగు రాష్ట్రాల విద్యార్థులు ఉన్నారు. తెలంగాణ నుంచి నలుగురు, ఏపీ నుంచి ఒకరు ఉండగా, మహారాష్ట్ర నుంచి ముగ్గురు, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్ నుంచి ఇద్దరు, మధ్యప్రదేశ్, కర్ణాటక, పంజాబ్ నుంచి ఒక్కొక్కరు 100 పర్సంటైల్ సాధించారు. తెలంగాణ టాపర్‌గా సిద్దిపేట జిల్లా పాములపల్లి గ్రామానికి(ప్రస్తుతం గజ్వేల్‌లో స్థిరపడ్డారు) చెందిన ఆదెల్లి సాయికిరణ్ నిలిచారు. రాష్ట్రానికే చెందిన ఇందుకూరి జయంత్ ఫణిసాయి, కె.విశ్వనాథ్, బట్టేపాటి కార్తికేయ కూడా 100 పర్సంటైల్ సాధించారు. తెలంగాణ నుంచి సుమారు 70 వేల మంది హాజరయ్యారు.

టాపర్ ధ్రువ్ అరోరా

జేఈఈ మెయిన్స్ టాపర్‌గా మధ్యప్రదేశ్‌కు చెందిన ధ్రువ్ ఆరోరా నిలిచారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన బొజ్జ చేతన్‌రెడ్డి, మహారాష్ట్రకు చెందిన రాజ్ఆర్యన్అగర్వాల్, అంకిత్‌కుమార్‌మిశ్రా, కార్తికేయ చంద్రేశ్‌గుప్తా, రాజస్థాన్‌కు చెందిన సంబిత్ బెహరా, శుభంకర్ గంభీర్, ఉత్తరప్రదేశ్‌కు చెందిన నమన్ గుప్తా, హిమాన్షు గౌరవ్ సింగ్, కర్ణాటకకు చెందిన కెవిన్ మార్టిన్, పంజాబ్‌కు చెందిన జయేశ్ సింగ్లా 100 పర్సంటైల్ సాధించిన వారిలో ఉన్నారు.

హ్యాపీగా ఉంది

జేఈఈ మెయిన్స్‌లో 100 పర్సంటైల్ సాధించడం ఆనందంగా ఉంది. మెయిన్స్ కోసం 2 నెలల నుంచి ప్రిపేర్ అవుతున్న. ఐఐటీ అడ్వాన్స్‌లో టాప్100లోపు ర్యాంకు సాధించడమే లక్ష్యం. మేం గజ్వేల్‌లో ఉంటాం. నారాయణ కాలేజీ మాదాపూర్ బ్రాంచ్‌లో చదువుతున్నా. తల్లిదండ్రులు, టీచర్ల సహకారంతోనే ఈ ర్యాంకు సాధించా.

- సాయికిరణ్, తెలంగాణ టాపర్

టీఆర్‌టీ ఫలితాలు విడుదల

అర్హులు లేక ఖాళీగానే పలు పోస్టులు

హైదరాబాద్, వెలుగు: టీచర్ రిక్రూట్‌మెంట్ టెస్ట్(టీఆర్టీ) స్కూల్ అసిస్టెంట్, ఎస్‌జీటీ, పీఈటీ తదితర 925 పోస్టులకు సంబంధించిన తుది ఫలితాలను శనివారం టీఎస్‌పీఎస్సీ విడుదల చేసింది. స్కూల్ అసిస్టెంట్ పోస్టుల్లో మ్యాథ్స్(తెలుగు మీడియం) 191, సోషల్(ఇంగ్లీష్ మీడియం) 4, సోషల్(హిందీ మీడియం) 1, ఫిజికల్ ఎడ్యుకేషన్(తెలుగు మీడియం) 9 పోస్టుల ఫలితాలను ప్రకటించింది. పీఈటీ (ఉర్దూ మీడియం) 4, పీఈటీ (ఇంగ్లీష్ మీడియం) 1, ఎస్‌జీటీ (ఉర్దూ) 281 పోస్టుల వివరాలనూ వెల్లడించింది. ఎస్‌జీటీ (ఉర్దూ) పోస్టులకు 636 ఖాళీలు ఉండగా అర్హులు లేక కేవలం 320 పోస్టులనే భర్తీ చేశామని కమిషన్ అధికారులు తెలిపారు. దివ్యాంగుల విభాగంలో 35 పోస్టులను మెడికల్ సర్టిఫికెట్ల పరిశీలన తర్వాత భర్తీ చేస్తామని చెప్పారు. స్కూల్ అసిస్టెంట్ మ్యాథ్స్(తెలుగు మీడియం) విభాగంలో 215 ఖాళీలకు 191 పోస్టులను భర్తీ చేశామని, దివ్యాంగులకు కేటాయించిన 16 ఖాళీలను మెడికల్ సర్టిఫికెట్ల పరిశీలన తర్వాత భర్తీ చేస్తామని చెప్పారు. మరో ఆరు పోస్టులకు సంబంధించి కోర్టులో కేసులు నడుస్తున్నాయని, ఏజెన్సీ సమస్యతో రెండు పోస్టుల ఫలితాలను విడుదల చేయలేదని వివరించారు. వీటితో పాటు అర్హులు లేక మరో 16 స్కూల్ అసిస్టెంట్ పోస్టులను భర్తీ చేయలేదని అధికారులు చెప్పారు.

ఏ దేశానికైనా యువతే భవిత

లక్ష్యాలను పెట్టుకుని ముందుకు సాగాలి ■ అంతర్జాతీయ యువ నాయకత్వ సదస్సులో అన్నా హజారే

హైదరాబాద్, వెలుగు: ప్రపంచం ఎదుర్కొంటున్న సమస్యలకు యువతే పరిష్కార మార్గాలు కనుగొనాలని తెలంగాణ జాగృతి అంతర్జాతీయ యువజన నాయకత్వ సదస్సు పిలుపునిచ్చింది. దేశాన్ని మార్చాలంటే ఏవో పెద్ద పెద్ద పనులు చేయాల్సిన పని లేదని, ఒక్కొక్కరు ఒక్కో గ్రామాన్ని బాగు చేస్తే చాలని పేర్కొంది. 'గాంధేయ మార్గంలో సుస్థిర అభివృద్ధి-నూతన ఆవిష్కరణ'అంశం ప్రధాన ఎజెండాగా తెలంగాణ జాగృతి అంతర్జాతీయ యువనాయకత్వ సదస్సు శనివారం హైదరాబాద్‌లోని నోవాటెల్ హోటల్లో ప్రారంభమైంది. రెండ్రోజుల ఈ సదస్సులో 110 దేశాలకు చెందిన 500 మంది ప్రతినిధులు పాల్గొంటున్నారు. 40 మంది ప్రముఖులు ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరవుతున్నారు. ప్రముఖ గాంధేయవాది అన్నాహజారే సమావేశాలను ప్రారంభించారు. సార్క్ మాజీ ప్రధాన కార్యదర్శి అర్జున్ బహదూర్ థాపా ముఖ్య అతిథిగా పాల్గొనగా.. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎంపీ కవిత అధ్యక్షత వహించారు.


యువతే శక్తి..

సదస్సులో అన్నా హజారే మాట్లాడారు. ఏ దేశానికైనా యువతే భవిష్యత్తు అని, యువత శక్తివంతులుగా ఉంటే దేశం శక్తివంతంగా ఉంటుందని చెప్పారు. "25 ఏళ్ల వయసులో నా దగ్గర డబ్బు, ఆస్తి, పేరు ప్రఖ్యాతులేవీ లేవు. కానీ గుండెనిండా పట్టుదల ఉండేది. ఆ పట్టుదలతోనే మా ఊరు రాలెగావ్ సిద్దిని మార్చాలనుకున్నా. ఆత్మహత్య చేసుకోవాలన్న ఆలోచన నుంచి నన్ను మహాత్మాగాంధీ ఆత్మకథ బయటపడేసింది. జీవితసారం తెలుసుకున్నా. నేను చాలా మంది యువకులను చూశాను. 15, 20 ఏళ్లకే సిగరెట్ తాగుతూ కనిపిస్తారు. అలాంటి వాళ్లు చివరికి టీబీ, కేన్సర్ వంటి జబ్బులను తప్ప దేశం కోసం ఏమీ సాధించలేరు. సంపూర్ణంగా జీవించడం అంటే తినడం, తాగడం, నిద్రపోవడం కాదు.. లక్ష్యాలను ఏర్పరచుకొని వాటిని సాధించాలి. త్యాగాలు చేయాల్సిన పనిలేదు. మీ జీవితంలోకి గాంధేయమార్గాన్ని ఆహ్వానించండి. మంచి మార్పు తీసుకొచ్చేలా ప్రయత్నించండి.."అని హజారే పిలుపునిచ్చారు.

కలిసి ఉంటే సాధిస్తాం

ప్రపంచ దేశాలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు యువత పరిష్కారాలు చూపించాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎంపీ కవిత పేర్కొన్నారు. వ్యక్తులుగా ఎవరికివారు ఏమీ చేయలేమని, సమిష్టి కృషితో ఎలాంటి సమస్యలనైనా అధిగమించవచ్చని చెప్పారు. సుస్థిర అభివృద్ధి కోసం ఉత్సాహంగా పని చేయాలన్నారు. యువత వల్ల వచ్చిన ఎన్నో సమస్యలకు ఈ సదస్సులోని చర్చల ద్వారా పరిష్కార మార్గాలు లభిస్తాయని ఆకాంక్షించారు. యువత తలచుకుంటే సాధించలేనిదంటూ ఏదీ లేదని ఎంఐఎం అధ్యక్షుడు, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ అన్నారు. సదస్సుకు హాజరైన వారిని వివిధ ప్యానెల్స్‌గా విభజించి పేదరిక నిర్మూలన, ఆహార సమృద్ధి, ఆరోగ్యం, నాణ్యమైన విద్య, జెండర్ ఈక్వాలిటీ వంటి పదిహేడు అంశాలపై చర్చలు, విశ్లేషణలు నిర్వహించారు. ఆదివారం వివిధ అంశాలపై నిర్వహించే చర్చా కార్యక్రమాల్లో అర్పిత్ చతుర్వేది, పుల్లెల గోపీచంద్, కమల్‌సింగ్, షబ్నం సిద్దిఖీ, ఆండ్రూ ఫ్లెమింగ్, సీమా మల్హోత్రా తదితరులు ప్రసంగిస్తారు.


గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సామాజిక కార్యకర్త అన్నా హజారే, ఎంపీ కవిత

- కలిసి ఉంటే ఏదైనా సాధిస్తాం: ఎంపీ కవిత
- తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో కార్యక్రమం
- 110 దేశాల నుంచి యువ ప్రతినిధులు హాజరు

మాలావత్ పూర్ణకు జాగృతి అవార్డు

అతి చిన్న వయసులో ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించిన మాలావత్ పూర్ణకు తెలంగాణ జాగృతి సంస్థ 'ఎక్స్ట్రార్డినరీ యూత్ అచీవర్' పురస్కారాన్ని అందజేసింది. ఆమెతోపాటు దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన గర్విత సేథీ, గౌరవ్ గుప్తా, శిఖాధావన్, లక్ష్మీ ప్రసాద్ బోడ, చిరాగ్ గుప్తా, సర్వేష్ పాండే, రాహుల్ నాయుడుకు అన్నా హజారే, ఎంపీ కవిత చేతుల మీదుగా యూత్ ఫెలోషిప్‌లను ఇచ్చింది. యువ నాయకులను తయారు చేయడంలో భాగంగా వివిధ రంగాల్లో ప్రతిభ చూపిన యువతకు పురస్కారాలను అందజేసినట్టు పేర్కొంది. చిన్న వయసులోనే ఎవరెస్టును అధిరోహించిన పూర్ణకు ఎప్పుడూ అండగా ఉంటామని ఎంపీ కవిత పేర్కొన్నారు.

టెక్నాలజీ మరింత అభివృద్ధి చెందాలి

డీఆర్‌డీవో చైర్మన్ సతీశ్‌రెడ్డి

హైదరాబాద్, వెలుగు: దేశానికి కావల్సిన ఆయుధాలను రూపొందించడమే కాకుండా విదేశాలకు ఎగుమతి చేసేలా సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందని డీఆర్‌wడీవో చైర్మన్ సతీశ్‌రెడ్డి అన్నారు. 'రక్షణ రంగంలో స్వావలంబన' అనే అంశంపై ఫోరమ్ ఫర్ ఇంటిగ్రేటెడ్ నేషనల్ సెక్యూరిటీ సంస్థ నిర్వహించిన సదస్సులో ఆయన శనివారం పాల్గొన్నారు. రక్షణ రంగంలో మరిన్ని పరిశోధనలు జరిపి నూతన ఆయుధాలను కనుక్కోవాలన్నారు. రక్షణ రంగ ఉత్పత్తులు తయారు చేసే దిశగా యువ శాస్త్రవేత్తలను యూనివర్సిటీలు, పరిశోధనా సంస్థలు ప్రోత్సహించాలని సూచించారు. మేక్ ఇన్ ఇండియాలో భాగంగా భారత రక్షణ రంగానికి చెందిన వస్తువులను దేశీయ పరిజ్ఞానంతో ఉత్పత్తి చేసేందుకు కేంద్రం ముందుకు వెళ్తోందన్నారు. సదస్సులో జాతీయ భద్రత సలహాదారు ఆర్ఎన్ రవి, రక్షణ రంగ సైంటిస్టులు పాల్గొన్నారు.

అసెంబ్లీ ఉందనే వెళ్లలేదు

కోల్‌కతా ర్యాలీకి కేసీఆర్ హాజరుకాకపోవడంపై ఎంపీ కవిత

దేశ రాజకీయాల్లో అసలైన రాజకీయ క్రీడ సార్వత్రిక ఎన్నికల తర్వాతే మొదలవుతుందని ఎంపీ కవిత అన్నారు. అసెంబ్లీ సమావేశాల కారణంగానే కోల్‌కతాలో బెంగాల్ ముఖ్యమంత్రి నిర్వహించిన ర్యాలీలో సీఎం కేసీఆర్ పాల్గొనలేదని చెప్పారు. శనివారం హైదరాబాద్‌లో ఆమె మీడియాతో మాట్లాడారు. 'రానున్న రోజుల్లో దేశ రాజకీయాల్లో కేసీఆర్ కీలకపాత్ర పోషిస్తారు. ఫెడరల్ ఫ్రంట్ వేగంగా రూపుదిద్దుకుంటోంది. ఇప్పటికే చాలా రకాల ఫ్రంట్స్ ప్రచారంలో ఉన్నాయి. వాటిలో నాయకత్వ సమస్య ఉంది. వారిలో వారికే నాయకుడెవరన్నదానిపై స్పష్టత లేదు. ఫెడరల్ ఫ్రంట్‌లో నాయకుడి ప్రస్తావన లేదు. దేశ భవిష్యత్తును మార్చివేసే ఎజెండాను మేం ప్రతిపాదిస్తున్నాం. మోడీకో, రాహుల్ గాంధీకో మొక్కాల్సిన అవసరం మాకు లేదు. ఎన్నికలకు ముందు ఏ అంశాలకు కట్టుబడి ఉంటామో, ఎన్నికల తర్వాత కూడా అలాగే ముందుకెళ్తాం..''అని కవిత చెప్పారు. ప్రస్తుతము న్న రాజకీయ వ్యవస్థలో యువత చురుగ్గా పాల్గొనేందుకు అవకాశాలు తక్కువని, అందుకే యువతకు, మహిళలకు రిజర్వేషన్ కల్పించాలని తాను కోరుకుంటున్నానని తెలిపారు. ఈ విషయాన్ని పార్లమెంటులో ప్రస్తావిస్తానన్నారు.

సీఎన్ఆర్ రావుకు ఇంటర్నేషనల్ ప్రైజ్

బెంగళూరు: ప్రముఖ సైంటిస్ట్, భారత రత్న, ప్రొఫెసర్ సీఎన్ఆర్ రావుకు మరో గౌరవం దక్కింది. సెంటర్ ఫర్ అడ్వాన్స్ డ్ మెటీరియల్స్ ఆఫ్ యూఏఈ మొదటిసారి ప్రవేశపెట్టిన షేక్ సౌద్ ఇంటర్నేషనల్ ప్రైజ్‌కు సీఎన్ఆర్ రావును ఎంపిక చేసింది. లక్ష యూఎస్ డాలర్ల నగదుతో పాటు మెడల్‌ను ఫిబ్రవరి 25న యూఏఈలో జరగనున్న అడ్వాన్స్ డ్ మెటీరియల్స్ ఇంటర్నేషనల్ వర్క్ షాప్ సందర్భంగా ఆయనకు అందించనున్నారు. ప్రస్తుతం సీఎన్ఆర్ రావు జవహర్‌లాల్ నెహ్రూ అడ్వాన్స్ డ్ సైంటిఫిక్ రీసెర్చ్ సెంటర్‌కు గౌరవ అధ్యక్షుడిగా ఉన్నారు. సైన్స్ రంగంలో ఆయన సేవలకు 2014లో భారత రత్న పురస్కారాన్ని అందుకున్నారు.

'ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి'

హైదరాబాద్, వెలుగు: తెలంగాణ గిరిజన గురుకుల విద్యాలయ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రతిభా కళాశాలలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ఆ శాఖ కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. పదో తరగతి విద్యార్థులు హైదరాబాద్‌లోని ప్రతిభా కాలేజీలో ఇంటర్ చదివేందుకు అర్హులని, దరఖాస్తు గడువును ఈ నెల 21 నుంచి 30 వరకు పొడిగించామన్నారు. www.tgtwgurukulam.telangana.gov.in లింక్ నుంచి దరఖాస్తు ఫాం డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు.

మనమే టాప్

(మొదటిపేజీ తరువాయి)

మార్చి నెలాఖరు వరకు మిషన్ భగీరథ పనులు వందకు వందశాతం పూర్తి చేసి, ప్రతి ఇంటికీ నల్లా ద్వారా మంచినీరు అందిస్తామని గవర్నర్ స్పష్టం చేశారు. ఖమ్మంలో సీతారామ ప్రాజెక్టుకు అన్ని అనుమతులు లభించాయని, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు కూడా అన్ని అనుమతులు పొందేందుకు ప్రభుత్వం తీవ్రంగా కృషి చేస్తోందని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని, ఈ ఏడాది వర్షాకాలంలోనే గోదావరి నది ద్వారా ఎత్తిపోతలు ప్రారంభిస్తామని చెప్పారు. మిషన్ కాకతీయలో భాగంగా నాలుగు దశల్లో 20,171 చెరువులను పునరుద్ధరించినట్లు తెలిపారు. ఇరిగేషన్ శాఖలో ప్రాజెక్టుల కోసం నాలుగున్నరేళ్లలో రూ. 77,777 కోట్లు ఖర్చు చేశామని చెప్పారు. రాష్ట్రంలో ప్రభుత్వం అన్ని వర్గాలకు 24 గంటలు విద్యుత్‌ను సరఫరా చేస్తోందన్నారు. సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ ప్రకటించిన వార్షిక నివేదిక ప్రకారం తలసరి విద్యుత్ వినియోగం వృద్ధిరేటులో దేశంలోనే రాష్ట్రం మొదటి స్థానంలో నిలిచిందన్నారు. రైతు బంధు పథకం దేశానికే ఆదర్శంగా నిలిచిందని, ఈ పథకాన్ని ఐక్యరాజ్యసమితి కూడా ప్రశంసించడం రాష్ట్రానికే గర్వకారణమన్నారు. రైతు బీమా ద్వారా ఇప్పటివరకు 5675 మంది రైతు కుటుంబాలకు 283 కోట్ల బీమా అందించినట్లు వివరించారు.


అసెంబ్లీ హాల్‌లో ప్రసంగిస్తున్న గవర్నర్. పక్కన మండలి చైర్మన్ స్వామిగౌడ్, స్పీకర్ పోచారం

కుల వృత్తులు, విద్య, వైద్యం

ప్రభుత్వం కుల వృత్తులను ప్రోత్సహిస్తూ, వృత్తిదారులకు అండగా నిలుస్తోందని గవర్నర్ పేర్కొన్నారు. యాదవ, కురుమలకు ఇప్పటివరకు 75 లక్షల గొర్రెలు పంపిణీ చేసిందన్నారు. పశువుల కోసం 100 సంచార పశు వైద్య శాలలను నడుపుతోందని చెప్పారు. చేనేత కార్మికులకు నూలు, రసాయనాలపై 50శాతం సబ్సిడీ కల్పిస్తున్నామని తెలిపారు. చేనేత కార్మికులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు వరంగల్‌లో మెగా టెక్స్‌టైల్స్ పార్క్‌ను నిర్మిస్తున్నామని, సిరిసిల్ల, గద్వాల్‌లో టెక్స్‌టైల్ హబ్‌ల ఏర్పాటుకు ప్రతిపాదించినట్లు ఆయన వివరించారు. కేజీ టు పీజీ విద్యా విధానంలో భాగంగా పెద్ద ఎత్తు రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని చెప్పారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుకు ముందు 296 రెసిడెన్షియల్ స్కూళ్లే ఉండేవని, ప్రస్తుతం 542 కొత్త పాఠశాలలను ఏర్పాటు చేసిందన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి మరో 119 పాఠశాలలు ప్రారంభించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వాస్పత్రుల్లో మందుల కొనుగోలుకు కేటాయించే బడ్జెట్‌ను మూడింతలు పెంచామన్నారు. వైద్య విద్యను మరింత విస్తరించజేయడానికి రాష్ట్రంలో కొత్తగా నాలుగు వైద్య కళాశాలలను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. సిద్దిపేట, మహబూబ్‌నగర్ కళాశాల్లో ప్రవేశాలు ప్రారంభమయ్యాయని, సూర్యాపేట, నల్లగొండలో వచ్చే ఏడాది నుంచి మొదలవుతాయని తెలిపారు.

కొత్త జిల్లాలుగా ములుగు, నారాయణపేట

పరిపాలనా సౌలభ్యం కోసం 10 జిల్లాలను ఇప్పటికే 31 జిల్లాలుగా చేశామని, కొత్తగా నారాయణపేట, ములుగు జిల్లాలను ఏర్పాటు చేసుకుంటున్నామని గవర్నర్ తెలిపారు. మరింత పకడ్బందీగా శాంతి భద్రతలను పర్యవేక్షించడానికి ప్రభుత్వం కొత్త పోలీస్ కమిషనరేట్లను ఏర్పాటు చేసిందన్నారు. త్వరలోనే హైదరాబాద్‌లో అంతర్జాతీయ స్థాయి పోలీస్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ ప్రారంభం అవుతుందన్నారు.

కొత్త జోనల్ వ్యవస్థ ప్రకారమే నియామకాలు

స్థానికుల హక్కుల పరిరక్షణ కోసం కొత్త జిల్లాల ప్రాతిపదికన ప్రభుత్వం కొత్త జోనల్ వ్యవస్థను ఏర్పాటు చేసిందని గవర్నర్ చెప్పారు. లోకల్ కేడర్ ఉద్యోగాల్లో 95 శాతం అవకాశాలు స్థానికులకే లభించేలా చట్టం చేశామన్నారు. డిస్ట్రిక్ట్ కేడర్‌తోపాటు ఏడు జోన్లు, రెండు మల్టీ జోన్లు ఏర్పాటు చేసిందని, కొత్త జోనల్ వ్యవస్థ ప్రకారమే రాష్ట్రంలో నియామకాలు జరుగుతాయని వివరించారు. టీఎస్ ఐపాస్‌తో కేవలం 15 రోజుల్లోనే పరిశ్రమల స్థాపనకు అన్ని రకాల అనుమతులు ఇస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రానికి లక్షా ముప్పై రెండు వేల కోట్ల పెట్టుబడులు తరలొచ్చాయని, పరిశ్రమలతో 8.37లక్షల మందికి ఉద్యోగావకాశాలు లభించాయని చెప్పారు.

ఇంకా ఎన్నో చేస్తాం

ఆసరా పింఛన్లను రూ. వెయ్యి నుంచి రూ. 2016, దివ్యాంగులకు రూ. 1,500 నుంచి రూ. 3,016 పెంచాలని ప్రభుత్వం నిర్ణయించిందని గవర్నర్ తెలిపారు. వృద్ధాప్య పింఛన్ వయోపరిమితిని సడలించి, 57 ఏళ్లు నిండినవారందరికీ పెన్షన్లు ఇస్తామన్నారు. నిరుద్యోగులకు నెల నెలా రూ. 3,016 భృతి అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రస్తుత పద్ధతిలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణాన్ని కొనసాగిస్తూనే, సొంత స్థలం ఉన్న అర్హులకు ఇంటి నిర్మాణానికి రూ. 5 లక్షల నుంచి రూ.6 లక్షల వరకు సహాయం అందిస్తామన్నారు. రైతులకు లక్ష వరకు ఉన్న పంట రుణాలను మాఫీ చేస్తామని, ఈ ఏడాది నుంచి రైతు బంధు సహాయాన్ని సంవత్సరానికి ఎకరాకు రూ.8 వేల నుంచి రూ. 10వేలకు పెంచి అందజేస్తామని తెలిపారు. రైతు సమన్వయ సమితి సభ్యులకు గౌరవ భృతి ఇస్తామన్నారు. చట్టసభల్లో బీసీలకు 33 శాతం, మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అమలు కోసం ప్రభుత్వం పోరాడుతుందని పేర్కొన్నారు. ఎస్టీలకు 10 శాతం, మైనారిటీలకు 12 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీర్మానం చేసిందని, వీటి అమలుకు కేంద్రంతో రాజీలేని పోరాటం చేస్తామన్నారు. ఎస్సీ వర్గీకరణ కోసం అసెంబ్లీ తీర్మానం చేయించి కేంద్రానికి పంపిందని, దీని ఆమోదానికి కృషి చేస్తూనే ఉంటుందని తెలిపారు. రైతులకు గిట్టుబాటు ధర కోసం పెద్ద ఎత్తున ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేయాలని ఆలోచిస్తున్నట్లు చెప్పారు.

గవర్నర్ ప్రసంగానికి నేడు ధన్యవాదాలు

గవర్నర్ ప్రసంగానికి ఆదివారం ఉభయ సభలు ధన్యవాదాలు తెలుపుతాయి. ఉదయం 10.30 గంటలకు చర్చ మొదలవుతుంది. అసెంబ్లీలో ధర్మపురి ఎమ్మెల్యే కొప్పుల ఈశ్వర్ చర్చను ప్రారంభిస్తారు. బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి బలపరుస్తారు. సభా నాయకుడిగా కేసీఆర్, ప్రతిపక్ష నేత మల్లు భట్టి విక్రమార్క, ఎంఐఎం, బీజేపీ, టీడీపీ ఎమ్మెల్యేలు ప్రసంగిస్తారు. మండలిలో పల్లా రాజేశ్వర్‌రెడ్డి చర్చను ప్రారంభిస్తారు. బోడకుంటి వెంకటేశ్వర్లు బలపరుస్తారు. ఉభయ సభల్లో మధ్యాహ్నం 1.30 గంటల వరకు చర్చ నడిచిన తర్వాత సమావేశాలు నిరవధికంగా వాయిదా పడుతాయి.

మాకు నచ్చలే: కాంగ్రెస్

గవర్నర్ ప్రసంగం అనంతరం సీఎల్పీ కార్యాలయంలో భట్టి విక్రమార్కతోపాటు పలువురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు మీడియాతో మాట్లాడారు. ముస్లిం రిజర్వేషన్లపై గవర్నర్ ప్రసంగంలో స్పష్టత లేదని భట్టి ఆరోపించారు. ఎన్నికల ప్రచార సభలో కేసీఆర్ స్పీచ్‌ను గవర్నర్ కాపీ కొట్టినట్టుందని, రుణమాఫీ, పింఛన్లు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, నిరుద్యోగ భృతి, ఉద్యోగాలు, రిటైర్మెంట్ వయసుపై ప్రసంగంలో స్పష్టత లేదని ఎమ్మెల్సీ షబ్బీర్ అలీ అన్నారు. గవర్నర్ ప్రసంగంలో కొత్తదనమేమీ లేదని ఎమ్మెల్యే శ్రీధర్ బాబు ఆరోపించారు. కాంగ్రెస్ సంస్కరణల వల్లే మిగులు విద్యుత్ సాధ్యమైందన్నారు. గవర్నర్ ప్రసంగంలో రుణమాఫీపై క్లారిటీ లేదని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ఆరోపించారు. రైతు బంధుపై శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.


మ్యూజియంలో గాంధీ విగ్రహం పక్కన ప్రధాని మోడీ

సమాజానికి అద్దం పడుతున్న సిన్మాలు

'నేషనల్ మ్యూజియం ఆఫ్ ఇండియన్ సినిమా' ప్రారంభోత్సవంలో ప్రధాని మోడీ

ముంబై: సిన్మాలు సమాజాన్ని ప్రతిబింబిస్తున్నాయని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. సమాజంలో నెలకొన్న సమస్యలను, వాటి పరిష్కారాలను దర్శకులు అద్భుతంగా చూపిస్తున్నారని అభినందించారు. కాలానుగుణంగా సిన్మారంగంలో కూడా మార్పులు వచ్చాయని ముంబైలో శనివారం 'నేషనల్ మ్యూజియం ఆఫ్ ఇండియన్ సినిమా' ను ప్రారంభించిన సందర్భంగా ఆయన అన్నారు. ఒకప్పుడు పెద్ద నగరాలకు చెందిన వారే ఫిల్మ్ ఇండస్ట్రీలోకి ప్రవేశించేవారన్నారు. మారిన పరిస్థితుల్లో చిన్న చిన్న పట్టణాల నుంచి కూడా ఆర్టిస్టులు, టెక్నీషియన్లు సిన్మారంగంలోకి వస్తున్నారన్నారు. ఇండియన్ సిన్మాకు అంతర్జాతీయంగా మంచి పేరు ఉందన్నారు. సిన్మా రంగం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి కేంద్రం కట్టుబడి ఉందన్నారు. షూటింగ్ లకు అనుమతి ఇవ్వడానికి సింగిల్ విండో పద్ధతిని ప్రవేశపెట్టాలని సర్కార్ భావిస్తున్నట్లు చెప్పారు. పైరసీని నిరోధించడానికి 1952 నాటి సినిమాటోగ్రఫీ చట్టంలో సవరణలు తీసుకురావడానికి కేంద్రం సిద్ధంగా ఉందన్నారు. చరిత్ర, సైన్స్ ఆధారంగా సిన్మాలు తీయాలని దర్శకులను ఆయన కోరారు. మహారాష్ట్ర గవర్నర్ విద్యాసాగర రావు, ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌తో పాటు పలువురు బాలీవుడ్ ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

రూ. 27,12,490 కోట్లు

ఇదీ నాలుగున్నరేళ్లలో మోడీ సర్కార్ చేసిన అప్పు

(మొదటిపేజీ తరువాయి)

నాలుగున్నరేళ్ల కాలంలో పబ్లిక్ డెట్ (దేశీ రుణాలు, విదేశీ రుణాలు) 51.7 శాతం పెరిగింది. అది 2014 జూన్ నాటికి రూ.48 లక్షల కోట్లు ఉండగా 2018 సెప్టెంబర్ నాటికి రూ.73 లక్షల కోట్లకు చేరింది. ఈ మొత్తంలో దేశీయ రుణాలే 68 లక్షల కోట్ల రూపాయలు. ప్రస్తుత ఎన్డీయే హయాంలో మార్కెట్ లోన్లు 47.5 శాతం పెరిగి రూ.52 లక్షల కోట్లకు చేరాయి. ఈ ఆర్థిక సంవత్సరం ద్రవ్యలోటు టార్గెట్ ఎనిమిది నెలల్లోనే దాటిపోయింది. మార్చి చివరినాటికి ఈ టార్గెట్ రూ. 6.24 లక్షల కోట్లు ఉండగా.. నవంబర్ వరకు రూ. 7.17 లక్షల కోట్లు అయింది.

కొత్త పథకాలకూ తప్పదా?

పార్లమెంట్‌లో ఫిబ్రవరి 1న తాత్కాలిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. ఇందు కోసం ఆర్థిక మంత్రిత్వ శాఖ చేస్తున్న కసరత్తు చివరి దశకు చేరుకుంది. ఇది మోడీ ప్రభుత్వానికి చివరి బడ్జెట్. త్వరలో జరిగే లోక్‌సభ ఎన్నికల్లో ఓటర్లను ప్రసన్నం చేసుకోవడమే లక్ష్యంగా ఈ బడ్జెట్‌ను రూపొందిస్తున్నట్లు, ప్రజాకర్షక పథకాలను ప్రవేశపెట్టనున్నట్లు కథనాలు వెలువడుతున్నాయి. రైతులు, మధ్యతరగతి ప్రజలను దృష్టిలో పెట్టుకొని పథకాలను ప్రకటించే అవకాశం ఉంది. వీటికి రూ. లక్ష కోట్లు ఖర్చవుతాయని, అప్పులు చేయక తప్పదని ఆర్థిక రంగ నిపుణులు అంటున్నారు.

రేపే తొలిదశ

పంచాయతీల్లో 769 ఏకగ్రీవం.. 3,710 గ్రామాల్లో ఎన్నికలు

హైదరాబాద్, వెలుగు: గ్రామ పంచాయతీ తొలి దశ ఎన్నికలకు మరో 24 గంటలే మిగిలి ఉంది. హోరాహోరీగా సాగిన ప్రచారం శనివారం సాయంత్రం ముగిసింది. సోమవారం (21న) ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్ జరగనుంది. మధ్యాహ్నం 2 గంటల నుంచి కౌంటింగ్ మొదలవుతుంది. ఆ వెంటనే సర్పంచ్, వార్డు మెంబర్ల ఫలితాలు ప్రకటిస్తారు. గెలిచిన వారికి ఆర్వో సర్టిఫికెట్ అందజేస్తారు. ఉప సర్పంచ్‌నూ ఎన్నుకున్నాక ఎన్నికల ప్రక్రియ ముగుస్తుంది. ఈ ప్రక్రియనంతా వీడియో రికార్డింగ్ చేయనున్నారు. విజేతల వివరాలను ఆ రోజు సాయంత్రం కలెక్టర్లకు పంపుతారు. వారు సమాచారాన్ని సేకరించి రాష్ట్ర ఎన్నికల సంఘానికి నివేదికిస్తారు. దీంతో తొలి దశ ఎన్నికలు జరిగిన ప్రాంతాల్లో కోడ్ ముగుస్తుంది.

4,479 పంచాయతీల్లో

తొలిదశ ఎన్నికలు జరిగే 4,479 పంచాయతీల్లో 769 ఏకగ్రీవమయ్యాయి. 39,822 వార్డులకు గాను 10,654 వార్డులను ఏకగ్రీవం చేశారు. మిగిలిన 3,710 పంచాయతీల్లో 12,202 మంది సర్పంచ్ అభ్యర్థులు బరిలో ఉన్నారు. 28,976 వార్డుల్లో 70,094 మంది పోటీ పడుతున్నారు. వివిధ కారణాల వల్ల 9 పంచాయతీల్లో ఎన్నికలు జరగడం లేదు. శనివారం సాయంత్రం 5 నుంచి సోమవారం సాయంత్రం ఎన్నికల ఫలితాలు వెల్లడించేంత వరకు మద్యం విక్రయాలపై కమిషన్ నిషేధం విధించింది.



ఆదిలాబాద్ జిల్లాలో సిద్ధంగా పోలింగ్ కేంద్రం, బ్యాలెట్ బాక్సులు

- బరిలో 12,202 మంది సర్పంచ్ అభ్యర్థులు
- 28,976 వార్డుల్లో 70,094 మంది పోటీ

పేర్లుండవు.. గుర్తులే

ఎన్నికల బ్యాలెట్‌పై అభ్యర్థి పేరుండదు. వారికి కేటాయించిన గుర్తులే ఉంటాయి. నోటా గుర్తు కూడా ఉంటుంది. అసెంబ్లీ ఎన్నికలు ఈమధ్యే జరిగిన నేపథ్యంలో పంచాయతీ ఎన్నికల్లో ఎడమ చేతి మధ్య వేలుకు సిరా గుర్తు వేస్తారని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ నాగిరెడ్డి తెలిపారు.

మూడోదశ నామినేషన్లు పూర్తి

పంచాయతీ మూడోదశ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ శుక్రవారంతో ముగిసింది. 4,116 పంచాయతీల్లో సర్పంచ్ పదవులకు 26,106 నామినేషన్లు దాఖలయ్యాయి. 36,729 వార్డు మెంబర్లకు 93,518 నామినేషన్లు వేశారు. నామినేషన్ల ఉపసంహరణకు ఈ నెల 22 వరకు గడువుంది. ఏకగ్రీవమైన పంచాయతీలను అదే రోజు ఎన్నికల సంఘం ప్రకటిస్తుంది. 30న ఎన్నికలు జరగనున్నాయి.

ఓటర్లు చేయాల్సినవి

- సర్పంచ్ అభ్యర్థికి ఓటేసేందుకు గులాబీ రంగు, వార్డు సభ్యుడి ఎన్నికకు తెలుపు రంగు బ్యాలెట్ పత్రాలు ఇస్తారు. గుర్తుపై ముద్ర వేశాక పేపర్‌ను పైనుంచి కిందికి కాకుండా ఎడమ నుంచి కుడికి మూడు మడతలుగా చేసి సర్పంచ్, వార్డు మెంబర్లకు వేర్వేరుగా ఏర్పాటు చేసిన పెట్టెల్లో వేయాలి.
- పేపర్ పైనుంచి కిందకు మడిస్తే ఒక గుర్తుకు వేసిన ముద్ర మరో గుర్తుపైనా పడే అవకాశం ఉంది. అలా రెండు గుర్తులపై ముద్ర పడితే చెల్లని ఓటుగా పరిగణిస్తారు.
- బ్యాలెట్‌పై ప్రతి గుర్తు తర్వాత నల్లని గీత ఉంటుంది. దానికి తాకకుండా ముద్ర వేయాలి.
- అభ్యర్థులెవరూ నచ్చకపోతే బ్యాలెట్ చివర్లోని నోటాకు ఓటేయొచ్చు.
- మీ ఓటును మరొకరు వేశారని పోలింగ్ అధికారులు చెబితే మీ దగ్గరున్న ఆధారంతో అధికారిని టెండరు ఓటును అడిగి ఓటేయొచ్చు.
- వికలాంగ ఓటర్లు తమ వెంట ఓ సహాయకుడిని తీసుకెళ్లొచ్చు. అంధ ఓటర్లు పోలింగ్ అధికారుల సాయంతో ఓటేయొచ్చు.

ఇవి చేయొద్దు

- మద్యం, మత్తు పదార్థాలు తీసుకొని బూత్‌లోకి వెళ్లొద్దు. మారణాయుధాలు తీసుకెళ్లొద్దు.
- బూత్ పరిసరాల్లో గుమికూడొద్దు. వాహనాలను బూత్‌కు 100 మీటర్ల దూరంలో నిలపాలి.
- చుట్ట, బీడీ వంటి పొగాకు వస్తువులు, అగ్గిపెట్టె, లైటరు వంటివి బయటపెట్టే బూత్‌లోకి వెళ్లాలి.

నేడు సండ్ర ప్రమాణ స్వీకారం

- టీఆర్ఎస్‌లో చేరుతారని ప్రచారం
- 'పంచాయతీ' బిజీలో ఉన్నా: వీరయ్య

హైదరాబాద్, వెలుగు: టీడీపీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ఆదివారం ప్రమాణం చేయనున్నారు. ఈమేరకు శనివారం 'వెలుగు'తో ఆయన ఫోన్‌లో మాట్లాడారు. పంచాయతీ ఎన్నికల్లో బిజీగా ఉన్నానని చెప్పారు. సండ్రతో పాటు అక్బరుద్దీన్, జాఫర్ హుస్సేన్ ప్రమాణం చేయాల్సి ఉంది. అసెంబ్లీ సమావేశాలు మొదలైనప్పటి నుంచి వీరయ్య టీఆర్ఎస్‌లో చేరుతారనే ప్రచారం జరుగుతోంది. పంచాయతీ తొలిదశలో సత్తుపల్లి సెగ్మెంట్ పరిధిలో వీలైనంత ఎక్కువగా సర్పంచులను ఏకగ్రీవం చేసుకొని వారితో కలిసి టీఆర్ఎస్‌లో చేరుతారనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. టీఆర్ఎస్ నుంచి స్పష్టమైన హామీ రాకపోవడం వల్లే ఆయన చేరిక ఆలస్యం అవుతోందని శనివారం అసెంబ్లీ లాబీల్లో పలువురు చర్చించుకోవడం కనిపించింది.



రాజాసింగ్ ప్రమాణ స్వీకారం

హైదరాబాద్, వెలుగు: బీజేపీ నేత రాజాసింగ్ శనివారం ఎమ్మెల్యేగా ప్రమాణం చేశారు. శనివారం అసెంబ్లీకి వచ్చిన ఆయన.. స్పీకర్ పోచారం చాంబర్‌లో ఎమ్మెల్యేగా ప్రమాణం చేశారు. హిందూ ధర్మం పట్ల, దేశం పట్ల అభిమానం చూపని ఎంఐఎం ఎమ్మెల్యేను ప్రొటెం స్పీకర్‌గా నియమించినందుకే ప్రమాణం చేయలేదని మీడియాతో అన్నారు. ఎంఐఎం నేతను ప్రొటెం స్పీకర్‌గా నియమించడంతో ప్రజల్లోకి ఎలాంటి సంకేతాలు వెళ్లాయో సీఎం కేసీఆర్ ఆలోచించాలని వ్యాఖ్యానించారు.



శనివారం మీడియాతో మాట్లాడుతున్న సీఎల్పీ నేత భట్టి. పక్కన శ్రీధర్‌బాబు, షబ్బీర్ అలీ

జనం గొంతుకవుతా

- సీఎల్పీ లీడర్‌గా బాధ్యతలు తీసుకున్న భట్టి విక్రమార్క
- అభినందించిన కాంగ్రెస్ నేతలు

హైదరాబాద్, వెలుగు: కాంగ్రెస్ శాసనసభాపక్షం ప్రజల గొంతుకగా పనిచేస్తుందని, అందరినీ కలుపుకొని సమష్టిగా ముందుకెళ్తానని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలయ్యేలా నిర్మాణాత్మక ప్రతిపక్షంగా పనిచేస్తామన్నారు. కాంగ్రెస్ శాసనసభాపక్ష నేతగా ఎన్నికైన భట్టి.. శనివారం లాంఛనంగా ఆ బాధ్యతలు స్వీకరించారు. తర్వాత మాట్లాడారు. తనకు అవకాశం కల్పించిన పార్టీ చీఫ్ రాహుల్‌గాంధీకి కృతజ్ఞతలు తెలిపారు. ప్రతిపక్షం బలంగా ఉండాలని పాలకులు కోరుకోవాలని, కానీ రాష్ట్రంలో అధికార పార్టీ మైండ్ గేమ్ ఆడుతోందని ఆరోపించారు. తమ పార్టీ శాసనసభ్యులెవరూ టీఆర్ఎస్ ఆకర్ష్‌కు లొంగబోరని పేర్కొన్నారు. సీఎల్పీ నేతగా బాధ్యతలు స్వీకరించిన భట్టికి పార్టీ ఎమ్మెల్యేలు శ్రీధర్‌బాబు, రాజగోపాల్‌రెడ్డి, గండ్ర వెంకటరమణారెడ్డి, సీతక్క, ఎమ్మెల్సీ షబ్బీర్ అలీ తదితరులు అభినందించారు. తర్వాత అసెంబ్లీ కార్యదర్శి నరసింహాచారి, ఉద్యోగులు కూడా భట్టికి పూలబొకేను అందించి అభినందించారు. తర్వాత గాంధీభవన్‌లో పీసీసీ ఆధ్వర్యంలోనూ భట్టికి సన్మానం చేశారు.

స్పీకర్‌కు లేఖ

శనివారం గవర్నర్ ప్రసంగం అనంతరం కాంగ్రెస్ ఎమ్మెల్యేలు అసెంబ్లీలోని స్పీకర్ చాంబర్‌కు వెళ్లారు. సీఎల్పీ నేతగా భట్టిని ఎంపికచేస్తూ ఏఐసీసీ జారీ చేసిన లేఖను స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డికి అందజేశారు. భట్టిని సీఎల్పీ నేతగా గుర్తించాలని విజ్ఞప్తి చేశారు.

హైకమాండ్ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం

కాంగ్రెస్ శాసనసభాపక్ష నేతగా మల్లు భట్టి విక్రమార్క నియామకాన్ని స్వాగతిస్తున్నామని, ఆయన నాయకత్వంలో ముందుకు వెళతామని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు చెప్పారు. శనివారం అసెంబ్లీకి వచ్చిన ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, సీతక్క, రేగా కాంతారావు, ఆత్రం సక్కు తదితరులు మీడియాతో మాట్లాడారు. సీఎల్పీ నేతగా భట్టి విక్రమార్క నియామకంపై హర్షం వ్యక్తం చేశారు. ఆయన సారథ్యంలో శాసనసభలో ప్రజా వాణిని వినిపిస్తామని చెప్పారు. తనతోపాటు నలుగురు సీఎల్పీ నేతలు పదవిని ఆశించారని, తుది నిర్ణయాన్ని పార్టీ అధ్యక్షుడికే అప్పగించామని కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి చెప్పారు. పార్టీ హైకమాండ్ నిర్ణయానికి కట్టుబడి ఉన్నామన్నారు. భట్టి విక్రమార్క నాయకత్వంపై పూర్తి విశ్వాసముందని, ఆయన నేతృత్వంలో ప్రజా సమస్యలపై పోరాడుతామని తెలిపారు. లోక్‌సభ ఎన్నికల లోపు రాష్ట్రంలో కాంగ్రెస్‌ను బలోపేతం చేస్తామన్నారు. పార్టీ మారుతున్నారన్న ప్రచారాన్ని ప్రస్తావించగా.. అది అవాస్తవమని, పార్టీలోనే ఉండి పోరాడుతామని, మంచి ప్రతిపక్ష పాత్ర పోషిస్తామని పేర్కొన్నారు.

కంగ్రాట్స్ చెప్పిన కేటీఆర్

సీఎల్పీ నేతగా నియమితుడైన మధిర ఎమ్మెల్యే మల్లు భట్టి విక్రమార్కకు టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. శనివారం కేటీఆర్ అసెంబ్లీ లాబీలోకి ప్రవేశిస్తుండగా భట్టి అటుగా వస్తూ కనిపించారు. దీంతో కేటీఆర్ ఆయనను కలిసి కంగ్రాట్స్ చెప్పారు. ఉభయ సభలనుద్దేశించి గవర్నర్ ప్రసంగం ఉండటంతో ఉదయమే ఎమ్మెల్యేలంతా అసెంబ్లీకి వచ్చారు. దీంతో ఆవరణ మొత్తం కళకళలాడింది.

గవర్నర్ ప్రసంగంపై ఎవరేమన్నారంటే..

అన్నీ అర్ధసత్యాలే

గవర్నర్ ప్రసంగం నిండా అర్ధ సత్యాలే. రైతుబంధు వంటి పథకాలను స్వాగతిస్తున్నాం.. కానీ అమలులో లోపాలున్నాయి. పది లక్షల మంది రైతులకు ఇంకా పాస్‌బుక్కులివ్వలేదు. భూప్రక్షాళన పూర్తయినట్టు గవర్నర్ చెప్పడం సరికాదు. గవర్నర్ చదివింది వేరు, క్షేత్రస్థాయిలో జరుగుతున్నది వేరు. మరో మూడ్రోజులు అసెంబ్లీ సమావేశాలు పొడిగించాలి.

- కాంగ్రెస్ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి

వాస్తవానికి అద్దం పట్టింది

సభలో గవర్నర్ ప్రసంగం వాస్తవానికి అద్దం పట్టింది. కాబట్టే ప్రతిపక్షాలు అడ్డుకునే ప్రయత్నం చేయలేదు. మన పథకాలు ఇతర రాష్ట్రాలకూ ఆదర్శం. పుస్తకాలు చించడం, పేపర్లు విసరడం వంటివేమీ లేవు.

- టీఆర్ఎస్ ఎమ్మెల్యే శ్రీనివాస్ గౌడ్

ప్రజల నమ్మకాన్ని నిలబెడతాం

టీఆర్ఎస్‌కు ప్రజలు రెండోసారి పట్టం కట్టారు. వాళ్ల నమ్మకాన్ని నిలబెడతాం. మెరుగైన పాలన అందిస్తాం. ప్రభుత్వ పనితీరును గవర్నర్ ప్రశంసించారు. ఎన్నికల మేనిఫెస్టో టీఆర్ఎస్‌కు భగవద్గీత లాంటిది. ఇచ్చిన ప్రతి హామీనీ అమలు చేసి తీరుతాం. త్వరలోనే రైతు రుణాలు మాఫీ చేస్తాం. నిరుద్యోగ భృతి ఇస్తాం. మరో రెండు దశాబ్దాలు కేసీఆరే సీఎంగా ఉంటారు.

- ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్

కొత్త సీసాలో పాత సారా

గవర్నర్ ప్రసంగం కొత్త సీసాలో పాత సారా పోసినట్టుగా ఉంది. హైదరాబాద్ ప్రస్తావన లేకుండా ముగించేశారు. ప్రజలు మెచ్చే పాలన అందించాలని కోరుతున్నా.

- బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్

నియామకాల ప్రస్తావనేది?

గవర్నర్ ప్రసంగం నిరాశ కలిగించింది. నిరుద్యోగం, నియామకాల ప్రస్తావన లేదు. ఇచ్చిన హామీలను ఎప్పటిలోగా అమలు చేస్తారో స్పష్టత ఇవ్వలేదు. కేంద్ర పథకాల ప్రస్తావన గవర్నర్ ప్రసంగంలో లేకపోవడం అన్యాయం.

- బీజేపీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు

టీఆర్ఎస్ మేనిఫెస్టో చదివినట్టుంది

గవర్నర్ ప్రసంగం మొన్నటి ఎన్నికల్లో టీఆర్ఎస్ మేనిఫెస్టోను చదువుతున్నట్టుంది. రాష్ట్రంలో ప్రైవేటు వైద్యం ఖరీదవుతున్నదని ప్రతి వేదికమీద చెప్పే గవర్నర్.. దాన్ని ప్రసంగంలో ఎందుకు ప్రస్తావించలేదు? ఉద్యోగాల భర్తీ ఊసేది?. పీఆర్సీ, ఉద్యోగ విరమణ వయసుపై ఎప్పుడు నిర్ణయం తీసుకుంటారో చెప్పలేదు. లక్షల మంది రైతులకు ఇంకా పట్టాలందలేదు.

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి



సీఎం కేసీఆర్‌కు వినతిపత్రం అందజేస్తున్న గిరిజన ఎమ్మెల్యేలు రేగా కాంతారావు, ఆత్రం సక్కు, సీతక్క

కేసీఆర్ దగ్గరికి క్యూ

- అసెంబ్లీ వేదికగా కలుస్తున్న ప్రతిపక్ష ఎమ్మెల్యేలు
- నియోజకవర్గ సమస్యలపై వినతులు

హైదరాబాద్, వెలుగు: అసెంబ్లీ వేదికగా ప్రతిపక్షాల ఎమ్మెల్యేలు సీఎం కేసీఆర్ వద్దకు క్యూ కడుతున్నారు. మూడు రోజులుగా జరుగుతున్న శాసనసభ సమావేశాల్లో సీఎంను కలిసి తమ ప్రాంత సమస్యలు చెప్పుకోవడానికి మొగ్గుచూపుతున్నారు. శనివారం కూడా అసెంబ్లీ ఆవరణలో ఇవే దృశ్యాలు కనిపించాయి. సీఎం కేసీఆర్ గవర్నర్ ప్రసంగం తర్వాత దాదాపు గంటపాటు తన చాంబర్‌లో ఉన్నారు. ఈ సమయంలో ప్రతిపక్షాల ఎమ్మెల్యేలు ఆయనను కలిసి వినతిపత్రాలు సమర్పించారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సీతక్క, రేగా కాంతారావు, ఆత్రం సక్కు సీఎం చాంబర్‌కు వచ్చారు. పోడు భూములు సాగు చేసుకుంటున్న గిరిజన రైతులకు పట్టాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. ములుగు కేంద్రంగా జిల్లా ఏర్పాటుపై సీతక్క ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ జిల్లాకు గిరిజనుల దైవమైన సమ్మక్కసారలమ్మ జిల్లాగా పేరుగా పెట్టాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన సీఎం.. వచ్చే నెల మొదటి వారంలో ఆదివాసీ ఎమ్మెల్యేలతో సమావేశం ఏర్పాటు చేస్తానని చెప్పారు. ఎన్నికల సమయంలో గిరిజనులు, ఆదివాసీలకు ఇచ్చిన హామీలను వంద శాతం అమలు చేస్తానని హామీ ఇచ్చారు.

మరికొందరు నేతలు కూడా..

కాంగ్రెస్ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి సీఎం కేసీఆర్‌ను కలిసి సత్తుపల్లి కేంద్రంగా జిల్లా ఏర్పాటు చేయాలని కోరారు. భౌగోళికంగా సత్తుపల్లి ప్రాంత ప్రజలు పడుతున్న ఇబ్బందులు జిల్లా ఏర్పాటుతోనే దూరమవుతాయని వివరించారు. తర్వాత బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్, ఎమ్మెల్సీ రామచందర్‌రావు వచ్చి కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల సమస్యలను వివరించారు. వాటిపై త్వరలోనే మాట్లాడుదామని సీఎం హామీ ఇచ్చినట్టు సమాచారం. సాధారణంగా సీఎంను కలవాలంటే ప్రగతి భవన్‌కు వెళ్లాల్సి ఉంటుందని, అపాయింట్‌మెంట్ లేకుండా కలవడం కష్టం కాబట్టే అసెంబ్లీలో కలిశామని ఎమ్మెల్యేలు చెప్పారు. టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తెలంగాణ భవన్, ప్రగతి భవన్‌కు వస్తున్నారు. శనివారం ఎంపీ జితేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు శ్రీనివాస్‌గౌడ్, మర్రి జనార్దన్‌రెడ్డి, నాగర్‌కర్నూల్ లోక్‌సభ సెగ్మెంట్ ఇన్‌చార్జి పి. రాములు ప్రగతి భవన్‌లో సీఎంను కలిశారు.

సభను హుందాగా నడుపుతా: స్పీకర్

అసెంబ్లీ ఆవరణలో గాంధీ, అంబేడ్కర్ విగ్రహాలకు నివాళులు

హైదరాబాద్, వెలుగు: అసెంబ్లీని హుందాగా, సజావుగా నడిపించే బాధ్యత తనపై ఉందని స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. నిబంధనల ప్రకారం సభలో ప్రతిపక్షాలకు మాట్లాడే స్వేచ్ఛ ఇస్తానని చెప్పారు. వారి సూచనలు స్వీకరించి సభా సంప్రదాయాలను పాటిస్తానని పేర్కొన్నారు. శనివారం అసెంబ్లీ ఆవరణలోని మహాత్మాగాంధీ, అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి పోచారం నివాళులు అర్పించారు. స్పీకర్ స్థానంలో ఇద్దరు మహనీయులను గౌరవించుకునే అవకాశం దక్కడం అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. స్పీకర్‌తోపాటు కార్యక్రమంలో శాసనసభ కార్యదర్శి నర్సింహాచార్యులు, అధికారులు పాల్గొన్నారు.

'పీఏసీ' ఎవరికో!

రేసులో సబిత, గండ్ర, దుద్దిళ్ల

హైదరాబాద్, వెలుగు: సీఎల్పీ నేత ఎంపిక పూర్తవడంతో ఇక కాంగ్రెస్‌లో ఆశావహులంతా పబ్లిక్ అకౌంట్స్ కమిటీ (పీఏసీ) పదవిపై కన్నేశారు. క్యాబినెట్ హోదా కలిగినఈ పదవి ప్రతిపక్షాలకు ఇవ్వడం ఆనవాయితీ. గత ప్రభుత్వంలో కాంగ్రెస్ సీనియర్ నేత గీతారెడ్డి ఈ పదవి చేపట్టారు. ప్రస్తుతం పీఏసీ రేసులో ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, శ్రీధర్ బాబు, గండ్ర వెంకటరమణా రెడ్డి ఉన్నారు. సబితకు గతంలో హోం మంత్రిగా పని చేసిన అనుభవం ఉంది. శ్రీధర్ బాబు అసెంబ్లీ వ్యవహారాల శాఖ మంత్రిగా చేశారు. గండ్ర విప్‌గా పని చేశారు. పీసీసీ చీఫ్ ఉత్తమ్, సీఎల్పీ నేత భట్టిల సిఫారసు మేరకే ఈ పదవి దక్కే అవకాశాలు ఉన్నాయి. ఇద్దరూ ఒకే పేరు సిఫారసు చేస్తే సమస్యే ఉండదని, ఇద్దరు వేర్వేరు అభిప్రాయాలు వ్యక్తం చేస్తే ఏఐసీసీ జోక్యం చేసుకుంటుందని అంటున్నారు.

ఫెడరల్ ఫ్రంట్ పెద్ద సున్నా

కేసుల కోసం మోడీతో, అక్రమాస్తుల కోసం కేసీఆర్‌తో జగన్ లాలూచీ: చంద్రబాబు



విజయవాడ, వెలుగు: ఫెడరల్ ఫ్రంట్ అనేది పెద్ద సున్నా అని, ప్రధాని మోడీకి మద్దతు కోసమే దానికి తెర తీశారని ఏపీ సీఎం చంద్రబాబు విమర్శించారు. ఆయన శనివారం కోల్ కతా నుంచి టీడీపీ నేతలతో టెలికాన్ఫరెన్స్ లో మాట్లాడారు. మోడీకి వ్యతిరేకంగా కోల్ కతా ర్యాలీకి 20కిపైగా పార్టీల నాయకులు వచ్చారన్నారు. కేసీఆర్, వైఎస్ జగన్ మాత్రం రాలేదన్నారు.వారు మోడీ వెంటే ఉన్నారనేది దీంతో స్పష్టమైందన్నారు. ఏపీపై వైఎస్సార్ సీపీ, టీఆర్ఎస్ నేతల ద్వేషాన్ని, కేసీఆర్, కవిత, కేటీఆర్, హరీశ్ దుర్భాషలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. వారితో అంటకాగుతున్న జగన్ వైఖరిని ఎండగట్టాలన్నారు. వరంగల్ లో తనపై రాళ్లేసినవారితోనే జగన్ లాలూచీ పడ్డారని దుయ్యబట్టారు. కేసుల కోసం మోడీతో, అక్రమాస్తుల కోసం కేసీఆర్ తో లాలూచీ పడ్డారని విమర్శించారు. కర్ణాటకలో కాంగ్రెస్, జేడీఎస్ ప్రభుత్వాన్ని కూలదోసేందుకు బీజేపీ కుట్ర చేసిందన్నారు.

లోక్‌సభ ఎన్నికల ఏర్పాట్లు షురూ

సెక్రటేరియట్‌లో సీఎస్, డీజీపీతో సీఈఓ రజత్‌కుమార్ భేటీ

హైదరాబాద్, వెలుగు : లోక్‌సభ ఎన్నికల నిర్వహణ, భద్రతపై చర్చించేందుకు సెక్రటేరియట్‌లో సీఎస్ ఎస్‌కే జోషి, డీజీపీ మహేందర్‌రెడ్డిలతో సీఈఓ రజత్‌కుమార్ శనివారం భేటీ అయ్యారు. అసెంబ్లీ ఎన్నికల నిర్వహణలో ఎదురైన సమస్యలు, వాటిని అధిగమించిన తీరుపై చర్చించారు. అనంతరం సీఈఓ మీడియాతో మాట్లాడుతూ ఓటరు నమోదు గడువు ఈనెల 25న ముగుస్తుందని, ఈ నేపథ్యంలో కేంద్ర ఎన్నికల కమిషన్ 22న రాష్ట్ర అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తుందని తెలిపారు. అందులో ప్రస్తావించాల్సిన అంశాలపై సీఎస్, డీజీపీలతో మాట్లాడినట్టు చెప్పారు. అసెంబ్లీ ఎన్నికలు తర్వాత కొన్నిచోట్ల ఉద్యోగుల బదిలీలు జరిగాయని, అక్కడ సిబ్బందిని సమకూర్చుకుంటామని సీఈఓ తెలిపారు.

ఫిబ్రవరి 4 దాకా ఓటరు నమోదు

ఓటరు నమోదు కార్యక్రమం దేశవ్యాప్తంగా ఈనెల 25న ముగుస్తున్నా తెలంగాణలో పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఫిబ్రవరి 4 వరకు కొనసాగుతుందన్నారు. ఆదివారం అన్ని పోలింగ్ సెంటర్ల వద్ద బూత్ లెవల్ ఆఫీసర్లు అందుబాటులో ఉంటారని, ఓటు ఉన్నదీ, లేనిదీ చెక్ చేసుకోవాలని సూచించారు.

40 లక్షల పోస్టుకార్డులు పంపాం

ఎన్నికల కమిషన్ ఓటర్ల మధ్య పరస్పర సంబంధాలు, చైతన్యం కోసం రాష్ట్రంలో ఇప్పటివరకు 40 లక్షల మందికి పోస్టు కార్డులు రాశామని సీఈఓ చెప్పారు. రిప్లైలు కూడా తమకు చేరుతున్నాయని, సంక్రాంతి సెలవుల కారణంగా పోస్టుకార్డుల పంపిణీలో జాప్యం జరిగిందన్నారు. కొత్త ఓటరు నమోదు ప్రక్రియపై ఇప్పటివరకు 13 లక్షలకుపైగా అభ్యంతరాలు వచ్చాయన్నారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ ఇంకా రానప్పటికీ దానికి సంబంధించిన ఏర్పాట్లు కూడా చేస్తున్నామని సీఈఓ తెలిపారు.

అంతర్రాష్ట్ర బదిలీలు వెంటనే చేపట్టండి

సీఎం కేసీఆర్‌కు జగన్‌మోహన్‌రెడ్డి లేఖ

హైదరాబాద్, వెలుగు: అంతర్రాష్ట్ర ఉద్యోగుల బదిలీలను వెంటనే చేపట్టాలంటూ వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు శనివారం లేఖ రాశారు. ఈ బదిలీలకు సంబంధించిన వివరాలను ఆయన తన లేఖలో ప్రస్తావించారు. ఉద్యోగులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తుచేస్తూ మానవతా దృక్పథంతో ఆలోచించి బదిలీలు చేపట్టాలని జగన్ కోరారు. పరస్పర బదిలీలపై కమిటీ ఉత్తర్వులు విడుదల చేయాలని, ఆ తర్వాత ఉద్యోగుల బదిలీలు జరపాలని సీఎం కేసీఆర్‌కు జగన్ విజ్ఞప్తి చేశారు.

టెన్త్ ప్రీ ఫైనల్స్ ఫిబ్రవరి 15 నుంచి

హైదరాబాద్, వెలుగు: ఫిబ్రవరి 15 నుంచి 27 వరకు టెన్త్ ప్రీ ఫైనల్స్ నిర్వహించనున్నట్టు ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ శేషుకుమారి తెలిపారు. ఈ మేరకు షెడ్యూల్‌ను శనివారం విడుదల చేశారు. 15న ఫస్ట్ లాంగ్వేజ్ 1, 16న ఫస్ట్ లాంగ్వేజ్ 2, 18న సెకండ్ లాంగ్వేజ్, 19న థర్డ్ లాంగ్వేజ్ పేపర్ 1, 20న థర్డ్ లాంగ్వేజ్ పేపర్ 2, 21న గణితం పేపర్ 1, 22న గణితం పేపర్ 2, 23న ఫిజిక్స్, 25న బయాలజీ, 26న సోషల్ స్టడీస్ పేపర్ 1, 27న సోషల్ స్టడీస్ పేపర్ 2 పరీక్షలుంటాయని తెలిపారు.

పెద్దకులాలకు రిజర్వేషన్లపై దేశవ్యాప్త ఉద్యమం: జాజుల

హైదరాబాద్, వెలుగు: రాజ్యాంగానికి విరుద్ధంగా పెద్దకులాలకు 10శాతం రిజర్వేషన్లు కల్పించడంపై దేశవ్యాప్తంగా ఉద్యమిస్తామని చేస్తామని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. శనివారం హైదరాబాద్‌లో జరిగిన బీసీ సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'సేవ్ కాన్‌స్టిట్యూషన్.. సేవ్ జస్టిస్' నినాదంతో దేశవ్యాప్తంగా ఉద్యమిస్తామన్నారు. 22న ఢిల్లీలో ఓబీసీ జాతీయ సదస్సు నిర్వహించనున్నట్టు తెలిపారు. త్వరలో హైదరాబాద్‌లో సభ ఏర్పాటు చేసి ఆర్‌జేడీ, డీఎంకే, ఎస్పీ, బీఎస్పీ, ఎంఐఎంతోపాటు ఇతర పార్టీల నేతలను ఆహ్వానిస్తామన్నారు.

మాలలకు రెండు మంత్రి పదవులివ్వాలి: చెన్నయ్య

హైదరాబాద్, వెలుగు: ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్న మాలలకు మంత్రివర్గంలో అవకాశమివ్వాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య శనివారం కోరారు. గతంలో మాదిగ సామాజికవర్గానికి మంత్రివర్గంలో, నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యమిచ్చారన్నారు. ఈ సారైనా తమకు అవకాశమిచ్చి మంత్రివర్గంలో ఇద్దరికి స్థానం కల్పించాలన్నారు. డబుల్ బెడ్రూం ఇండ్లు, పెన్షన్లు తదితర పథకాల్లోనూ ప్రాధాన్యమివ్వాలని ఆయన డిమాండ్ చేశారు.



శనివారం ప్రగతి భవన్‌లో రాష్ట్రంలో రహదారుల పరిస్థితిపై అధికారులతో సమీక్షిస్తున్న సీఎం కేసీఆర్

అన్ని గ్రామాలకూ బీటీ రోడ్లు

అద్భుతంగా ఉండేలా ప్రణాళిక రూపొందించండి

- నిధులు ఇవ్వటానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉంది
- క్యాంపు కార్యాలయాల నిర్మాణంలో వేగం పెరగాలి
- త్వరలో ఎమ్మెల్యేలకు క్వార్టర్ల కేటాయింపు
- రోడ్లు, భవనాల శాఖ సమీక్షలో సీఎం కేసీఆర్

హైదరాబాద్, వెలుగు: రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటైన పంచాయతీలతోపాటు అన్ని పంచాయతీలకూ బీటీ రహదారుల సౌకర్యం కల్పించాలని రోడ్లు, భవనాల శాఖ అధికారులను ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశించారు. వచ్చే రెండేళ్లలో రాష్ట్రంలోని అన్ని రహదారులను సుందరంగా తీర్చిదిద్దాలని, ఈ మేరకు ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. శనివారం ప్రగతిభవన్‌లో రోడ్లు, భవనాల శాఖపై సీఎం కేసీఆర్ ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. కొత్తగా ఏర్పాటైన వాటితో కలపి రాష్ట్రంలో 12,751 పంచాయతీల్లో బీటీ రోడ్ల నిర్మాణం పూర్తి చేయాలని, నీటిపారుదల ప్రాజెక్టుల నిర్మాణం తర్వాత రహదారులకే తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని సీఎం చెప్పారు.

బడ్జెట్ కేటాయించేందుకు సిద్ధం..

గ్రామస్థాయిలో ప్రస్తుతం రహదారుల పరిస్థితి ఎలా ఉంది? వాటిని పునరుద్ధరించటానికి ఏం చేయాలి? అనే విషయంపై ప్రణాళిక రూపొందించాలని, దానికి అవసరమైన బడ్జెట్ కేటాయించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రకటించారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత కేంద్రం ద్వారా రికార్డు స్థాయిలో జాతీయ రహదారులు సాధించుకున్నామని, రాష్ట్రంలో ఆర్‌అండ్‌బీ, పంచాయతీ రాజ్ శాఖల ఆధ్వర్యంలో భారీగా రోడ్ల నిర్మాణం చేపట్టామని వివరించారు. శిథిలావస్థకు చేరిన బ్రిడ్జిలకు మరమ్మతులు చేయాలని, ఇరుకు బ్రిడ్జిలను వెడల్పు చేయాలని, దీనికోసం రాష్ట్ర స్థాయి ఆర్‌అండ్‌బీ అధికారుల సదస్సు నిర్వహించాలని ఆదేశించారు. ఏ జిల్లా, ఏ మండలం అనే తేడా లేకుండా, ఏ పార్టీ ప్రజాప్రతినిధి ప్రాతినిధ్యం వహిస్తున్నా, అవసరం ఉన్న చోట్ల రోడ్ల మరమ్మతులు చేపట్టాలని, స్థానిక ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు కూడా రోడ్ల మరమ్మతు పనులను చేయించుకోవాలని సూచించారు. పంచాయతీరాజ్ నుంచి ఆర్‌అండ్‌బీకి, ఆర్‌అండ్‌బీ నుంచి జాతీయ రహదారులకు రోడ్లు బదిలీ అయిన సందర్భంలో, వాటి నిర్వహణ, మరమ్మతులపై నిర్లక్ష్యం వహిస్తున్నారని సీఎం అసంతృప్తి వ్యక్తం చేశారు. కొత్త రోడ్లు నిర్మించే వరకూ పాత రోడ్లు పాడుపడినా ఎవరూ పట్టించుకోవడం లేదని, దీని వల్ల ప్రయాణికులు ఇబ్బంది పడాల్సి వస్తోందన్నారు. రోడ్లను బదిలీ చేసే సందర్భంలో అనుసరించాల్సిన వ్యూహం ఖరారు చేయాలని సీఎం అధికారులకు సూచించారు.

త్వరగా పూర్తి చేయాలి..

దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాల నిర్మాణం చేపట్టామని, వాటి నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. హైదరాబాద్‌లో నిర్మించిన కొత్త క్వార్టర్లను ఎమ్మెల్యేలకు వీలైనంత త్వరలో కేటాయిస్తామని చెప్పారు. సమీక్షలో రోడ్లు, భవనాల శాఖ ముఖ్య కార్యదర్శులు సునీల్‌శర్మ, రామకృష్ణారావు, ఆర్‌అండ్‌బీ ఈఎన్‌సీ గణపతిరెడ్డి, ఎస్‌ఈ చంద్రశేఖర్, సీఎంవో అధికారులు స్మితా సబర్వాల్, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

భూములు కోల్పోయిన వారికి పరిహారమివ్వండి

అధికారులకు సీఎం కేసీఆర్ ఆదేశం

హైదరాబాద్, వెలుగు: కాళేశ్వరం ప్రాజెక్టు కాలువల తవ్వకంతో భూములు కోల్పోయిన రైతులకు వెంటనే పరిహారం ఇవ్వాలని ముఖ్యమంత్రి కేసీఆర్ అధికారులను ఆదేశించారు. ముథోల్ నియోజకవర్గం పరిధిలో కాలువల తవ్వానికి భూములు సేకరించి రైతులకు పరిహారం చెల్లించలేదని స్థానిక ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన సీఎం వెంటనే పరిహారం చెల్లించాలని ఆర్థికశాఖ అధికారులకు సూచించారు. కాళేశ్వరం ప్రాజెక్టు ప్యాకేజీ 27లో ఏడాదిన్నర క్రితమే 316 ఎకరాల భూములు సేకరించి కాలువలు తవ్వారు. భూములిచ్చిన రైతులకు రూ.30 కోట్లు చెల్లించాల్సి ఉంది. సీఎం ఆదేశాలతో రైతులకు పరిహారం అందనుంది. ప్యాకేజీ 28లో భాగంగా రూ.20 కోట్లతో భూసేకరణ చేయాల్సి ఉంది. ఇరిగేషన్ అధికారులు భూసేకరణ కోసం కలెక్టర్‌కు ఇప్పటికే నివేదించి చర్యలు చేపట్టారు. చిన్నసుద్దవాగు ప్రాజెక్టు నిర్మాణంతో గుండెగాం గ్రామం పూర్తిగా ముంపునకు గురవుతోంది. అక్కడి రైతులకు భూ పరిహారం ఇవ్వడంతో పాటు ఆర్‌ఆర్ ప్యాకేజీని అమలు చేయాలని సీఎం ఆదేశించారు. ముథోల్ నియోజకవర్గ కేంద్రంలో కమ్యూనిటీ హాల్‌ను అప్‌గ్రేడ్ చేయాలని ఎమ్మెల్యే కోరగా సీఎం సానుకూలంగా స్పందించారు.



స్వాధీనం చేసుకున్న వస్తువులను పరిశీలిస్తున్న సైబరాబాద్ సీపీ సజ్జనార్



పోలీసుల అదుపులో సైబర్ నేరగాళ్లు

సిమ్ సిగ్నల్ పోయిందా..

బ్యాంకులో సొమ్ము గోవిందా

హైటెక్ పద్ధతిలో డబ్బులు కాజేస్తున్న కోల్‌కతా ముఠా

- ఫిషింగ్, స్పామ్, వైరస్ మెయిల్లతో బ్యాంకు అకౌంట్లు, కార్డుల డేటా చోరీ
- వ్యక్తిగత వివరాలతో నకిలీ ఐడీ కార్డుల సృష్టి.. వాటితో సిమ్ స్వాపింగ్
- ఆన్‌లైన్ ద్వారా మనీ ట్రాన్స్‌ఫర్.. ఫోన్ నంబర్‌కు వచ్చే ఓటీపీలతో ఆథరైజేషన్
- ఇప్పటివరకు 20 కోట్లకుపైగా కొల్లగొట్టిన సైబర్ దొంగలు
- ఆరుగురిని అరెస్టు చేసిన సైబరాబాద్ పోలీసులు

హైదరాబాద్, వెలుగు: మీ ఫోన్‌లో ఉన్నట్టుండి నెట్‌వర్క్ రావడం లేదా, ఎంత ట్రై చేసినా సిగ్నల్స్ అందడం లేదా.. అయితే జాగ్రత్త. సైబర్ దొంగలు మీ సిమ్‌కార్డును స్వాప్ చేసి ఉంటారు, మీ బ్యాంకు ఖాతాల్లోని సొమ్మును ఖాళీ చేసేస్తారు. సిమ్‌కార్డ్ పనిచేయకపోతే బ్యాంకు ఖాతాలు ఖాళీ కావడమేంటి అనుకుంటున్నారా.. సొమ్ములు కాజేయడం కోసం సైబర్ దొంగలు మొదలుపెట్టిన హైటెక్ మోసమిది. మన బ్యాంకు అకౌంట్ల నుంచి డబ్బుల ట్రాన్స్‌ఫర్, కార్డుల నుంచి లావాదేవీలను ఆథరైజ్ చేసేది 'వన్‌టైం పాస్‌వర్డ్ (ఓటీపీ)'తోనే. అందుకే మన సిమ్‌కార్డులను స్వాపింగ్ చేసేసి, వాటికి వచ్చే ఓటీపీలను ఎంటర్ చేసి డబ్బు కొట్టేస్తున్నారు. అలాంటి ఓ ముఠాను శనివారం సైబరాబాద్ పోలీసులు పట్టుకున్నారు. నైజీరియా కేంద్రంగా పనిచేసే హ్యాకర్లు, కోల్‌కతాకు చెందిన ఆరుగురు సభ్యుల ముఠా కలిసి సాగిస్తున్న దందాను బట్టబయలు చేశారు. ఆ ఆరుగురిని అరెస్టు చేసి 17 మొబైల్ ఫోన్లు, ఒక ల్యాప్‌టాప్, మూడు హార్డ్‌డిస్కులు, మూడు చెక్కుబుక్‌లు, బ్యాంకు పాస్‌బుక్‌లు, ఓ లామినేషన్ మిషన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ వివరాలను సైబరాబాద్ సీపీ సజ్జనార్ మీడియాకు వెల్లడించారు.

హైదరాబాద్ వాసి ఫిర్యాదుతో..

అప్పటి వరకు బాగానే ఉన్న మొబైల్ నెట్‌వర్క్ ఒక్కసారిగా ఫెయిల్ అవుతుంది. సిగ్నల్స్ పోవడంతో నెట్‌వర్క్ ప్రాబ్లంగా భావిస్తాం. కానీ అది సిమ్ స్వాపింగ్ మోసం కావొచ్చు. మీ సొమ్ము దొంగల పాలు కావొచ్చు. ఇదే తరహాలో మేడ్చల్ జిల్లా చింతల్‌కు చెందిన పంతం వెంకటకృష్ణ బ్యాంకు అకౌంట్లను సైబర్ దొంగలు ఖాళీ చేశారు. డిసెంబర్ 15న రాత్రి 8 గంటల సమయంలో వెంకట కృష్ణకు చెందిన మొబైల్ నెంబర్ సిగ్నల్ పోయింది. తన వద్ద ఉన్న రెండూ ఎయిర్‌టెల్ నెట్‌వర్క్ సిమ్‌కార్డులే. కానీ ఒక నంబర్‌కు సిగ్నల్ రాకపోవడంతో.. ఇదేమిటని కస్టమర్ కేర్‌కు కాల్ చేశారు. కానీ వారి నుంచి తగిన జవాబు రాలేదు. తర్వాతి రోజు ఆదివారం కావడంతో సోమవారం (17న) సమీపంలోని కస్టమర్ కేర్ సెంటర్‌కు వెళ్లి కొత్త సిమ్ తీసుకున్నాడు. కానీ ఆ లోపే తన కంపెనీలైన ఎలిమ్ కెమికల్స్, షలమ్ కెమికల్స్ కంపెనీల బ్యాంకు ఖాతాల నుంచి రూ.9 లక్షలు కోల్‌కతాలోని ఓ బ్యాంకు అకౌంట్‌కు ట్రాన్స్‌ఫర్ అయ్యాయి. దీంతో వెంకట కృష్ణ తమ బ్యాంకుకు వెళ్లి ఆరా తీయడంతో.. నెట్ బ్యాంకింగ్ ద్వారా సొమ్ము ట్రాన్స్‌ఫర్ అయిందని, ఓటీపీ వెరిఫికేషన్ కూడా జరిగిందని చెప్పారు. తన నంబర్ పని చేయని సమయంలో ఓటీపీ వెరిఫికేషన్ కావడమేంటంటూ వెంకట కృష్ణ సైబరాబాద్ సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై దర్యాప్తు మొదలుపెట్టిన పోలీసులు.. హైటెక్ సిమ్ స్వాపింగ్ రాకెట్ గుట్టు బయటపెట్టారు. ఇదే ముఠా ఇనిస్టిట్యూట్ ఆఫ్ సిలికాన్ సిస్టమ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఖాతాల్లోంచి రూ.24 లక్షలు కొట్టేసినట్టు గుర్తించారు.

జాగ్రత్తగా ఉండండి

స్పైవేర్, మాల్‌వేర్‌తో జరుగుతున్న హ్యాకింగ్, సిమ్‌కార్డుల స్వాపింగ్ ద్వారా డబ్బులు కొట్టేస్తున్నారు. ఆన్‌లైన్‌లో వచ్చే మెయిల్స్, పాప్ అప్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలి. ప్రతీ ఆన్‌లైన్ లింకును ఓపెన్ చేయకపోవడం మంచిది. ఆన్‌లైన్‌లో బ్యాంకులు, క్రెడిట్, డెబిట్ కార్డుల వివరాలను ఎవరికీ ఇవ్వొద్దు. సిమ్ స్వాపింగ్‌లో టెలికం సంస్థల బాధ్యతారాహిత్యం కూడా ఉంది. బాధితుల నెంబర్లకు భద్రత కల్పించని టెలికం కంపెనీలపై ట్రాయ్‌కు ఫిర్యాదు చేస్తాం. ఈ ముఠాలో నైజీరియన్ హెన్రీతో పాటు కోల్‌కతాకు చెందిన సంతోష్ బెనర్జీ, అంకన్ షా, రజత్ కుందు, చందన్‌వర్మ, సంజీవ్‌దాస్‌లను అరెస్టు చేశాం. నైజీరియాలో ఉన్న ప్రధాన నిందితుడు ఎబిగ్ బోను ఇండియాకు రప్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం.

– సైబరాబాద్ సీపీ సజ్జనార్

సెలవు రోజుల్లోనే..

స్పైవేర్, మాల్‌వేర్లు, వైరస్‌ల వంటి వాటితో యూజర్ల బ్యాంకు అకౌంట్లు, క్రెడిట్, డెబిట్ కార్డుల వివరాలను హ్యాకర్లు సేకరిస్తారు. మన ఫోన్ నంబర్, ఇతర వ్యక్తిగత వివరాలనూ సంపాదిస్తారు. ఈ డేటాను డార్క్‌నెట్ ద్వారా సైబర్ దొంగలకు విక్రయిస్తారు. సైబర్ దొంగలు ఆ డేటా సహాయంతో నకిలీ ఐడీ కార్డులను తయారు చేసి, సిమ్ కార్డుల స్వాపింగ్ కోసం దరఖాస్తు చేస్తారు. దాంతో బాధితుల ఫోన్‌లోని సిమ్ డీయాక్టివేట్ అయ్యి.. అదే నంబర్‌తో సైబర్ దొంగల వద్ద ఉన్న సిమ్ యాక్టివేట్ అవుతుంది. అప్పుడు బ్యాంకు అకౌంట్లు, కార్డుల వివరాలతో ఆన్‌లైన్‌లో లాగిన్ అయి సొమ్మును ట్రాన్స్‌ఫర్ చేసేసుకుంటారు. ఇందుకోసం ఆ మొబైల్ నంబర్లకు వచ్చిన ఓటీపీలను వినియోగించుకుంటారు. ఇలా సిమ్ స్వాపింగ్, సొమ్ము ట్రాన్స్‌ఫర్ వంటివన్నీ శుక్రవారం నుంచి సోమవారం ఉదయంలోగానే జరిగేలా చూస్తారు. ఆ సమయంలో అయితే టెలికం కంపెనీల ఔట్‌లెట్లు, బ్యాంకులు వంటివి సరిగా అందుబాటులో ఉండక.. బాధితులు ఫిర్యాదు చేయడానికి ఇబ్బంది ఉంటుంది. ఆలోగా సొమ్మును కాజేస్తారు.

నైజీరియా నుంచి హ్యాకింగ్..

డబ్బులు కొల్లగొట్టిన వ్యవహారంలో కీలక నిందితుడు ఎబిగ్‌బో అలియాస్ జేమ్స్ నైజీరియాలో ఉంటాడు. దేశ విదేశాల్లోని కంపెనీలు, వ్యక్తులకు ఫిషింగ్ మెయిల్స్ పంపి బ్యాంకు అకౌంట్లు, కార్డులు, పాస్‌వర్డులను హ్యాక్ చేస్తాడు. ఆ డేటాను సైబర్ దొంగలకు అమ్ముతుంటాడు. ఇదే క్రమంలో కోల్‌కతాలో స్థిరపడ్డ నైజీరియన్ ఒడఫి హెన్రీ(25), స్థానికులు సంతోష్ బెనర్జీ (52) అంకన్ షా(31), రజత్ కుందు (35), చందన్ వర్మ (42), సంజీవ్‌దాస్ (38)లతో కలిసి ముఠాను ఏర్పాటు చేశాడు. ఎబిగ్‌బో నైజీరియా నుంచి హ్యాకింగ్ ద్వారా సేకరించిన డేటాను కోల్‌కతాలోని హెన్రీకి అందిస్తాడు. ఆ డేటా ఆధారంగా హెన్రీతోపాటు ఇక్కడ ఉన్న గ్యాంగ్ సభ్యులు బాధితుల నకిలీ ఐడీకార్డులు తయారు చేస్తారు. ఆయా ప్రాంతాలకు వెళ్లి ఈ నకిలీ ఐడీ కార్డులతో సిమ్ స్వాపింగ్‌కు దరఖాస్తు చేస్తారు. కస్టమర్ వద్ద సిమ్ బ్లాక్ అయి, వీరి వద్ద ఉన్న సిమ్ యాక్టివేట్ కాగానే నైజీరియాలోని ఎబిగ్‌బోకు సమాచారమిస్తారు. అతను నెట్ బ్యాంకింగ్ ద్వారా డబ్బులను వేరే అకౌంట్లకు ట్రాన్స్‌ఫర్ చేస్తాడు. ఈ క్రమంలో మొబైల్ నంబర్లకు వచ్చే ఓటీపీలను ఎంటర్ చేసి ఆథరైజ్ చేస్తారు. ఇలా డబ్బులు తరలించేందుకు 50కిపైగా బ్యాంకు ఖాతాలనూ తెరిచారు. ఎబిగ్‌బో వాటాను అతడికి పంపిస్తారు. ఇలా మూడేళ్లలో దేశవ్యాప్తంగా సుమారు రూ.20 కోట్ల వరకు కొల్లగొట్టారని పోలీసులు గుర్తించారు. హైదరాబాద్‌కు చెందిన ఎలిమ్ కెమికల్స్, షలమ్ కెమికల్స్ కంపెనీల నుంచి రూ.9 లక్షలు, ఇనిస్టిట్యూట్ ఆఫ్ సిలికాన్ సిస్టమ్స్‌కు చెందిన రూ.24 లక్షలు, చెన్నైకి చెందిన ఎస్.కె.ఎస్ కంపెనీ నుంచి రూ.25 లక్షలు, అహ్మదాబాద్‌కు చెందిన నప్పర్ ట్రేడర్స్‌కు చెందిన రూ.13 లక్షలు, కోల్‌కతాకు చెందిన 5, చెన్నైకి చెందిన మరో 3 కంపెనీల అకౌంట్లనూ ఖాళీ చేసేసినట్టు తేల్చారు.

విద్యుత్ ఉద్యోగుల పాత్ర కీలకం

క్యాలెండర్ ఆవిష్కరణలో ప్రభుత్వ సలహాదారు వివేక్ వెంకటస్వామి

హైదరాబాద్, వెలుగు: రాష్ట్రంలో విద్యుత్ వెలుగులు విరజిమ్మడంలో ఉద్యోగుల పాత్ర గణనీయమైనదని ప్రభుత్వ సలహాదారు జి.వివేక్ వెంకటస్వామి అన్నారు. శనివారం సాయంత్రం హైదరాబాద్ లో తెలంగాణ మాల ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ క్యాలెండర్ ను ఆయన ఆవిష్కరించారు. "కేటీపీఎస్ 800 మెగావాట్ల పవర్ ప్రాజెక్టును రికార్డు స్థాయిలో పూర్తి చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుంది. ఇందులో విద్యుత్ సంస్థల సీఎండీ ప్రభాకర్‌రావు కృషి కూడా అనిర్వచనీయం" అని ఈ సందర్భంగా కొనియాడారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రెసిడెంట్ బూర్గుల విజయభాస్కర్, సభ్యులు చంద్రశేఖర్, కృష్ణ మూర్తి, దాసరి కృష్ణ, కాల్వ సుధాకర్ ఇతరులు పాల్గొన్నారు.



'జెండా వందనం' ఎట్ల?

- 'పంచాయతీ' విధుల్లో టీచర్లు.. బడుల్లో వేడుకలపై అయోమయం
- సింగిల్ టీచర్, వీవీలతో నడిచే స్కూళ్లలో మరింత కష్టం

హైదరాబాద్, వెలుగు: సర్కారు బడుల్లో ఘనంగా నిర్వహించాల్సిన గణతంత్ర వేడుకలపై అయోమయం నెలకొన్నది. టీచర్లంతా ఈనెల 25న జరగనున్న రెండో విడత స్థానిక సంస్థల ఎన్నికల విధులకు హాజరవుతుండటంతో స్కూళ్లలో రిపబ్లిక్ డే నిర్వహణపై గందరగోళం నెలకొంది. సింగిల్ టీచర్, విద్యా వలంటీర్ల (వీవీ)తో నడిచే బడుల పరిస్థితి మరింత కష్టంగా మారింది. దీంతో ఏం చేయాలనే దానిపై విద్యా శాఖ అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

రోజంతా ఎన్నికల ప్రక్రియలోనే..

రాష్ట్రంలో సుమారు 26 వేల సర్కారు బడులున్నాయి. వీటిలో ప్రైమరీ స్కూళ్లు 18 వేల వరకు ఉండగా, అప్పర్ ప్రైమరీవి 3,500 వరకు ఉన్నాయి. మిగిలినవి హైస్కూళ్లు. గణతంత్ర వేడుకలకు వారం రోజుల ముందు నుంచే బడుల్లో విద్యార్థులకు క్రీడాపోటీలు నిర్వహిస్తారు. 26న విజేతలందరికీ బహుమతులిస్తారు. తర్వాత గ్రామాల్లో ర్యాలీ నిర్వహించి, ఆయా రూట్లలో విద్యార్థుల సమక్షంలో జాతీయ జెండా ఎగరేస్తారు. కానీ ఈ ఏడాది కొన్ని పాఠశాలలు, గ్రామాల్లో అలాంటి వాతావరణం కనిపించేట్టు లేదు. ఈనెల 25న రాష్ట్రంలో 4,137 గ్రామపంచాయతీలు, 36,620 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకూ పోలింగ్, తర్వాత కౌంటింగ్ ఉంటుంది. ఈ ప్రక్రియ పూర్తి కావాలంటే రాత్రి 9 గంటలు కూడా దాటే అవకాశముంది. రీ కౌంటింగ్, గొడవలు జరిగితే రాత్రి 11 గంటలైనా ఆశ్చర్యపోనక్కర్లేదు. పోలింగ్ స్టేషన్ నుంచి బాక్సులు, ఇతర సామగ్రిని రిటర్నింగ్ ఆఫీసర్‌కు అప్పగించే సరికి అర్ధరాత్రి 12 దాటే అవకాశాలున్నాయని ఉపాధ్యాయులు చెబుతున్నారు. దీంతో మరుసటి రోజు వారంతా రిపబ్లిక్ డే వేడుకలకు హాజరవుతారా లేదా అనేది అనుమానమే.

ఆ బడుల పరిస్థితేంటి?

గతేడాది లెక్కల ప్రకారం 4,500 వరకు ఏకోపాధ్యాయ పాఠశాలలున్నాయి. టీచర్ల బదిలీల నేపథ్యంలో ఆ సంఖ్య 3,500లకు తగ్గింది. కొన్ని బడులు రెగ్యులర్ టీచర్లు లేక విద్యా వలంటీర్లతోనే నడుస్తున్నాయి. ప్రస్తుతం టీచర్లు, విద్యావలంటీర్లు, సిబ్బంది, సీఆర్‌పీలు అందరికీ ఎన్నికల డ్యూటీలు వేశారు. టీచర్ పనిచేసే, సొంత మండలం కాకుండా వేరే ప్రాంతాల్లో డ్యూటీ వేస్తారు. దీంతో టీచర్లు 26న పాఠశాలలకు వచ్చే అవకాశం లేదు. కొన్ని బడుల్లో తూతూమంత్రంగా, కొన్నింటిలో జరిగే అవకాశం లేదని టీచర్స్ యూనియన్లు చెబుతున్నాయి. అయితే ఇదేం పెద్ద సమస్య కాదని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ విజయ్ కుమార్ తెలిపారు. ప్రత్యామ్నాయ చర్యలేమీ ఇప్పటివరకు తీసుకోలేదని 'వెలుగు'తో అన్నారు.

ఆదివారం | హైదరాబాద్
20.01.2019
www.v6velugu.com
ప్రభాత వెలుగు
Follow: v6velugu



కోల్‌కతా సభకు హాజరైన బీజేపీయేతర నాయకులు

మోడీ పాలనకు రోజులు దగ్గరపడ్డాయి

కోల్‌కతా సభలో మమతా బెనర్జీ



లోక్‌సభ ఎన్నికలు దగ్గరపడుతున్నవేళ బీజేయేతర పార్టీలు ఒకే వేదిక మీదకు వచ్చేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నాయి. దీంట్లో భాగంగా శనివారం కోల్‌కతాలో తృణమూల్ కాంగ్రెస్ చీఫ్ మమతా బెనర్జీ ఆధ్వర్యంలో సుమారు 20 పార్టీలకు చెందిన నేతలు ఒకే వేదికను పంచుకున్నారు. కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు బీజేపీని వ్యతిరేంచే శక్తులన్నీ వచ్చే ఎన్నికల్లో ఆపార్టీ మట్టికరిపించాలని నిర్ణయించుకున్నాయి. కోల్ కతా వేదికగా బీజేపీపై సమరశంఖం పూరించాయి. యునైటెడ్ ఇండియా ర్యాలీ పేరుతో పెద్ద ఎత్తున్న నిర్వహించిన ఈ సభకు లక్షలాదిగా జనం తరలివచ్చారు. ఇలాంటి సభలు మరిన్ని ఏర్పాటుచేయాలని ప్రతిపక్షాలు నిర్ణయించుకున్నాయి.

కోల్‌కతా : కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయని తృణమూల్ కాంగ్రెస్ చీఫ్, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అన్నారు. నాలుగున్నరేళ్ల బీజేపీ పాలన అంతా కుంభకోణాలమయంగా మారిందన్నారు. ఎన్నికల్లో గెలుపు కోసం దేశాన్ని లూటీ చేస్తోందని మోడీ సర్కార్ ను ఆమె విమర్శించారు. సీబీఐ, ఆర్బీఐ లాంటి రాజ్యాంగ వ్యవస్థలను శాసించడానికి కేంద్రం ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. శనివారం కోల్‌కతాలో టీఎంసీ అధ్వర్యంలో జరిగిన యునైటెడ్ ఇండియా ర్యాలీ సభలో మమతా మాట్లాడారు. ‘‘దేశానికి ప్రస్తుతం సమష్టి నాయకత్వ అవసరం ఉంది. అందుకే 20 ప్రతిపక్ష పార్టీలకు చెందిన లీడర్లంతా ఇక్కడ సమావేశమయ్యాం ’’ అని ఆమె అన్నారు. ప్రతిపక్షాల తరపున ప్రధాని ఎవరవుతారన్నది ముఖ్యం కాదన్నారు. ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత ఆ విషయం గురించి ఆలోచిస్తామన్నారు. సభలో పాల్గొన్న వివిధ పార్టీల నాయకులు బీజేపీ విధానాలను దుయ్యబట్టారు. బీజేపీని ఎదుర్కోవడానికి ప్రతిపక్షాలన్నీ కలిసికట్టుగా ఉండాలని సూచించారు.

సంకీర్ణ ప్రభుత్వాలు కూడా పూర్తి కాలం ఉంటాయని నిరూపించాల్సిన టైమ్ వచ్చిందని జేడీ(ఎస్) చీఫ్, మాజీ ప్రధాని దేవె గౌడ చెప్పారు. బీజేపీకి వ్యతిరేకంగా సెక్యులర్ శక్తులన్నీ ఒక తాటిమీదకు రావాల్సిన అవసరం ఉందని సీనియర్ కాంగ్రెస్ నేత, లోక్ సభలో ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున ఖర్గే చెప్పారు. ఈ సందర్భంగా సభ సక్సెస్ కావాలని కోరుతూ సోనియా గాంధీ పంపిన సందేశాన్ని ఆయన చదివి వినిపించారు.

దేశాన్ని విచ్ఛిన్నం చేయాలని చూస్తోందని బీజేపీపై టీడీపీ చీఫ్ చంద్రబాబు నాయుడు మండిపడ్డారు. చంద్రబాబు తన ప్రసంగాన్ని బెంగాల్లో ప్రారంభించారు. ‘విభజించు - పాలించు ’ సిద్ధాంతాన్ని నమ్ముకుని బీజేపీ పాలన కొనసాగిస్తోందని ‘ఆప్’ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ఆరోపించారు. బీజేపీవి విభజన రాజకీయాలని సమాజ్ వాది పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ ఆరోపించారు. 2014 లోక్ సభ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను బీజేపీ మరచిపోయిందని డీఎంకే చీఫ్ స్టాలిన్ ఆరోపించారు. పేదల బ్యాంకు ఖాతాల్లోకి రూ. 15 లక్షలు జమ చేస్తామన్న హామీ ఏమైందని ఈ సందర్భంగా ఆయన ప్రశ్నించారు. ‘ అచ్చే దిన్ ’ అంటూ ప్రజలకు ఆశలు కల్పించి అధికారానికి వచ్చిన బీజేపీ ఆ సంగతి మరచిపోయిందని నేషనల్ కాన్ఫరెన్స్ చీఫ్ ఫరూఖ్ అబ్దుల్లా ఆరోపించారు. ఈ సందర్భంగా ఈవీఎంల ను ఆయన ప్రస్తావించారు. బ్యాలెట్ పేపర్ పద్ధతికి వెళ్లాలన్నారు. ప్రధాని మోడీని కాదు, ఆయన ఐడియాలజీని తామంతా వ్యతిరేకిస్తున్నామని మాజీ కేంద్ర మంత్రి యశ్వంత్ సిన్హా చెప్పారు. మోడీ హయాంలో రాజ్యాంగ వ్యవస్థలు తన ఉనికి కోల్పోయాయన్నారు. మోడీ పాలన తుగ్లక్ ను గుర్తుకు తెస్తోందని బీజేపీ అసంతృప్తి ఎంపీ శత్రుఘ్న సిన్హా విమర్శించారు.

‘మరిన్ని సభలు పెడదాం’

కోల్ కతా బహిరంగ సభ విజయవంతం కావడంతో ప్రతిపక్షాల నాయకుల్లో జోష్ వచ్చింది. అందరూ సమావేశమై తదుపరి కార్యాచరణ గురించి చర్చించారు. మోడీ ప్రభుత్వ తీరుకు నిరసనగా కోల్ కతా తరహాలోనే మరికొన్ని సభలు నిర్వహించాలని నిర్ణయించారు. తర్వాత సభ ఎక్కడ నిర్వహించాలనే దానిపై చర్చ జరిగింది. ఢిల్లీలో నిర్వహించడానికి కేజ్రీవాల్ ముందుకు వచ్చారు. అయితే ఏపీ లేదా కర్ణాటకలో సభ పెట్టాలన్న ప్రతిపాదన కూడా తెరపైకి వచ్చింది.

సోనియా, రాహుల్, మాయావతి డుమ్మా


కోల్ కతా బహిరంగ సభకు యూపీఏ చైర్ పర్సన్ సోనియా, కాంగ్రెస్ చీఫ్ రాహుల్ డుమ్మా కొట్టారు. అయితే మమతా బెనర్జీకి తన మద్దతు తెలియచేస్తూ రాహుల్ శుక్రవారం ఓ లేఖ పంపారు. కాంగ్రెస్ పార్టీ తరఫున సీనియర్ లీడర్లు మల్లికార్జున్ ఖర్గే, అభిషేక్ మను సింఘ్వి హాజరయ్యారు. బీఎస్పీ చీఫ్ మాయావతి కూడా బహిరంగ సభ కు హాజరు కాలేదు. అయితే పార్టీ తరఫున ఎంపీ సతీశ్ చంద్ర మిశ్రా హాజరయ్యారు.

యునైటెడ్ ఇండియా ర్యాలీ హిట్

కోల్ కతా ఐక్యతా ర్యాలీ హిట్ అయింది. ‘యునైటెడ్ ఇండియా ర్యాలీ’ పేరుతో జరిగిన బహిరంగ సభకు వచ్చిన వారితో బ్రిగేడ్ మైదానం కిక్కిరిసిపోయింది. నాలుగు లక్షల మంది ప్రజలు ఈ సభ కు వచ్చినట్లు అంచనా. మూడు వేల మంది టీఎంసీ కార్యకర్తలు సభ ఏర్పాట్లు చూశారు. బహిరంగ సభ జరిగిన ప్రాంతం జనంతో కిక్కిరిసిపోయింది. బ్రిగేడ్ పెరేడ్ గ్రౌండ్స్ చుట్టుపక్కల ప్రాంతాల్లో ప్రజలు డాబాలు ఎక్కి సభా కార్యక్రమాలను చూశారు.

సభకు ఎవరెవరు హాజరయ్యారంటే ....

20 బీజేపీయేతర ప్రతిపక్ష పార్టీలకు చెందిన నాయకులు కోల్ కతా సభకు హాజరయ్యారు. మాజీ ప్రధాని హెచ్ డీ దేవె గౌడ (జేడీఎస్), కుమారస్వామి (జేడీఎస్),ఫరూఖ్ అబ్దుల్లా (నేషనల్ కాన్ఫరెన్స్), ఒమర్ అబ్దుల్లా (నేషనల్ కాన్ఫరెన్స్), చంద్రబాబు నాయుడు (టీడీపీ), మల్లికార్జున ఖర్గే (కాంగ్రెస్), అభిషేక్ మను సింఘ్వి (కాంగ్రెస్), శరద్ పవార్ (నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ), శరద్ యాదవ్ (లోక్ తాంత్రిక్ జనతాదళ్), తేజస్వి యాదవ్ (రాష్ట్రీయ జనతా దళ్), అఖిలేశ్ యాదవ్ (సమాజ్ వాది పార్టీ), అరవింద్ కేజ్రీవాల్ (ఆప్), స్టాలిన్ (డీఎంకే), సతీశ్ మిశ్రా (బీఎస్పీ), యశ్వంత్ సిన్హా (మాజీ కేంద్ర మంత్రి), అరుణ్ శౌరి (మాజీ కేంద్ర మంత్రి), శత్రుఘ్న సిన్హా (బీజేపీ అసంతృప్త ఎంపీ) హార్దిక్ పటేల్ (పటీదార్ ఉద్యమ నేత) జిగ్నేశ్ మేవాని (దళిత నేత), హేమంత్ సోరేన్ (జేఎంఎం) తదితరులు హాజరయ్యారు.



“నరేంద్రమోడీ పబ్లిసిటీ పీఎం. మనకు కావాల్సింది పనిచేసే ప్రధాని. బీజేపీ నినాదాలు మాత్రమే ఇచ్చింది. దేశాన్ని, ప్రజాస్వామ్యాన్ని రక్షించాలన్నది మా ఆశయం. దేశాన్ని విభజించాలన్నది బీజేపీ కోరిక. వాళ్లు రాష్ట్ర ప్రభుత్వాలను వేధిస్తున్నారు. కాశ్మీర్‌లో వాళ్లెలా ప్రవర్తించారో మీరు చూశారు. కర్ణాటకలో ఎన్నికైన ప్రభుత్వాన్ని అస్థిరపరచాలని చూస్తున్నారు.

- ఏపీ సీఎం చంద్రబాబు



“వచ్చే లోక్‌సభ ఎన్నికలు దేశస్వాతంత్ర్యం కోసం జరుగుతున్న రెండో పోరాటం. మోడీ గనక మళ్లీ అధికారంలోకి వస్తే దేశం 50 ఏళ్లు వెనక్కి వెళుతుంది.”

- డీఎంకే ప్రెసిడెంట్ స్టాలిన్



ఐఆర్‌సీటీసీ స్కామ్ లో లాలూకు బెయిల్

న్యూఢిల్లీ: ఐఆర్‌సీటీసీ స్కామ్ లో సీబీఐ నమోదు చేసిన కేసులో ఆర్జేడీ చీఫ్ లాలూ ప్రసాద్ యాదవ్ కు ఢిల్లీ కోర్టు శనివారం బెయిల్ మంజూరు చేసింది. లక్ష రూపాయల వ్యక్తిగత బాండ్, అంతే మొత్తంలో పూచీకత్తుతో స్పెషల్ జడ్జి అరుణ్ భరద్వాజ్ బెయిల్ ఇచ్చారు. అనుమతి లేకుండా విదేశాలకు వెళ్లకూడదని, సాక్ష్యాలు నాశనం చేసే ప్రయత్నం చేయకూడదని షరతులు విధించారు. ఈ కేసులో ఇదివరకే ఆయనకు మధ్యంతర బెయిల్ మంజూరైంది. లాలూ భార్య రబ్రీ దేవి, కుమారుడు తేజస్వి యాదవ్ కూడా బెయిల్ పై ఉన్నారు. ఈడీ నమోదు చేసిన మనీలాండరింగ్ కేసులో లాలూ, రబ్రీ, తేజస్వి యాదవ్ లకు మధ్యంతర బెయిల్ ను ఈ నెల 28 వరకు కోర్టు పొడిగించింది. లాలూ రైల్వే మంత్రిగా ఉన్నప్పుడు ఐఆర్ సీటీసీ హోటళ్ల నిర్వహణలో అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపణలు ఉన్నాయి.

జనం సొమ్ము దోచుకోవడానికే ...

‘మహా కూటమి’ పై ప్రధాని మోడీ

సిల్వాసా (దాదర్ అండ్ నాగర్ హవేలీ) : అడ్డూ ఆపు లేకుండా ప్రజల సొమ్ము దోచుకోవడానికే ‘మహాకూటమి’ పేరుతో ప్రతిపక్షాలన్నీ ఏకమవుతున్నాయని ప్రధాని నరేంద్ర మోడీ ఆరోపించారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం వచ్చాక ప్రజల సొమ్మును దోచుకునేవారి ఆట బంద్ అయిందన్నారు. ఓసారి దోపిడికి అలవాటు పడ్డ వారికి తమ ప్రభుత్వ చర్యలు కోపం తెప్పించడం సహజమేనన్నారు. కోల్ కతాలో బీజేపీయేతర ప్రతిపక్షాలు నిర్వహించిన బహిరంగ సభపై ప్రధాని మోడీ స్పందించారు. ఉనికి కాపాడుకోవడానికే మహాకూటమి పేరుతో ప్రతిపక్ష పార్టీలు ప్రయత్నిస్తున్నాయని కేంద్ర పాలిత ప్రాంతమైన దాదర్ అండ్ నాగర్ హవేలీ రాజధాని సిల్వాసాలో జరిగిన ఓ బహిరంగ సభలో మాట్లాడుతూ ఆయన ఆరోపించారు. ప్రతిపక్షాల సంగతి ఎలాగున్నా తాను మాత్రం దేశ ప్రయోజనాల కోసమే పనిచేస్తున్నానన్నారు. ప్రతిపక్షాలకు, తనకు మధ్య ఉన్న తేడా అదేనన్నారు. కోల్ కతా లాంటి ర్యాలీలతో ప్రతిపక్షాలు వార్తల్లోకి ఎక్కొచ్చు, రాజకీయంగా సందడి చేయవచ్చు కానీ ప్రజల మనసులు గెలవలేవని ఆయన అన్నారు. ‘‘మహాఘట్ బంధన్ నాకు వ్యతిరేకంగా ఏర్పాటు చేస్తున్నది కాదు. దేశ ప్రజలకు వ్యతిరేకంగా ఏర్పాటు చేస్తున్నది. ఈ విషయం అందరూ తెలుసుకోవాలి. లోక్ సభ ఎన్నికలు జరగకముందే అధికారం గురించి వారు ఆలోచిస్తున్నారు. ఇప్పుడే సీట్ల సర్దుబాటు గురించి మాట్లాడుకుంటున్నారు ’’ అని ప్రతిపక్షాలను మోడీ ఎగతాళి చేశారు.

బీజేపీ సర్కారే ప్రతిపక్షాల టార్గెట్

ప్రతిపక్షాలకు ప్రజల కష్టాలు పట్టవని ప్రధాని మోడీ అన్నారు. బీజేపీ ప్రభుత్వాన్ని పడగొట్టాలనే ఏకైక లక్ష్యంతోనే ప్రతిపక్షాలన్నీ ఏకమవుతున్నాయని విమర్శించారు. అంతకుమించి వారికి మరో అజెండాయే లేదన్నారు. దేశ ప్రజలను మభ్యపెట్టడానికి ఓ రంగుల హరివిల్లులా ‘ మహాఘట్ బంధన్ ’ ను ఉపయోగించుకుంటున్నాయని ప్రతిపక్షాలపై ప్రధాని మోడీ విరుచుకుపడ్డారు. బీజేపీ సత్తా చూసి ప్రాంతీయ పార్టీలన్నీ నిద్రలేని రాత్రులు గడుపుతున్నాయన్నారు. దిక్కుతోచక సాయం కోసం కోల్ కతా వేదిక నుంచి ‘‘ బచావ్ బచావ్ ’’ అంటూ కేకలు పెడుతున్నాయని ఆయన ఎగతాళి చేశారు. ఎవరెన్ని కూటములు ఏర్పాటు చేసినా, ప్రజల్లో బీజేపీకి ఉన్న ఆదరణ ఏమాత్రం తగ్గలేదని ప్రధాని మోడీ చెప్పారు.



‘‘ అవినీతి నేతలంతా ఒక్కటయ్యారు. ర్యాలీలకు పిలుపు ఇచ్చేబదులు దేశాన్ని ఉత్తమంగా తీర్చిదిద్దడానికి వాళ్లంతా పిలుపు ఇవ్వాల్సింది. పార్టీలు సొంత ప్రయోజనాల కోసమే కలుస్తున్నాయి. ఇది అపవిత్రమైన పొత్తు.’’

- కేంద్రమంత్రి బాబుల్ సుప్రియో

యునైటెడ్ ఇండియా ర్యాలీ లాంటి సంఘటనల వల్ల మా పార్టీకి వచ్చే ప్రమాదం ఏమీలేదు. ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నట్టు మోడీ సర్కారు వల్ల దేశ ఐక్యతకు వచ్చే ప్రమాదం ఏంటో నాకు అర్థం కావడంలేదు. ’’

- బీజేపీ అధికార ప్రతినిధి రాజీవ్ ప్రతాప్ రూడి

ఎల్ అండ్ టీ ‘ప్లాంట్’ను ప్రారంభించిన ప్రధాని మోడీ

హజీరా (గుజరాత్): దేశంలోనే తొలిసారిగా గుజరాత్ లో ఏర్పాటైన గన్ ఫ్యాక్టరీని ప్రధాని మోడీ శనివారం ప్రారంభించారు. ఎల్ అండ్ టీ కంపెనీకి చెందిన ఈ తయారీ కేంద్రంలో కే 9 వజ్ర సెల్ఫ్‌ప్రొపెల్డ్ హవిట్జర్లను తయారు చేస్తారు. మేకిన్ ఇండియా కార్యక్రమంలో భాగంగా 2017లో 4,500 కోట్ల విలువైన ఈ కాంట్రాక్ట్ ను ఎల్ అండ్ టీ దక్కించుకుంది. రక్షణ శాఖతో కుదిర్చుకున్న ఒప్పందం ప్రకారం ఎల్ అండ్ టీ 42 నెలల్లో 100 ఫిరంగులను తయారుచేసి అందివ్వనుంది. ఇందులో భాగంగా కంపెనీ గుజరాత్‌లో ఏర్పాటు చేసిన ప్లాంట్‌ను ప్రధాని ప్రారంభించారు.

అమ్మ, తమ్ముడిని కలిసిన ప్రధాని

గాంధీనగర్: ప్రధానమంత్రి నరేంద్ర మోడీ శనివారం తన తల్లి హీరాబా, తమ్ముడు పంకజ్ మోడీతో కాసేపు గడిపారు. ఈనెల 17 నుంచి గుజరాత్ పర్యటనలో ఉన్న ఆయన అహ్మదాబాద్ విమానాశ్రయానికి వెలుతూ మార్గమధ్యలో తన తమ్ముడు పంకజ్ మోడీ ఉంటున్న రాయ్‌సన్ గ్రామానికి వెళ్లారు. అమ్మ, తమ్ముడు, కుటుంబ సభ్యులతో దాదాపు అరగంటసేపు గడిపి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం హీరాబా చిన్న కొడుకు దగ్గర ఉంటోంది.

హవాలా కేసులో జకీర్ నాయక్ పై ఈడీ చర్యలు

న్యూఢిల్లీ: హవాలా కేసులో విచారణ ఎదుర్కొంటున్న వివాదాస్పద ఇస్లామిక్ మత గురువు జకీర్ నాయక్ ఆస్తులను శనివారం ఈడీ మరోసారి అటాచ్ చేసుకుంది. ముంబై, పూణెలలో ఉన్న తన స్థిర ఆస్తులు స్వాధీనం చేసుకున్నామని, వాటి విలువ దాదాపు రూ.16.40 కోట్లు ఉంటుందని అధికారులు చెప్పారు. ఇప్పటి వరకు ఈడీ స్వాధీనం చేసుకున్న మొత్తం ఆస్తుల విలువ రూ.50.49కోట్లు ఉంటుంది.

కేసు నీరుగార్చేందుకే ట్రాన్స్‌ఫర్లు

కొచ్చి: కేరళలో బిషప్ ఫ్రాంకో ములక్కల్ అఘాయిత్యాలను వెలుగులోకి తెచ్చి అతని అరెస్ట్ కోసం పోరాటం చేస్తున్న నన్స్ పై క్రిష్టియన్ మిషనరీ ఈ మధ్యే బదిలీ వేటు వేసింది. దీనిపై తమకు న్యాయం చేయాలంటూ కేరళ సీఎం పినరయ్ విజయన్‌కు నన్‌లు లేఖ రాశారు. కేరళ కొట్టాయం జిల్లా చర్చి బిషప్‌గా వ్యవహరిస్తున్న ములక్కల్ తమపై లైంగిక దాడికి పాల్పడ్డాడంటూ గతేడాది కోర్టుకెక్కిన ఐదుగురు నన్‌లలోంచి నలుగురు..సిస్టర్ అనుపమ, అంకిత, అల్ఫీ, జోస్‌ఫైన్ లను వెంటనే కొట్టాయం జిల్లాలోని క్రిస్టియన్ కాన్వెంట్ విడిచిపెట్టి వెళ్లాలంటూ మిషనరీ సంస్థ సుపీరియర్ రెజీనా ఈ మధ్యే ఆదేశించింది. దీంతో బాధితులు తమకు సాయం చేయాలంటూ సీఎంకు శనివారం లేఖ రాశారు.ఈ కేసును నీరుగార్చేందుకే తమను కావాలని బదిలీ చేశారని ఆరోపించారు. సీఎం చొరవ తీసుకుని తమకు న్యాయం జరిగేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. ములక్కల్‌పై కేసు కోర్టు పరిధిలో ఉందని, విచారణ పూర్తయ్యే వరకు తమ బదిలీలను నిలిపివేసేలా చర్యలు తీసుకోవాలని లేఖలో కోరారు. నింది తుడ్ని ఈ కేసు నుంచి తప్పించేందుకే మిషనరీలో కొంతమంది ప్రయత్నిస్తున్నారని, అందుకే తాము అందుబాటులో లేకుండా చేసేందుకే ఇతర రాష్ట్రాలకు బదిలీ చేసినట్లుగా ఆరోపించారు. దీంతో ఈ కేసుపై పోరాటం చేయలేని పరిస్థితిలో పడిపోతామని, కోర్టు విచారణకు హాజరవ్వడంలోనూ ఇబ్బందులు తలెత్తుతాయని ఆవేదన వ్యక్తంచేశారు.



- చర్చి బిషప్ అఘాయిత్యాలపై కోర్టుకెక్కిన నన్‌లు
- తమను ఆదుకోవాలంటూ కేరళ సీఎంకు లేఖ



మెక్సికోలో ఆయిల్ పైప్‌లైన్ పేలుడు

66 మంది మృతి

మెక్సికో సిటీ: సెంట్రల్ మెక్సికోలోని అక్రమ ఫ్యూయల్ (ఇంధన) టాప్ దగ్గర శుక్రవారంసాయంత్రం జరిగిన భారీ అగ్నిప్రమాదంలో 66 మంది చనిపోయారు. 71 మందికిపైగా గాయపడ్డారు. త్లాహులిల్‌పాన్ ప్రాంతంలో పైప్‌లైన్ లీక్ కావడంతో గ్యాసొలైన్ ఇళ్లకు తెచ్చుకోడానికి స్థానికులు పెద్ద సంఖ్యలో అక్కడి బకెట్లు, క్యాన్లతో చేరుకున్నారు. అదే సమయంలో పెద్దపేలుడు జరగడంతో చాలా మంది సజీవదహనమయ్యారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మంటల్ని ఆర్పేశారు. గాయపడ్డవారిని హాస్పటల్‌కు తరలించారు. మరోవైపు, సంఘటనపై హిడాల్గో స్టేట్ గవర్నర్ ఒమర్ ఫయద్ తీవ్ర విచారం వ్యక్తంచేశారు. బాధితులకు సాయం అందించేందుకు ప్రభుత్వం తరపున సాయం అందించాలని ఆయన అధికారులను ఆదేశించారు. మెక్సికోలో ఫ్యూయల్ చోరీలు కొన్ని చోట్ల సర్వసాధారణం. ఈ చోరీలవల్ల దేశానికి ఏటా బిలియన్ డాలర్ల మేర నష్టం జరుగుతోందని ప్రభుత్వం చెబుతోంది. అండ్రూస్ ఒబ్రాడర్ ప్రెసిడెంట్‌గా అధికారం చేపట్టాక ఇలాంటి చోరీలు జరగకుండా కఠిన చర్యలు తీసుకున్నారు.

పల్లెపోరులో పట్టభద్రులు

ఈసారి పంచాయతీ ఎన్నికల్లో యూత్ ప్రభావం ఎక్కువగా కనిపిస్తోంది. ఉన్నత చదువులు చదువుకున్నవారు, ఐదంకెల జీతాలు తీసుకుంటున్నవారు సర్పంచులుగా పోటీ చేస్తున్నారు. పుట్టిన ఊరికి మంచి చేసేందుకు ఇదో అవకాశమని వారు చెప్తున్నారు. పంచాయతీ ఎన్నికలంటే ఒకప్పుడు యూత్ పట్టించుకునేదే కాదు. లోకల్ పాలిటిక్స్ అంటే వారికి చిన్నచూపుండేది. స్థానిక నేతల వ్యవహారాల మీద తీవ్ర వ్యతిరేకత ఉండేది. ఇప్పుడా పరిస్థితి మారింది. కెరీర్‌ను వదిలి.. విదేశాల నుంచి వచ్చి మరీ పల్లె పోరుకు రెడీ అవుతున్నారు.

సర్పంచులుగా పోటీ చేస్తున్న విద్యావంతులు



అమెరికా నుంచి తిరిగివచ్చి బరిలో దిగిన మహిళ

మెదక్/ సంగారెడ్డి/ సిద్దిపేట, వెలుగు: సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం కాసాల గ్రామానికి చెందిన శ్వేతారెడ్డి ఎంఎస్సీ, బీఈడీ చదివారు. అమెరికాలో భర్త అనిల్‌రెడ్డి ఉద్యోగం చేస్తుండటంతో అక్కడే స్థిరపడ్డారు. ఈసారి కాసాల పంచాయతీ జనరల్ మహిళకు రిజర్వు అయ్యింది. రిజర్వేషన్ కలిసిరావడంతో 12 ఏళ్లుగా అమెరికాలో ఉంటున్న శ్వేతారెడ్డి తిరిగొచ్చి సర్పంచ్‌గా పోటీ చేస్తున్నారు. ఆమె మామ, టీఆర్ఎస్ నేత లింగారెడ్డి పీఏసీఎస్ చైర్మన్‌గా ఉన్నారు. తాను గెలిస్తే అన్ని విధాల ఊరిని అభివృద్ధి చేస్తానని, విద్యారంగం మీద దృష్టి పెడతానని అంటున్నారు.

పీహెచ్‌డీ. పీజీ స్టూడెంట్లు

కోహీర్ మండలం పోతిరెడ్డిపల్లి గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా పీహెచ్‌డీ చదువుతున్న విష్ణు సర్పంచ్‌గా పోటీ చేస్తున్నాడు. ఉస్మానియా యూనివర్సిటీ లో పీజీ పూర్తి చేసిన పీహెచ్‌డీ చేస్తున్న విష్ణు విద్యార్థి నాయకుడిగా తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలంగా వ్యవహరించాడు. పుట్టిన ఊరుకు మేలు చేయాలన్న భావనతో పోటీకి సిద్ధమయ్యాడు. ఊళ్లో అందరినీ అక్షరాస్యులను చేస్తానంటున్నాడు.

- సంగారెడ్డి జిల్లా కంది మండలం కవలం పేట గ్రామ పంచాయతీలో సర్పంచ్‌గా పోటీ చేస్తున్న మహమ్మద్ షఫీ (బాబా) పొలిటికల్ సైన్స్‌లో ఎంఏ చేస్తున్నాడు. షఫీ తల్లి రెండు సార్లు కవలం పేట ఉపసర్పంచుగా ఎన్నికయ్యారు. రాజకీయాల పట్ల తనకున్న ఆసక్తితోబరిలోకి షఫీ గ్రామంలోని నిరుద్యోగులకు ఉపాధి కల్పించిందుకు కృషి చేస్తానని హామీ ఇస్తున్నాడు.
- మెదక్ జిల్లా శివ్వంపేట మండలం దొంతి సర్పంచ్ పదవి ఈసారి జనరల్ అయ్యింది. దీంతో బీటెక్ పూర్తి చేసిన ఫణిశశాంక్ సర్పంచుగా పోటీ చేస్తున్నాడు. రిజర్వేషన్ కలిసిరావడంతో పోటీకి దిగినట్టు చెప్తున్న శశాంక్ తాను గెలిస్తే గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని అంటున్నాడు.
- మెదక్ మండలం ర్యాలమడుగు గ్రామానికి చెందిన హరీషా రెడ్డి హైద్రాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఆంత్రపాలజీలో ఎంఏ చదువుకున్నారు. ఈ పంచాయతీ జనరల్ మహిళకు రిజర్వు కావడంతో ఆమె పోటీ చేస్తున్నారు. తనకు ఉన్నత ఉద్యోగం లభించే అవకాశం ఉన్నా ఊరికి సేవ చేసేందుకు రెడీ ఆయ్యారు. తాను గెలిస్తే ఉపాధి కోసం వలస వెళ్లిన వారిని తిరిగి ఊరికి రప్పిస్తానని చెప్తున్నారు. ఊళ్లో ప్రతి మహిళఆర్థికంగా నిలదొక్కుకునేలా కార్యక్రమాలు తీసుకుంటానని అంటున్నారు.


శ్రీకాంత్


దినేష్‌రెడ్డి


శ్వేతారెడ్డి


మహమద్ షఫీ


హరీశారెడ్డి


ఫణిశశాంక్


విష్ణు


సాయిప్రియ

పుట్టిన ఊరికి సేవ చేద్దామనే..

- సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం కుందనవానిపల్లి గ్రామ సర్పంచ్‌గా దినేష్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బీటెక్ చదివిన ఆయన ప్రజలకు సేవ చేయాలని బరిలోకి దిగారు. ఉన్నత విద్యావంతుడైన దినేష్‌రెడ్డి సర్పంచ్‌గా ఉంటే ఊరు బాగుపడుతుందని అతన్ని గ్రామస్తులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని దినేశ్ చెప్తున్నారు.
- సిద్దిపేట మండలం రాఘవాపూర్ సర్పంచ్‌గా జి.సాయిప్రియ పోటీ చేస్తున్నారు. బీఎస్సీ పూర్తిచేసిన ఈ యువతి రిజర్వేషన్ అనుకూలించడంతో బరిలోకి దిగారు. తాను గెలిస్తే మౌలిక వసతుల మెరుగుపరుస్తానన్నారు. సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలం రేగులపల్లికి కుంభం శ్రీకాంత్ ఎంబీఏ ఫస్ట్ ఇయర్ చదువుతున్నాడు. రిజర్వేషన్ అనుకూలంగా రావడంతో సర్పంచ్‌గా పోటీ చేస్తున్నాడు.


కొమురవెల్లిలో పోలీసుల తనిఖీ కేంద్రం వద్ద రద్దీ

నేడే పట్నం వారం

- **కొమురవెల్లికి తరలివస్తున్న జనం**

సిద్దిపేట, వెలుగు: కోరిన కోర్కెలు తీర్చే కోరమీసాల కొమురవెల్లి మల్లన్న స్వామిని దర్శించుకోవడానికి వేలాదిగా భక్తులు తరలివస్తున్నారు. ముఖ్యంగా హైదరాబాద్ నుంచి వేలాదిగా భక్తులు రావడం వల్ల దీన్ని పట్నం వారంగా పిలుస్తారు. శనివారం రాత్రి వరకే వేలాది మంది భక్తులు కొమురవెల్లికి చేరుకున్నారు. ఆదివారం బోనాలు, పట్నాలు వేసి పూజలు నిర్వహిస్తారు. హైదరాబాద్, సమీప జిల్లాలతో పాటు మహారాష్ట్ర నుంచి అధిక సంఖ్యలో పట్నం వారం సందర్భంగా కొమురవెల్లి మల్లన్న స్వామిని దర్శించుకోవడం ఆనవాయితీ. మూడు నెలల జాతరకు ఇది ప్రారంభ వారంతోపాటు ప్రధాన ఘట్టంగా చెప్పుకోవచ్చు. ఆదివారం ఒక్క రోజే లక్షకు పైగా భక్తులు వస్తారని అంచనా.

ఆకాశన్నంటిన అద్దెలు

కొమురవెల్లిలో మల్లన్నను దర్శించుకున్న తరువాత భక్తులు ఇక్కడే నిద్ర చేసి వెళతారు. దీంతో స్థానికంగా అద్దె గదుల ధరలు ఆకాశన్నంటాయి. రెండు రోజుల కోసం గదుల అద్దెలు నాలుగు నుంచి ఆరు వేలకు చేరుకున్నాయి. దేవస్థానం తరపున ప్రత్యేకంగా గదులు నిర్వహించకపోవడంతో భక్తులు ప్రైవేటు గదులను అద్దెకు తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. దేవస్థానానికి దాతలిచ్చిన గదులు 158 వుండగా వాటిలో ఈ రెండు వారాల్లో చాలావరకు దాతల కుటుంబాలకు కేటాయిస్తారు. స్థానికంగా ప్రైవేటు గదులు సరిపోకపోవడంతో భక్తులు గ్రామ శివారల్లో చిన్న చిన్న గుడారాలు వేసుకుని నిద్రలు చేస్తారు.



పక్కాగా బందోబస్తు

చిన్న పట్నం సందర్భంగా మూడు రోజుల పాటు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నాం. భక్తుల వాహనాల కోసం ప్రత్యేకంగా పార్కింగ్ ఏర్పాటు చేసి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూస్తాం. హైదరాబాద్ నుంచి వచ్చే వాహనాలను ఆర్యవైశ్య భవన్ పక్కనున్న ఖాళీ స్థలంలో, సిద్దిపేట వైపు నుంచి వచ్చే వాహనాలను బతుకమ్మ చెరువు వద్ద, చేర్యాల వైపు నుంచి వచ్చే వాహనాలను బస్టాండ్ పక్కనున్న ఖాళీ స్థలాల్లో, వీఐపీల వాహనాల కోసం తోట బావి వద్ద పార్కింగ్ ఏర్పాట్లు చేశాం. అడిషనల్ డీసీపీ, ముగ్గురు ఏసీపీలు, ఆరుగురు సీఐలు, 20 మంది ఎస్‌ఐలు, 160 మంది కానిస్టేబుళ్లు మొత్తం 318 మంది విధుల్లో పాల్గొంటారు.

మహేందర్, హుస్నాబాద్ ఏసీపీ



ముగిసిన ఉమామహేశ్వర బ్రహ్మోత్సవాలు

అచ్చంపేట, వెలుగు: శ్రీశైల ఉత్తర ద్వారం ఉమామహేశ్వరంలో బ్రహ్మోత్సవాలు శనివారంతో ముగిశాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆఖరి అంకం చక్రస్నానంతో ముగించారు. ఆలయ పరిసరాల్లో నా పాపనాశని వద్ద ఉత్సవ విగ్రహాలకు చక్ర తీర్థ స్నానం చేయించారు. చివరి రోజు స్వామిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కందూరి సుధాకర్, ఆలయ ఈవో శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు.

సర్కారు దవాఖానాల్లో విటమిన్ 'ఎ' కరువు

- **ఆరు నెలలుగా ఆగిన సప్లై**
- **వ్యాక్సిన్‌లతోనే సరిపెడుతున్న డాక్టర్లు**

నల్లగొండ, వెలుగు: ప్రభుత్వ దవాఖానాల్లో విటమిన్ 'ఎ' నిల్వలు నిండుకున్నాయి. గత ఆరు నెలలుగా రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ విటమిన్ ఎ ద్రావకం సరఫరా బంద్ చేసింది. దీంతో వ్యాక్సిన్ కోసం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చిన చిన్నారులకు విటమిన్ 'ఎ' చుక్కల మందు ఇవ్వకుండానే తిప్పి పంపుతున్నారు. తొమ్మిది నెలలు దాటిన చిన్నారులకు ప్రతి ఆరు నెలలకోసారి వ్యాక్సిన్‌లతో పాటు, విటమిన్ 'ఎ' ద్రావకాన్ని ఇస్తారు. అంధత్వ నివారణ కార్యక్రమంలో భాగంగా చిన్నారుల్లో రేచీకటి, బ్రైట్ నెస్, ఐ సైట్ వంటి పలు రకాల కంటి జబ్బులు సోకకుండా ఉండేందుకు ఇది ఉపయోగపడుతుంది. తొమ్మిది నెలలు నిండిన చిన్నారులకు ఆరు నెలలకోసారి చొప్పున మొత్తం తొమ్మిది సార్లు తప్పక వేయాలి. పై నుంచి సప్లై లేకపోవడం, పీహెచ్‌సీల్లో ఉన్న నిల్వలు కాలపరిమితి దాటిపోవడంతో వాటిని వాడకుండా పక్కన పడేశారు. హాసిటల్స్‌లో విటమిన్ ఎ లేదన్న విషయాన్ని నల్లగొండ జిల్లా అధికారులు అనేక సమావేశాల్లో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ప్రతి నెలా మిగతా మందుల సప్లైలో ఎలాంటి ఇబ్బంది లేకున్నా విటమిన్ ఎ విషయంలోనే ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి స్పందన లేదని అధికారులు అంటున్నారు. ఈ మందును ప్రభుత్వమే కొనుగోలు చేసి రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖకు సప్లై చేస్తుంది. అక్కడి నుంచి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ద్వారా అన్ని ప్రాథమిక ఆరోగ్య సెంటర్లకు పంపుతారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ వద్దనే స్టాకు లేకపోవడంతో జిల్లాలకు సప్లై ఆగింది. అత్యవసరమైతే బయటి మార్కెట్లో కొనుగోలు చేయాలని ఉన్నతాధికారులు నోటిమాటగా ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వం నేరుగా ఒకే కంపెనీ నుంచి కొనుగోలు చేసి సప్లై చేస్తున్నందున ఇప్పటివరకు ఎలాంటి సమస్య లేదు. అదే బయటి మార్కెట్లో కొనుగోలు చేయాలంటే రకరకాల కంపెనీల పేర్లతో మందులు ఉంటాయని, వాటిని వాడితే ఏదైన సమస్య తలెత్తితే మొదటికే మోసం వస్తుందన్న భయంతో కొనట్లేదని అధికారులు చెబుతున్నారు. నల్లగొండ జిల్లాలో ఏటా 28 వేల మంది పిల్లలు జన్మిస్తుంటారు. వీరిలో 18 నుంచి 20 వేల మంది చిన్నారులకు ప్రభుత్వ హాస్పిటల్‌లోనే ఉచితంగా పోలియో చుక్కలు, వ్యాక్సిన్‌లు ఇస్తుంటారు. దీంట్లో తొమ్మిది నెలలు దాటిన చిన్నారులకు తొలి ఏడాది లక్ష, రెండో ఏడాది రెండు లక్షల యూనిట్లు చొప్పున విటమిన్ ఎ ద్రావకాన్ని వాడుతుంటారు. సప్లై లేకపోవడంతో కేవలం మెదడువాపు, ఎంఆర్ వ్యాక్సిన్‌లు మాత్రమే వేసి పంపుతున్నారు.

హాస్పిటల్‌లో స్టాకు లేదు

విటమిన్ ఎ ద్రావకం సప్లై చేయాల్సిందిగా ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. అక్కడ కూడా స్టాకు లేకపోవడంతో జిల్లాకు పంపలేదు. చిన్నారులకు వ్యాక్సిన్‌లు, మందులకు ఎలాంటి కొరత లేదు. విటమిన్ ఎ ద్రావకం బయటి మార్కెట్లో కొనుగోలు చేయాలని చెప్పారు. కానీ అధికారికంగా ఎలాంటి ఉత్తర్వులు రాలేదు.

- వై. గంగవర ప్రసాద్, డీఎంహెచ్‌వో


మాట్లాడుతున్న మైనారిటీ కమిషన్ వైస్ చైర్మన్ శంకర్ లూక్

చిన్నారులకు కన్నీటి వీడ్కోలు

గుర్రపుతండాలో పూర్తయిన అంత్యక్రియలు

దేవరకొండ, వెలుగు: గుర్రపుతండా గుండెలవిసేలా రోదించింది. అమెరికాలో చనిపోయిన చిన్నారులకు శనివారం కన్నీటితో కడసారి వీడ్కోలు పలికారు. అంతిమ సంస్కారాలకు భారీగా ప్రజలు తరలిరావడంతో గుర్రపుతండా జనసంద్రంగా మారింది. మృతదేహాలను ప్రజల సందర్శనార్థం ఉంచి చిన్నారుల ఆత్మలకు శాంతి చేకూరాలని ప్రార్థన కార్యక్రమాలు నిర్వహించారు. అంతిమయాత్రకు ప్రజాప్రతినిధులు, క్రిస్టియన్ సంస్థల ప్రతినిధులు, ప్రభుత్వాధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మైనారిటీ కమిషన్ వైస్ చైర్మన్ శంకర్ లూక్ మాట్లాడుతూ పేద విద్యార్థులకు శ్రీనివాస్‌నాయక్ చేసిన సేవలను కొనియాడారు. బిడ్డలు లేని లోటును ఎవరూ తీర్చలేరని, ప్రభుత్వం తరపున అండగా నిలుస్తామన్నారు. నల్లగొండ ఎంపీ గుత్తా సుఖేందర్‌రెడ్డి, జడ్పీ చైర్మన్ నేనావత్ బాలునాయక్, దేవరకొండ ఎమ్మెల్యే రమావత్‌రవీంద్రకుమార్, కేతావత్‌బీల్యానాయక్ హాజరై మృతుల తల్లిదండ్రులు శ్రీనివాస్‌నాయక్, సుజాతకు సానుభూతి తెలిపారు. బిడ్డలు లేరని అధైర్యపడొద్దని, సేవా కార్యక్రమాలను కొనసాగించాలని, తామంతా అండగా ఉంటామని భరోసానిచ్చారు. తండాలోని అలేతియా బంజారా స్కూల్‌స్టూడెంట్స్, టీచర్లు ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని క్రైస్తవ గీతాలను ఆలపించారు. అంత్యక్రియలకు హైదరాబాద్, సికింద్రాబాద్‌తో పాటు చందంపేట, పీఏపల్లి, దేవరకొండ మండలాల నుంచి జనం తరలివచ్చారు. మైనార్టీ సోషల్ వెల్ఫేర్ జిల్లా అధికారి వెంకటేశ్వర్లు, దేవరకొండ ఆర్డీవో లింగ్యానాయక్ పాల్గొన్నారు.

9 నెలల పసికందుకు స్వైన్ ఫ్లూ

వరంగల్ అర్బన్, వెలుగు: తొమ్మిది నెలల శిశువుకు స్వైన్‌ఫ్లూ సోకింది. వరంగల్ నగ రంలోని కాజీపేట దర్గా ప్రాంతానికి చెందిన ఆనందరావు కుమారుడు భరద్వాజ అనారోగ్యానికి గురి కాగా రెండు రోజుల క్రితం ఎంజీఎం హాస్పిటల్‌లో చేర్చారు. అ నుమానం వచ్చిన డాక్టర్లు పరీక్షలు నిర్వహించారు. రిపోర్టులు హైదరాబాద్ పంపించారు. స్వైన్‌ఫ్లూ సోకినట్లు శనివారం నిర్ధారించినట్లు డాక్టర్లు తెలిపారు.

ముగ్గురిపై పీడీ యాక్ట్

సూర్యాపేట, వెలుగు: హైవేలపై వెళ్తున్న లారీల నుంచి వస్తువులను దొంగిలించే టార్పాలిన్ గ్యాంగ్‌పై శనివారం పోలీసులు పీడీ యాక్ట్ నమోదు చేశారు. రాజస్తాన్‌లోని పాలి జిల్లాకు చెందిన శర్వన్‌లాల్ చౌదరి, రామ్‌దేవ్‌జాత్, ప్రకాశ్ కుమావత్‌లు రాత్రి వేళల్లో హైవేపై వెళ్తున్న గూడ్స్ లారీలను రన్నింగ్‌లోనే ఎక్కి వాటి లోకి వస్తువులను దొంగిలిస్తుంటారు. వీరిపై రెండు తెలుగు రాష్ట్రాల్లో 13 కేసులు ఉన్నాయి. వీరు సూర్యాపేట సమీపంలో హైవేపై సంచరిస్తుండగా మొబైల్ ట్రాకింగ్ ద్వారా గుర్తించిన పోలీసులు వారిని అరెస్ట్ చేశారు. వీరి నుంచి ఒక డీసీఎం, స్కార్పియోతో పాటు, రూ.1.15 కోట్ల విలువైన వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

గెలిపిస్తే ఐదేళ్లు కుండలు ఫ్రీ

- **ఓటర్లకు బంపర్ ఆఫర్**

లింగంపేట, వెలుగు : ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు సంఘాలవారీగా టెంట్లు, చీరలు, డబ్బులు ఇస్తామనడం అందరికీ తెలిసిందే. అయితే తన భార్యను వార్డు సభ్యురాలిగా గెలిపిస్తే ఐదేళ్లపాటు కాలనీ ప్రజలకు కుండలు ఫ్రీగా ఇస్తానని బంపర్‌ఆఫర్‌ప్రకటించాడో వ్యక్తి. కామారెడ్డి జిల్లా లింగంపేట మండలం పర్మల్ల గ్రామానికి చెందిన రాజలింగం తన భార్య లక్ష్మీని గ్రామంలోని ఐదో వార్డు సభ్యురాలిగా పోటీలో దించాడు. శనివారం ఆయన కాలనీవాసులతో సమావేశమై తన మనసులోని మాట చెప్పాడు. తన భార్యను వార్డు సభ్యురాలిగా గెలిపిస్తే తాను ఐదేళ్ల పాటు కాలనీ ప్రజలందరికీ పెళ్లిళ్లకు, బోనాల పండుగలకు, చావులకు, ఫ్రీగా కుండలను అందజేస్తానని చెప్పగా కాలనీవాసులు అంగీకరించారట. గ్రామంలో కొత్తగా నిర్మిస్తున్న పుట్ట ఎల్లమ్మ ఆలయ ఉత్సవాలకు అవసరమయ్యే కుండలను సైతం ఇస్తానని హామీ ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది.

సర్పంచ్ బరిలో బామ్మ



- **90 ఏళ్ల వయసులో పోటీకి సై**

ఖమ్మం, వెలుగు: 90 ఏళ్ల వయసులో పోటీకి సై అనడమే కాదు ఉత్సాహంగా ప్రచారం సైతం చేస్తోందీ బామ్మ. రెండో విడత ఎన్నికలు జరిగే సత్తుపల్లి నియోజకవర్గ పరిధిలోని పెనుబల్లి మండలం తుమ్మలపల్లిలో 90 ఏళ్ల వయస్సు పైబడిన ఈడ రత్తమ్మ సర్పంచ్‌గా ఎన్నికల బరిలో నిలిచింది. గతంలో పెనుబల్లి మండల జడ్పీటీసీగా, వరుసగా రెండుసార్లు తుమ్మలపల్లి సర్పంచ్‌గా ఆమె పని చేశారు. గత ఎన్నికల్లో ఓడిపోయారు. ఈసారి మరోసారి నామినేషన్ వేసి ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. రత్తమ్మ భర్త చెన్నయ్య స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నారు. తుమ్మలపల్లి, బయ్యన్నగూడెం ఉమ్మడి పంచాయతీగా ఉన్నప్పుడు దాదాపు 30 ఏళ్లు చెన్నయ్య సర్పంచ్‌గా పనిచేశారు. ఆ తర్వాత మండలాలు ఏర్పడడంతో పెనుబల్లి మండల మొదటి జడ్పీటీసీగా రత్తమ్మ ఎన్నికయ్యారు. 2001 నుంచి 2013 వరకు రెండు సార్లు తుమ్మలపల్లి సర్పంచ్ గా చేశారు. గత సర్పంచ్ పాలన నచ్చని గ్రామస్తులు రత్తమ్మను కాంగ్రెస్ పార్టీ మద్దతుతో మళ్లీ పోటీ చేయిస్తున్నారు. ఈ నెల 25న పోలింగ్ జరగనుంది. రత్తమ్మకు మొత్తం 8 మంది పిల్లలున్నారు. వారిలో కొంతమంది ప్రభుత్వ ఉద్యోగాలు చేసి రిటైర్మెంట్ కూడా తీసుకున్నారు. మనుమలు, మనవరాళ్లు కూడా వివిధ రంగాల్లో స్థిరపడ్డారు. అయినా, రత్తమ్మ మాత్రం ఉత్సాహంగా ఇంటింటికీ తిరిగి ప్రచారం చేస్తోంది.

గ్రామస్తుల ఒత్తిడితోనే పోటీ చేస్తున్న రత్తమ్మ, సర్పంచ్ అభ్యర్థి

వయస్సు సహకరించడం లేదని చెప్పినా వినిపించుకోలేదు. గ్రామస్తుల ఒత్తిడితోనే ఎన్నికల్లో పోటీ చేస్తున్న. ఇంతకుముందు నేను గ్రామంలో చేసిన పనులే నన్ను గెలిపిస్తాయని నమ్ముతున్న. ఎన్నికలప్పుడు తప్ప మా గ్రామంలో ఎప్పుడూ పార్టీలకు అతీతంగానే అభివృద్ధి పనులు చేశా. పదవిలో ఉన్నా, లేకున్నా పేదలకు సాయం చేశా. అదే నన్ను గెలిపిస్తుంది.

రత్తమ్మనే గెలిపించుకుంటాం

గతంలో సర్పంచ్, జడ్పీటీసీగా గ్రామానికి రత్తమ్మ చాలా సేవ చేశారు. ఊర్లో పేదల ఉన్నతస్థాయి చదువుల కోసం చాలా మందికి ఆర్థిక సాయం చేశారు. ప్రభుత్వం స్కూళ్లలో మధ్యాహ్న భోజన పథకం పెట్టకముందు నుంచి మా ఊర్లో రత్తమ్మ సొంత డబ్బులతో పిల్లలకు భోజనం పెట్టించారు. పిల్లలకు కావాల్సిన పుస్తకాలు, యూనిఫాం ఇస్తున్నారు. ఆమెను గెలిపించుకుంటేనే గ్రామానికి మేలు జరుగుతుంది.

– పరకాల సత్యనారాయణ, గ్రామస్తుడు

పోరులో వాళ్లిద్దరూ..

- **సర్పంచ్‌గా భార్య, వార్డుమెంబర్‌గా భర్త**

రుద్రూర్ , వెలుగు: నిజామాబాద్ జిల్లా రుద్రూర్ మండలం లోని రాయకూర్ క్యాంపులో గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు భార్యాభర్తలు ఇద్దరూ నామినేషన్‌దాఖలు చేశారు. ఇద్దరూ పోటీలో నిలబడడంతో ఇక్కడి ఎన్నికలపై ఆసక్తి నెలకొంది. నిజామాబాద్ జిల్లా రుద్రూరు మండలంలోని రాయకూ ర్ క్యాంపు కొత్త పంచాయతీగా ఏర్పాటైంది. ఈ పంచాయతీలో 650 ఓట్లు ఉన్నాయి. గ్రామానికి మొదటి సర్పంచి కావాలనుకునే ఆశావహులు చాలామందే ఉన్నా రిజర్వేషన్ వారి ఆశలపై నీళ్లు చల్లింది. ఈ పంచాయతీకి రిజర్వేషన్ జనరల్ మహిళ కావడంతో ఆశావహులు పోటీ నుంచి తప్పుకున్నారు. మరికొందరు తమ భార్యలను బరిలో దింపారు. రాయకూర్ క్యాంపునకు చెందిన పరచూరి పద్మ, గోపాల్‌రావు భార్యాభర్తలు. పరచూరి పద్మ సర్పంచ్‌గా పోటీ చేస్తుండగా భర్త గోపాల్ రావు రెండో వార్డు సభ్యుడిగా పోటీ చేస్తున్నారు.



'అన్నా.. గీ చికెన్ పొట్లం తీస్కో.. గీ కవర్‌లో మందు సీసలున్నయ్.. అక్కా మీరేం ఫికర్ జెయ్యకుండ్రి.. కూల్ డ్రింక్ సీసాలు కూడా గా కవర్లనే ఉన్నయ్.. అవ్వా ఇగో గీ నోటు తీస్కాని.. నీ ఓటు గీ గుర్తు మీద వెయ్యి.. అరే తమ్మి.. మనోళ్లందరిని తోల్కొని చింత చెట్ల బాయి దగ్గరకు రండ్రి.. ఇయ్యాల్ల పొద్దట్నుంచి రాత్రి దాక జోరుగా దావత్ ఉంటది. అందరొచ్చి గీడనే తాగుండ్రి.. తినుండ్రి..' ప్రస్తుతం ఏ గ్రామంలో చూసినా సర్పంచ్ అభ్యర్థి సంబంధికుల నుంచి వినిపిస్తున్న మాటలివి. పంచాయతీ ఎన్నికల మొదటి విడత పోలింగ్ సోమవారమే జరగనుండటంతో ఓటర్లను ఆకర్షించేందుకు అభ్యర్థులు పడరాని పాట్లు పడుతున్నారు.

ప్రేమ ఒలకబోస్తుండ్రు

- అక్క.. చెల్లె.. అన్న.. తమ్మి అంటూ వరుసలు
- ఇంటింటికీ నాన్‌వెజ్ పార్శిళ్లు
- దావతుల కోసం ప్రత్యేక కేంద్రాలు
- పంచాయతీపై పట్టు కోసం చివరి ప్రయత్నాలు
- ఓటర్లను ఆకర్షించేందుకు అభ్యర్థుల పోటాపోటీ యత్నాలు

వెలుగు నెట్‌వర్క్:

రాష్ట్రవ్యాప్తంగా పంచాయతీ ఎన్నికల తొలి విడత పోలింగ్ సోమవారం జరగనుండగా అభ్యర్థులు ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. ఎన్నికల ప్రచారం ముగియడంతో నాలుగు రోజులుగా పల్లెల్లో కొత్త రాజకీయానికి తెరలేసింది. ఓటర్లను తమ వైపు తిప్పుకునేలా పలువరు దావత్‌లకు ఏర్పాట్లు చేశారు. ఆదివారం జోరుగా విందులు ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రచించినట్లు తెలుస్తోంది. దావతులకు సంబంధించిన పదార్థాల కోసం ముందు గానే ఆర్డర్లు ఇచ్చారు. ఇందుకోసం లక్షల రూపాయలను ఖర్చు చేస్తున్నట్లు సమాచారం. పలు గ్రామాల్లో నగదు పంపిణీ కూడా జరుగుతున్నట్లు తెలుస్తోంది. పోలింగ్ దగ్గరపడ్డ కొద్దీ ఇది మరింత ఎవ్కువవుతోంది. నిజామాబాద్ ఉమ్మడి జిల్లా పరిధిలోని జాతీయ రహదారిలో ఆర్థిక వనరులు ఎక్కువ వచ్చే ఓ గ్రామ పంచాయతీలో ఓ అభ్యర్థి ఒక రోజు దావత్ కోసం లక్ష రూపాయల దాకా ఖర్చు పెట్టారంటే పల్లె పోరుకు ఎంత మొత్తంలో ఖర్చు చేస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. ప్రధాన గ్రామపంచాయతీల్లో ఎక్కువగా ఇదే విధంగా ఖర్చు పెడుతున్నట్లు తెలుస్తోంది.

పంట పొలాలే.. దావత్ స్థలాలు..

గ్రామాల శివారు ప్రాంతాల్లోని పంట పొలాలు రెండు రోజులుగా యూత్‌తో కనిపిస్తున్నాయి. గ్రామానికి ఎటువైపు వెళ్లినా పెద్ద పెద్ద చెట్లకింద గుంపులకొద్దీ యువకులు కనిపిస్తున్నారు. అభ్యర్థులు ఎవరికి వారు ఓటర్లకు దావతులు ఇస్తూ బుట్టలో వేసుకుంటున్నారు. ఇప్పటికే లక్షల రూపాయలను దావతుల కోసం ఖర్చు పెట్టినట్టు తెలుస్తోంది. మొదటి విడత పంచాయతీలో ప్రచారానికి ఆదివారం ఒక్క రోజు కీలకం కావడంతో దావతుల పర్వం జోరుగా సాగుతోంది.

ఇంటింటికీ పార్శిళ్లు..

కొన్ని గ్రామాల్లో ఇంటింటికీ నాన్‌వెజ్ పదార్థాల ప్యాకెట్లు పంపిణీ చేస్తున్నారు. కొందరు తీసుకోవటానికి తిరస్కరిస్తున్నప్పటికీ ఉంచుకోండంటూ తలుపులు తట్టి మరి ఇచ్చి వెళ్లుండటం గమన్హారం. మద్యం బాటిళ్లు కూడా బలవంతంగా అప్పగించి వెళ్తున్నట్టు తెలుస్తోంది. మద్యం తాగనివారికి కూల్‌డ్రింక్స్, తదితర వస్తువులు పంపిణీ చేస్తూ అక్క, అన్న అంటూ వరుసలు కలిపి కలుపుగోలుగా మాట్లాడుతున్నారు. ఓటర్లను ఆకట్టుకునేందుకు అభ్యర్థులు పోటాపోటీ పడుతున్నారు. ఏదేమైనా ఓటు కోసం ఓటర్లపై ఎప్పుడూ లేనంత ప్రేమ ఒలకబోస్తూ వారు పడుతున్న పాట్లు అంతాఇంతా కాదనే చెప్పాలి.

గుర్తులు గుర్తుండేందుకు..

పంచాయతీ ఎన్నికల మొదటి విడత ప్రచారంలో భాగంగా అభ్యర్థులు తమకు కేటాయించిన గుర్తులను ఓటర్లకు బహుమతులుగా ఇస్తున్నారు. జెగ్గు గుర్తు ఉన్నవారు జెగ్గులను కొని ఓటర్లకు ఇస్తున్నారు. ఉంగరం గుర్తులున్నవారు వారి వారి స్థాయిలో ఉంగరాలను ప్రదానం చేస్తూ ఓటు అభ్యర్థిస్తున్న పరిస్థితులున్నాయి. మరి కొందరు వారు చేసే వ్యాపారానికి సంబంధించిన ఏదైనా వస్తువులను కానీ, వాటికి సంబంధించిన ప్రత్యేక ఆఫర్లను ఇస్తూ ఆకట్టుకుంటున్నారు.

మళ్లీ గుడి లొల్లి

- అక్రమ గుడిని కూల్చేసిన 'గిరిరాజ్' స్టూడెంట్స్
- అడ్డుకోబోయిన కాలనీ వాసులు
- ఇరువర్గాల మధ్య వాగ్వాదం

నిజామాబాద్, వెలుగు: నిజామాబాద్ నగరంలోని దుబ్బ ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ గిరిరాజ్ కళాశాలకు చెందిన భూమిలో స్థానిక కాలనీవాసులు ఇటీవల రాత్రికి రాత్రే గుడి నిర్మించిన సంగతి తెలిసిందే. ఆ రోజు స్థానికంగా ఈ ఘటన పెద్ద హాట్ టాఫిక్‌గా మారింది. అయితే ఆ గుడిని కాలేజీ సిబ్బంది, స్టూడెంట్స్ శనివారం కూల్చేయడంతో మళ్లీ లొల్లి మొదలైంది. గుడి కూల్చివేత విషయం తెలుసుకున్న కాలనీవాసులు పెద్ద సంఖ్యలో కాలేజీ వద్దకు చేరుకున్నారు. గుడిని కూల్చొద్దని స్టూడెంట్‌స్‌ను అడ్డుకున్నారు. దీంతో కాలనీవాసులు, కాలేజీ సిబ్బంది, స్టూడెంట్స్ మధ్య వాగ్వాదం జరిగింది. కాలనీకి చెందిన సంజయ్ పురోహిత్, శ్రీహరి తదితరులు గుడి కూల్చివేతను గట్టిగా ప్రతిఘటించారు. సంజయ్ పురోహిత్ ఒక దశలో పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుంటానని బెదిరించాడు.

జరిగింది ఇదీ..

ఈనెల 13న రాత్రికి రాత్రే గవర్నమెట్ గిరిరాజ్ కాలేజీలో కొందరు కాలనీవాసులు గుడి నిర్మాణాన్ని చేపట్టారు. చుట్టూ గోడలు, లోపలి భాగంలో రెండు గద్దెలను నిర్మించి దేవతా విగ్రహాలను ప్రతిష్టించి పూజలు చేశారు. 14న కాలేజీ తెరిచాక కళాశాల ప్రాంగణంలో కొత్తగా గుడి వెలసి ఉండటం చూసి కాలేజీ సిబ్బంది, స్టూడెంట్స్ అవాక్కయ్యారు. కళాశాల స్థలంలో అక్రమంగా గుడి నిర్మాణం చేపట్టడాన్ని తప్పు పట్టి కాలనీ వాసులను ప్రశ్నించారు. దాంతో కాలనీ వాసులకు, కాలేజీ సిబ్బంది మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. దాంతో కాలేజీ ప్రిన్సిపాల్ రాజం వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాంతో గొడవ పెద్దదయ్యింది.

స్థలం కాలేజీదే: ఎస్ఐ

గుడి కట్టిన స్థలం గిరిరాజ్ కాలేజీదే. కాలనీ వాసులు కట్టిన గుడి నిర్మాణం అక్రమ కట్టడమే. గుడిని తొలగించేందుకు కాలేజీ సిబ్బంది పొక్లయినర్‌ను తెప్పించారు. కానీ కొంతమంది కాలనీ వాసులు పొక్లయినర్ ఆపరేటర్‌ను బెదిరించారు. దీంతో కాలేజీ సిబ్బంది, స్టూడెంట్స్ కలిసి గుడిని తొలగించారు. ఇరు వర్గాల వారితో మాట్లాడి సమస్యను శాంతి యుతంగా పరిష్కరించేందుకు నగర ఏసీపీ వారిని ఏసీపీ కార్యాలయానికి రమ్మన్నారు.

మద్యం తాగి వాహనాలు నడపొద్దు

బాన్సువాడ, వెలుగు: ప్రజా రక్షణ కోసమే చట్టాలు తయారు చేయబడ్డాయని బాన్సువాడ మున్సిప్ కోర్టు జడ్జి శ్రీనివాస్ అన్నారు. శనివారం కామారెడ్డి జిల్లా బాన్సువాడ పట్టణంలోని మున్సిప్ కోర్టు ఆవరణలో 9 పోలీస్ స్టేషన్ల పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్, పేకాట ఆడి జరిమానాలు పడ్డా వారికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ యాదగిరి మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడపొద్దని, దాని వల్ల కలిగే అనార్థాలను వారికి వివరించారు. పేకాట వల్ల కుటుంబాలు ఆర్థికంగా చితికిపోయి, రోడ్డున పడుతున్నాయని, దురాలవాటును మానుకోవాలని సూచించారు. మైనర్లకు ద్విచక్ర వాహనాలిస్తే ఇచ్చిన వారిపై, నడిపిన వారిపై చర్యలు తీసుకుంటున్నామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐ మహేష్‌గౌడ్, మధుసూదన్, ఎస్సై సందీప్, అడ్వకెట్స్ ఖలీల్, బీర్కూర్ ఎస్ఐ పూర్ణేశ్వర్ పాల్గొన్నారు.



శనివారం జరిగిన సమీక్షలో మాట్లాడుతున్న ఆర్డీవో మోహన్‌రావు

ఉర్సులో ఇబ్బందులు ఉండొద్దు

హుజూర్‌నగర్, వెలుగు: ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని జాన్‌పహాడ్ ఉర్సుకు వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా సమన్వయంతో పనిచేయాలని హుజూర్ నగర్ ఆర్డీవో మోహన్‌రావు సూచించారు. ఉర్సు నిర్వహణపై శనివారం నేరేడుచర్లలో ఆయన సమీక్ష నిర్వహించి మాట్లాడారు. ఈ నెల 25న జరిగే ఉర్సు కోసం రూ.6.32 లక్షలు మంజూరు అయ్యాయన్నారు. తాత్కాలిక పద్ధతిలో ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. దామరచర్ల నుంచి దర్గాకు వెళ్లే దారిలో ఉన్న బ్రిడ్జికి మరమ్మతు చేయాలన్నారు. కోదాడ, మిర్యాలగూడ డిపో నుంచి దర్గా వరకు 30 ఆర్టీసీ బస్సులు నడుపుతారని, ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో హుజూర్‌నగర్ సీఐ భాస్కర్, నేరేడుచర్ల, పాలకీడు తహసీల్దార్లు ఖలీల్ అహ్మద్, భీంరావ్ అంబేద్కర్, ఎంపీడీవో మహేందర్‌రెడ్డి, ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.



నిర్భయంగా ఓటేయండి

ఎస్పీ చందనాదీప్తి

మెదక్, వెలుగు: పంచాయతీ ఎలక్షన్లలో ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు వినియోగించుకోవాలని జిల్లా ఎస్పీ చందనా దీప్తి అన్నారు. శనివారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో పోలీస్ ఆఫీసర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు లోను కాకుండా వారికి ప్రశాంతమైన వాతావరణం కల్పిస్తామని చెప్పారు. ఓటు విషయంలో ఎవరైనా బెదిరిస్తే వెంటనే పోలీస్ స్టేషన్, లేకుంటే డయల్ 100కి ఫోన్ చేయాలని సూచించారు. మద్యం, డబ్బు, ఇతర వస్తువులకు బానిస కావొద్దని, నచ్చిన క్యాండిడేట్‌కి నిర్భయంగా ఓటు వేయాలన్నారు. ఎన్నికల సందర్భంగా మద్యం అమ్మితే వారిపైన చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. గత ఎన్నికలలో నమోదైన కేసులు, అల్లర్లు సృష్టించిన వ్యక్తులపై నిఘావేసి ఉంచాలన్నారు. అధికారులు అలర్ట్‌గా ఉండాలని, ఎలక్షన్‌కు సంబంధించి వీడియోగ్రాఫ్, సీసీ కెమెరా ఫుటేజ్, డాక్యుమెంటేషన్ తప్పనిసరిగా ఉండాలని సూచించారు.

టెక్నాలజీతో అధికోత్పత్తి

- భవిష్యత్తు ఫుడ్ ప్రాసెసింగ్ దే
- మైక్రోసాఫ్ట్ యూఎస్‌డైరెక్టర్ శివకుమార్

హైదరాబాద్, వెలుగు: జనాభా అవసరాలకు సరిపడా ఆహార ధాన్యాల ఉత్పత్తిని పెంచడంలో టెక్నాలజీ కీలక పాత్ర పోషిస్తుందని మైక్రోసాఫ్ట్ యూఎస్ డైరెక్టర్ శివకుమార్ కొండూరి చెప్పారు. శనివారం ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో డిజిటల్ టెక్నాలజీ వినియోగంపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన శివకుమార్.. విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. 2050 నాటికి పెరగనున్న జనాభాకు సరిపడా ఆహారం కావాలంటే ఆహార ధాన్యాల ఉత్పత్తి 70 శాతం పెరగాలని చెప్పారు. అందుబాటులో ఉన్న వనరులతోనే అధికోత్పత్తి సాధించడంలో టెక్నాలజీ కీలకమన్నారు. రానున్నది ఫుడ్ ప్రాసెసింగ్ యుగమని చెబుతూ, సాగును లాభసాటిగా మార్చాలని, వినియోగదారుల అలవాట్లను తీర్చే పంటల ఉత్పత్తి జరగాలన్నారు. దీనికోసం ఆధునిక టెక్నాలజీ పద్ధతులను ఉపయోగించాలన్నారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా వర్సిటీలలో కొత్త కోర్సులను ప్రారంభించాలని అన్నారు. నాలెడ్జ్ ఆధారిత వ్యవసాయానిదే భవిష్యత్తని వీసీ డాక్టర్ ప్రవీణ్‌రావు అన్నారు. ఆధునిక టెక్నాలజీని స్థానిక అవసరాలకు అనుగుణంగా మార్చి రైతుల దగ్గరికి చేర్చాలన్నారు. తరిగిపోతున్న సహజ వనరులు, పెరిగిపోతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా విధానాలలో మార్పు తేవాలని శివకుమార్ కోరారు.

23న ఈశ్వరీ బాయి వందేళ్ల వేడుకలు

హైదరాబాద్, వెలుగు: ప్రముఖ సోషలిస్టు నేత ఈశ్వరీ బాయి శత జయంతి ఉత్సవాలు ఈ నెల 23న రవీంద్ర భారతిలో సాయంత్రం ఐదు గంటలకు జరుగనున్నాయి. లోక్‌సభలో ప్రతిపక్ష నేత మల్లిఖార్జున ఖర్గే ఈ ఉత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరవుతారు. ఈశ్వరీ బాయి స్మారక అవార్డును ప్రజా గాయకుడు గద్దర్‌కు అందజేస్తారు.

మొక్కల పెంపకానికి బూడిద

- 'హరితహారం' కోసం వినియోగిస్తాం
- ఫ్లైయాష్ వాడకంపై ఫారెస్టు అకాడమీలో సెమినార్

హైదరాబాద్, వెలుగు: మొక్కల పెంపకానికి, అడవుల సంరక్షణకు ఫ్లైయాష్ ఎంతో ఉపయోగపడుతుందని పలువురు పరిశోధకులు చెప్పారు. థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో వెలువడే బూడిద (ఫ్లైయాష్)ను అడవుల సం రక్షణకు వినియోగించడం, బంజరు భూములను వృద్ధిలోకి తేవడంపై దూలపల్లి ఫారెస్టు అకాడమీలో శనివారం సెమినార్ జరిగింది. ఈ సందర్భంగా కేంద్ర అటవీశాఖ డైరెక్టర్ జనరల్ సిద్ధాంత దాస్ మాట్లాడుతూ అడవుల సంరక్షణకు ప్రధానమంత్రి మోడీ అత్యంత ప్రాధాన్యమిస్తున్నట్టు చెప్పారు. ఫ్లైయాష్‌ను పూర్తిగా వినియోగించాల్సిన బాధ్యత థర్మల్‌విద్యుత్ కేంద్రాలదేనన్నారు. మొక్కల పెంపకానికి బూడిద వినియోగంపై అధ్యయనం చేశామని, కొత్త టెక్నాలజీని రాష్ట్రాల అటవీశాఖలు అమలుచేయాలని ఫ్లైయాష్‌పరిశోధన కేంద్రం సెక్రెటరీ జనరల్ డాక్టర్ విమల్‌కుమార్ పేర్కొన్నారు. రాష్ట్రంలోని హరితహారం నర్సరీల్లో మొక్కల పెంపకానికి ఈ ఏడాది నుంచే ఫ్లైయాష్‌ను వినియోగిస్తామని రాష్ట్ర అటవీ సంరక్షణ ప్రధాన అధికారి పీకే ఝా తెలిపారు

మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యం

సోషల్ వెల్ఫేర్ బోర్డ్ చైర్‌పర్సన్ సుజాత

హైదరాబాద్, వెలుగు: మహిళల భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని సోషల్ వెల్ఫేర్ బోర్డ్ చైర్‌పర్సన్ రాగం సుజాతయాదవ్ అన్నారు. శనివారం బోర్డు కార్యాలయంలో 'మహిళల భద్రత మనందరి బాధ్యత' పేరుతో రూపొందించిన పుస్తకాన్ని ఆమె ఆవిష్కరించి మాట్లాడారు. గృహహింస, బాలికలకు పౌష్టికాహారం, భద్రతకు సంబంధించిన చట్టాలపై ఈ పుస్తకంలో వివరంగా పేర్కొన్నారని తెలిపారు.

శుభ్రంగా ఉండాలి

హుజూర్‌నగర్, వెలుగు: మన చుట్టూ ఉన్న పరిసరాలు శుభ్రంగా ఉన్నపుడే మనమంతా ఆరోగ్యంగా ఉంటామని హుజూర్‌నగర్ సీనియర్ సివిల్ జడ్జి జయంతి అన్నారు. శనివారం లాయర్లు, కోర్టు సిబ్బందితో కలిసి ఆమె స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవడం పౌరుల బాధ్యత అన్నారు.

ఒక్క గది.. మూడు కేంద్రాలు

- అసౌకర్యాల నడుమ పోలింగ్ కేంద్రాలు
- వంట గదుల్లోనూ బూత్‌ల ఏర్పాటు

దేవరకొండ, వెలుగు:

అసెంబ్లీ ఎన్నికల కోసం బూత్‌ల వద్ద భారీ ఏర్పాట్లు చేసిన అధికారులు పంచాయతీ ఎన్నికలకు వచ్చే సరికి నిర్లక్ష్యం ప్రదర్శించారు. దీంతో అసౌకర్యాలతో పోలింగ్ కేంద్రాలు ఓటర్లకు స్వాగతం పలకనున్నాయి. తొలివిడత ఎన్నికలు జరిగే నల్లగొండ జిల్లాలోని దేవరకొండ నియోజకవర్గంలో మొత్తం 2,174 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. కొత్తగా పంచాయతీలు ఏర్పాటు కావడంతో గ్రామాల్లోనే ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుంది. దీంతో స్థానికంగా ఉన్న పాఠశాలలు, అంగన్‌వాడీల్లో కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఒక్కో పంచాయతీ పరిధిలో 6 నుంచి 10 వార్డులకు పైగా ఉండడంతో ఒక్కో వార్డుకు ఒక పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. గదుల కొరత ఏర్పడడంతో ఒక్కో గదిలో రెండు నుంచి మూడు వార్డులకు సంబంధించిన బూత్‌లు పెట్టారు. దేవరకొండ మండలంలోని కాచారం ప్రాథమిక పాఠశాల భవనంలోని రెండు గదుల్లో ఆరు పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారు. దీంతో పోలింగ్ సమయంలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశాలు ఉన్నాయి. ఒక్క గదిలో ఎక్కువ బూత్‌లు ఏర్పాటు చేయడం వల్ల పోలింగ్ సిబ్బంది, ఏజెంట్లు ఎలా కూర్చుంటారని, ఓటింగ్ కంపార్ట్‌మెంట్లు ఎలా ఏర్పాటు చేస్తారని పలువురు ప్రశ్నిస్తున్నారు. అదే విధంగా కొన్ని పాఠశాలల్లోని వంట గదులను సైతం పోలింగ్ బూత్‌లుగా మార్చేశారు. ఈ గదుల్లో సరైన వెంటిలేషన్, ఫ్యాన్లు కూడా లేకపోవడంతో ఇబ్బందులు తప్పేలా లేవు.



పోలింగ్ బూత్‌గా మార్చిన వంటగది

పైసలిస్తేనే పాస్..!

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఐటీఐ కాలేజీల యాజమాన్యాలు పిల్లల దగ్గరి నుంచి ఇష్టారాజ్యంగా వసూళ్లకు పాల్పడుతున్నాయి. పాస్‌కావాలంటే కచ్చితంగా పైసలివ్వాల్సిందే. దీంతో మంచిగా చదివి, ప్రాక్టికల్స్‌కు అటెండ్ అయిన స్టూడెంట్స్‌కూడా భయపడి డబ్బులు ముట్టజెపుతున్నట్లు తెలుస్తోంది. పేద పిల్లలు అప్పులు చేసి మరీ సెంటర్‌ఫీజు పేరుతో కాలేజీకి డబ్బులు చెల్లిస్తున్నారు. సోమవారం నుంచి ఐటీఐ పరీక్షల నేపథ్యంలో ఈ వసూళ్ల ద్వారా జిల్లాలో రూ.కోటి వరకు పిల్లల నుంచి యాజమాన్యాలు రాబట్టుకున్నట్లు తెలుస్తోంది.



- ఐటీఐ కాలేజీల అవినీతి బాగోతం
- రేపటి నుంచి పరీక్షలు ప్రారంభం

భద్రాచలం, వెలుగు

సాంకేతిక నిపుణులను తయారు చేయాల్సిన ఐటీఐ కాలేజీలు కేవలం సర్టిపికెట్లు అందించే సంస్థలుగా మారుతున్నాయి. భద్రాద్రికొత్తగూడెం జిల్లాలో ఈనెల 21 నుంచి ఐటీఐ పరీక్షలు ప్రారంభం అవుతున్నాయి. పాస్‌కావాలంటే అడిగినంత సెంటర్ ఫీజు చెల్లించాల్సిందేనంటూ యాజమాన్యాలు హెచ్చరికలు చేస్తున్నాయి. ఏం చేయాలో పాలుపోని స్థితిలో ఎలాగోలా అప్పుచేసి మరీ వారడిగినంత సెంటర్‌ఫీజు చెల్లిస్తున్నారు. ఆ ఫీజు చెల్లించకపోతే తమను ఎక్కడ ఫెయిల్‌చేస్తారోననే భయంతో అడిగినంతా ఇచ్చుకుంటున్నారు. ఈ పరిస్థితుల్లో ప్రతిభతో ఎలాగైనా పాసవుతామనే ధీమాఉన్న వారుకూడా పరీక్ష ఫీజులు చెల్లించాల్సిన దుస్థితి నెలకొంది. జిల్లాలోని 23 ప్రైవేట్, 5 గవర్నమెంట్ ఐటీఐ కాలేజీల్లో రెండో విడత సెమిస్టర్ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమవుతున్నాయి. ఈ పరీక్షలు పూర్తిగా ప్రైవేట్ యాజమాన్యాల కనుసన్నల్లో జరుగుతున్నాయి. చాలాచోట్ల ప్రైవేట్ యాజమాన్యాలు తమ స్టూడెంట్స్ నుంచి సెంటర్ ఫీజు కింద ఒక్కొక్కరి వద్ద దాదాపు రూ.5వేలకు పైగా వసూలు చేసినట్టు తెలిసింది. పరీక్షలు దిగ్విజయంగా పూర్తి చేసేందుకు ఆఫీసర్లు, ఇతర ప్రభావిత వ్యక్తులకు నజరానాలు సమర్పించేందుకు ఈ వసూళ్లు తప్పనిసరి అనే ధోరణిలో ప్రైవేట్ ఐటీఐ కాలేజీల యాజమాన్యాలున్నాయి. జిల్లాలోని దాదాపు 70శాతం ప్రైవేట్ ఐటీఐలు ఈ వ్యవహారం కొనసాగిస్తున్నాయి. జిల్లాలోని ఐటీఐలలో దాదాపు 2500 మందికి పైగా మంది పరీక్షలు రాస్తున్నారు. అంటే ఈ పరీక్షలలో ప్రైవేట్‌కాలేజీలు అభ్యర్థుల నుంచి దాదాపు రూ.80లక్షల నుంచి రూ.1కోటి రూపాయల వరకు వసూళ్లు సాగించారు. గతంలో రూ.3వేలుగా ఉండే ఈ సెంటర్ ఫీజును డిమాండ్, ఖర్చులను దృష్టిలో ఉంచుకుని రూ.5వేలకు పెంచినట్లుగా తెలుస్తోంది.

అసలు అవినీతి అక్కడే

జిల్లాలో ఐటీఐ పరీక్షల్లో అవినీతి భాగోతం పరీక్ష కేంద్రాల మంజూరు నుంచే ప్రారంభం అవుతుంది. రూల్స్‌ప్రకారం పరీక్షల నిర్వహణ కోసం కావాల్సిన సదుపాయాలున్నాయా.? లేవా? అనేది తనిఖీ చేసిన తర్వాతనే అనుమతిలిస్తారు. జిల్లాలోని ప్రైవేట్ ఐటీఐలలో సగానికి పైగా సదుపాయాలు సరిగా లేకుండానే శిక్షణలు ఇస్తున్నాయి. పరీక్షా కేంద్రాల మంజూరు కోసం ఐటీఐలను పరిశీలించిన నిపుణుల కమిటీ చాలా చోట్ల పరీక్ష కేంద్రాల ఏర్పాటు కుదరదంటూ తిరస్కరించింది. తర్వాత ఏమైందో.. ఏమో కానీ పలు ప్రైవేట్ ఐటీఐలకు పరీక్ష కేంద్రాలు మంజూరయ్యాయి. అంటే భారీ ఎత్తున పైరవీలు, ముడుపుల వ్యవహారం సాగడంతో అవినీతి చోటు చేసుకున్నట్లుగా స్పష్టం అవుతోంది. స్టూడెంట్స్‌నుంచి వసూలు చేస్తున్న సెంటర్‌ఫీజుతో పాటు, శిక్షణకు సరిగా హాజరుకాని పిల్లల నుంచి మరింత ఎక్కువగా వసూలు చేస్తూ, ఆ డబ్బులతోనే యాజమాన్యాలు మేనేజ్‌చేస్తున్నాయి. దారుణమైన విషయమేమంటే ఈ సెంటర్‌ఫీజు వ్యవహారం కొన్ని ప్రభుత్వ ఐటీఐలకు కూడా పాకింది. రెండేళ్ల క్రితం అసలు కనీస సదుపాయాలు కూడా లేకుండా ప్రారంభించి, తూతూమంత్రంగా శిక్షణ ఇచ్చినట్లు మమ అనిపించిన ఓ ప్రభుత్వ ఐటీఐలో ఉద్యోగావకాశాలను ఆసరాగా చేసుకొని ఇలాంటి వ్యవహారమే నడిపిస్తున్నారు. పారిశ్రామిక ప్రాంతంగా రాష్ట్రంలోని మిగిలిన అన్ని ప్రాంతాలకంటే అభివృద్ధి చెందిన ఈ జిల్లాలో సాంకేతిక నిపుణులకు డిమాండ్ బాగా ఉంది. దీన్ని క్యాష్‌చేసుకునే పనిలో పలు ప్రైవేటు ఐటీఐల యాజమాన్యాలు అడ్డదారులు తొక్కుతున్నాయి. దీంతో ప్రతిభ ఉండి, శిక్షణలో అన్నీ నేర్చుకొని పరీక్షలు రాయాలనుకునే నిరుపేద స్టూడెంట్స్‌కూడా మిగిలిన వారితో సమానంగా అప్పులు చేసి మరీ ఫీజులు కట్టాల్సిన పరిస్థితి. ఇప్పటికైనా శిక్షణ, ఉపాధి కల్పన శాఖ ఉన్నతాధికారులు ఈ జిల్లాలో ఐటీఐ పరీక్షల్లో భారీగా సాగుతున్న అవినీతి భాగోతానికి అడ్డుకట్ట వేసి పరీక్షలు సక్రమంగా నిర్వహించేలా చూడాలని పేద ప్రతిభావంతులైన పిల్లలు కోరుతున్నారు.

ఖర్చుల కోసమే...

ఐటీఐ యాజమాన్యాల సంఘం ప్రతినిధిని ఒకరిని వివరణ కోరగా.. గతంలో ఉన్న పరిస్థితులు ఇప్పుడు లేవని, కాకపోతే ఖర్చుల కోసం కొద్దిగా తీసుకుంటున్న మాట వాస్తవమేనని అంగీకరించారు. తమకు తెలిసినంత వరకు సెంటర్ ఫీజు వసూలు చేసే పరిస్థితి లేదన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ఫీజు కంటే ఎక్కువ తీసుకునే పరిస్థితులు లేవని కొట్టిపారేశారు. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితి వేరుగా ఉంది.

ఏమన్నారంటే



ఆడవాళ్లకి గౌరవమేది?

విదేశాల్లో లేడీస్‌ని చాలా గౌరవించడం చూశాను. అదే మన ఇండియాలో మహిళల పట్ల గౌరవం మాటల్లోనే తప్ప చేతల్లో కనిపించదు.

– పీవీ సింధు, బ్యాడ్మింటన్ స్టార్.



అదొక లూజర్స్ టీమ్

ప్రతిపక్షాల కూటమి బరిలోకి దిగకముందే ఓడిపోయిన పహిల్వాన్ లాంటిది. కర్ణాటకలోనే కూటమిని కాపాడుకోలేనోళ్లకు కేంద్రం కావాల్సొచ్చిందా?

– ముక్తార్ అబ్బాస్ నఖ్వీ, కేంద్ర మంత్రి.



పాక్ నోరు మూసుకోవాలి

కశ్మీర్ ఎప్పటికీ ఇండియాలో అంతర్భాగమే. ఈ విషయంలో పదే పదే మాట్లాడే పాకిస్తాన్ ఇకనైనా నోరు మూసుకుంటే మంచిది.

– అసదుద్దీన్ ఓవైసీ, ఎంఐఎం చీఫ్.



చేతులు నరకాలనిపించింది!

ఆర్జేడీ అండతో ఎదిగిన రాంకృపాల్ యాదవ్ 2014లో బీజేపీలో చేరడాన్ని తట్టుకోలేకపోయా. అప్పుడాయన చేతులు నరికేయాలన్నంత కోపమొచ్చింది.


– మీసా భారతి, ఆర్జేడీ నాయకురాలు.



ఇడియెట్స్, డర్టీ ఫెలోస్..

సోషల్ మీడియాలో నీతులు చెప్పేవారు ఎక్కువయ్యారు. ఆడవాళ్లను ఇష్టమొచ్చినట్లు ట్రీట్ చేసే వాళ్ళు ఇంకా ఎందుకు బతికున్నారో అర్థం కాదు.

– చిన్మయి, సింగర్



సెక్యూరిటీవాళ్లకు థ్యాంక్స్


అమెరికా షట్‌డౌన్ వల్ల గవర్నమెంట్ నుంచి శాలరీ రాకపోయినా నా ఫ్యామిలీకి సెక్యూరిటీ కల్పిస్తున్న ఫెడరల్ ఎంప్లాయీస్‌కి థ్యాంక్స్.

– జార్జ్ బుష్, అమెరికా మాజీ ప్రెసిడెంట్

మీరూ రాయొచ్చు!

సమాజాన్ని ప్రభావితం చేసే వేర్వేరు అంశాలమీద మీ అభిప్రాయాలను ఆర్టికల్ రూపంలో పంపవచ్చు. openpage@v6velugu.com

బంగారు తెలంగాణ కోసమే సహస్ర చండీయాగం



తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావుకు యజ్ఞ యాగాదులపై నమ్మకం ఎక్కువ. శాస్త్రాల ప్రకారం యాగాలు చేస్తే మంచి జరుగుతుందనే భావన ఆయనలో చాలా ఏళ్ల నుంచి ఉంది. రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఎన్నడూ కనీవినీ ఎరుగని రీతిలో ఆయుత చండీయాగం చేశారు. మరోసారి అత్యధిక మెజారిటీతో రాష్ట్రంలో పార్టీ అధికారంలోకి వచ్చిన సందర్భంలో, బంగారు తెలంగాణ కల సాకారం దిశగా, ప్రజల సంక్షేమాన్ని కోరుతూ కేసీఆర్ మరో యాగానికి పూనుకున్నారు. దాని విశిష్టత ఏమిటో యాగ నిర్వాహకుల్లో ఒకరైన పురాణం మహేశ్వర శర్మ మాటల్లో..

'సీఎం కేసీఆర్‌కు మొదటి నుంచి యాగాల మీద ప్రగాఢ విశ్వాసం ఉంది. దీన్ని అనుసరించే చాలా ఏళ్ల నుంచి ఆయన యాగాలు చేస్తున్నారు. రాష్ట్రం సిద్ధించిన సందర్భంలో ఆయుత చండీయాగం నిర్వహించారు. ఇటీవల ఎన్నికల ముందు రాజ శ్యామల యాగం చేశారు. బంగారు తెలంగాణ లక్ష్యంగా రెండోసారి అధికారంలోకి రావడంతో సహస్ర చండీ యాగం చేస్తున్నారు. ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో జనవరి 21 నుంచి 25 వరకు సహస్ర చండీ యాగం ఉంటుంది. దీంతోపాటు అనుబంధ యాగాలూ జరుగుతాయి. ఇప్పటికే యాగశాల నిర్మాణం పూర్తైంది. అన్ని ప్రాంతాలకు చెందిన సుమారు 300 మంది రిత్వికులు ఈ యాగంలో పాల్గొంటారు.

యాగానికి రక్షగా వేదాలు

ప్రాచీన కాలం నుంచి హిందూ సంప్రదాయానికి మూలంగా ఉన్నవి వేదాలు మాత్రమే. అందుకే ఈ మొత్తం యాగశాలకు నాలుగు దిక్కులుగా వేదాలు రక్షణగా ఉంటాయి. ఇందుకోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశాం. తూర్పు దిక్కున ఋగ్వేదం, దక్షిణ దిక్కున యజుర్వేదం, పశ్చిమాన సామవేదం, ఉత్తరాన అదర్వణ వేద పారాయణం నిర్వహిస్తారు. రుత్వికుల వేదపారాయణానికి ఎలాంటి ఆటంకాలు కలగకుండా రక్షణగా నిలుస్తారు. ఒక్కో హోమగుండం వద్ద ఎనిమిది మంది ఋత్విక్కులు వేదపారాయణం చేస్తారు.

ఏకోత్తర వృద్ధి..

'కలో చండి విశిష్టతే...' అంటే కలియుగంలో చండీని ప్రసన్నం చేసుకోవడమే చాలా ప్రాధాన్యమైనది. మిగిలిన అన్ని శక్తుల కంటే కలియుగంలో చండీ ప్రభావం ఎక్కువగా ఉంటుంది. అందుకే ఏ పని మొదలు పెట్టినా అది నిర్విఘ్నంగా పూర్తికావడానికి ఈ కాలంలో చండి ప్రభావశీలంగా పనిచేస్తుంది. అందుకే ఈ సహస్ర చండీ యాగాన్ని చేయడం. ఐదు రోజులు సాగే ఈ యాగం లో ఏకోత్తర వృద్ధి పద్ధతిలో పారాయణం ఉంటుంది. అంటే మొదటి రోజు 100 పారాయణాలు, మరుసటి రోజు రెండు వందల పారాయణాలు.. ఇలా మొత్తం వెయ్యి పారాయణాలుగా సహస్రం పూర్తవుతాయి. ఇందుకోసం 10 హోమ గుండాలు, ఒక్కోదాని దగ్గర పది మంది చొప్పున పాయసం ద్రవ్యంతో హోమం చేస్తారు.



సతీమణి శోభతో సీఎం కేసీఆర్ (ఫైల్ ఫొటో)

అనుబంధ యాగాలు

ఈసారి యాగంలో చండీతో పాటు అనుబంధ యాగాలు నిర్వహిస్తున్నాం. ఇక్కడ కూడా 100 మంది రుత్వికులతో హోమాలు జరుగుతాయి. మహా రుద్రం (రుద్రుడు అంటే శివునికి అనుష్టానం ఉంటుంది), రాజశ్యామల, పీతాంబరి దేవి అనుష్టానం(బగలాముఖీ), సూర్య యాగం, నవగ్రహ యాగం, సూర్య అనుష్టాలు, వాస్తు, గణపతి వంటి అనుబంధ యాగాలను చేస్తున్నాం. మహా రుద్రం, బగలాముకి నవగ్రహ, సూర్య నమస్కారాలు, చతుర్వేద పారాయణం ఉంటాయి. ఈ అనుబంధ యాగాలు చేయడానికి కూడా అన్నింటికీ ఒక్కొక్క యాగశాల విడివిడిగా ఉంటాయి. ఇవన్నీ కూడా చండీ యాగానికి మరింత బలాన్నిస్తాయి.

పాయస ద్రవ్యంతో హోమం..

యాగంలో చివరి రోజు, అంటే 25వ తేదీ (శుక్రవారం) చండీ మాతకు అగ్ని స్థాపన జరుగుతుంది. మిగిలిన నాలుగు రోజులు పారాయణంతో మాత్రమే చేస్తారు. ఈ హోమానికి సుమారుగా వేయి కిలోల పాయస ద్రవ్యం తయారు చేస్తారు. బియ్యం, బెల్లం, కాజూ, కిస్మిస్, ఇలాచి ఇలాంటి సుగంధ ద్రవ్యాలతో ఈ వంటకాన్ని పూర్తి చేస్తారు. ఈ మొత్తాన్ని చివరి రోజు యజ్ఞగుండంలో వేస్తూ అమ్మవారిని ప్రసన్నం చేసుకుంటారు.

ఉదయం ఎనిమిదికి ప్రారంభం

ఐదు రోజుల పాటు సాగే ఈ యాగం అనుక్షణం నిష్ఠ నియమాలతో జరుగుతుంది. ప్రతిరోజు ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు, తిరిగి సాయంత్రం 4 గంటల నుంచి 7:30 వరకు వేదపారాయణం ఉంటుంది. మొదటి రోజు కేసిఆర్ పాల్గొని యాగ బాధ్యతలను యాగకర్తకు అందజేస్తారు. ఈ మొత్తం యాగాన్ని గురువు మాణిక్య సోమయాజులు పర్యవేక్షిస్తారు. యాగానికి వచ్చిన బ్రహ్మణులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారు. వీరి కోసం ప్రత్యేకంగా గుడారాలు.. సొంతంగా భోజనం తయారుచేసుకునే వారికి ఏర్పాట్లు కల్పించారు'.



నా దృష్టిలో కేసీఆరే రైతుబంధు

లోక్‌పాల్, లోకాయుక్త కోసం జనవరి 30 నుంచి మళ్ళీ దీక్ష

అన్నదాతను ఆదుకునేవాడే నిజమైన నాయకుడని అన్నారు ప్రముఖ గాంధేయవాధి అన్నా హజారే. ప్రస్తుతం దేశంలో తెలంగాణ సీఎం కేసీఆర్ ఒక్కరే రైతుపక్షపాతిగా కనిపిస్తున్నారని, రైతుబంధు, రైతుబీమా లాంటి పథకాలు నిజంగా గొప్పవన్నారు. హైదరాబాద్ వేదికగా తెలంగాణ జాగృతి సంస్థ నిర్వహించిన 'ఇంటర్నేషనల్ యూత్ లీడర్ సదస్సు'లో ఆయన పాల్గొన్నారు. బిజీ షెడ్యూల్‌లోనూ 'వెలుగు' ప్రతినిధితో ప్రత్యేకంగా మాట్లాడారు.

యంగెస్ట్ స్టేట్ తెలంగాణ ఎలా ఉంది సార్?
కొత్త ఆలోచనలు, కొత్త పథకాలు, కొత్త ఆకాంక్షలతో ముందుకు వెళ్లడం ఎప్పుడైనా బాగానే ఉంటుంది. నేను గతంలో తెలంగాణకు చాలా సార్లు వచ్చాను. ఉద్యమం చేసి రాష్ట్రాన్ని సాధించుకున్న చరిత్ర ఇక్కడి జనానిది. పోరాడితే సాధించలేనిందటూ ఏదీ ఉండదని నిరూపించారు.

సీనియర్ సిటిజన్‌గా యూత్‌కు ఎలాంటి సందేశమిస్తారు?
యువతలో గొప్ప శక్తి ఉంది. ఆ శక్తి మొత్తం దేశ సుస్థిరత, అభివృద్ధికి ఉపయోగపడాలి. సుస్థిర అభివృద్ధి, నవ కల్పనలు ఒక్క గాంధేయ మార్గం ద్వారానే సాధ్యమని నేను నమ్ముతాను. ఈ సదస్సు నిర్వాహకుల నమ్మకం కూడా అదే. గాంధీ మార్గంలో నడవాలని ఇక్కడికి వచ్చిన యూత్‌కి పిలుపునిచ్చాను.

లోక్‌పాల్ చట్టం కోసం మళ్లీ దీక్ష చేస్తానంటున్నారు. కేంద్రం నుంచి ఎలాంటి స్పందన ఉంది?
ఏ హామీ ఇచ్చి ఎన్డీఏ అధికారంలోకి వచ్చిందో, దాన్ని మర్చిపోయింది. అందుకే మళ్లీ డెడ్ లైన్ పెట్టా. లోక్‌పాల్, లోకాయుక్తలను అమల్లోకి తేకపోతే జనవరి 30 నుంచి నిరవధిక నిరాహార దీక్షకు దిగుతా. ఈసారి మా ఊరు రాలేగావ్ సిద్ధిలోనే దీక్ష ఉంటుంది.

మీ దృష్టిలో మంచి నాయకుడంటే..?
పారిశ్రామిక ప్రగతి కంటే రైతుల కోసం తపించేవాళ్లే నా దృష్టిలో గొప్పవాళ్లు. దేశవ్యాప్తంగా రైతులు ఇబ్బందుల్లో ఉన్నారు. వాళ్లందరినీ కష్టాల నుంచి బయటపడేయగలిగే రైతు పక్షపాతి నాయకుడు కావాలిప్పుడు.

నోట్ల రద్దు నిర్ణయం రైతులపై ప్రభావం చూపిందనుకుంటున్నారా..?
పెద్ద నోట్ల రద్దు ఉద్దేశమేంటో ఎవరికీ తెలియదు. బ్లాక్‌మనీ బయటపడుతుందన్నారు. తీరా చూస్తే ఉన్న డబ్బంతా బ్యాంకుల్లోకి వచ్చేసింది. నల్లకుబేరులు ఏమైపోయినట్లు? నోట్ల రద్దు వల్ల ఇబ్బంది పడింది ఎవరైనా ఉంటే అది సామాన్యులు, రైతులు మాత్రమే.

మోదీ పనితీరుకు ఎన్ని మార్కులేస్తారు?
లోక్ పాల్, లోకాయుక్తల విషయంలో మోడీ చేసింది గుండు సున్నా. ఆయనకు నేనిచ్చే మార్కులు కూడా అంతే.

భవిష్యత్తులో ఎవరు ప్రధాని అయితే బాగుంటుందంటారు?
నిజానికి మనకున్న ఆప్షన్స్ చాలా తక్కువ. నరేంద్ర మోడీ, రాహుల్ గాంధీ ఇద్దరివీ ఒకటే విధానాలు. మోడీ బుర్రలో రైతులకు చోటు లేదు. రాహుల్ గాంధీలో కూడా రైతుల పట్ల సరైన దృక్కోణం లేదు. ఇద్దరూ పరిశ్రమలను పట్టుకొని వేలాడే వాళ్లే. కాబట్టే ఆ ఇద్దరినీ నేను కోరుకోవట్లేదు.

కేజ్రీవాల్‌తో విభేదాలు సర్దుమణిగినట్లేనా?
(నవ్వుతూ..) అతన్ని దగ్గరికి రానివ్వడం లేదిప్పుడు. మాట్లాడటం మానేశాను. నాతో మాట్లాడటానికి కేజ్రీవాల్ ట్రైచేశాడు. కానీ నాకా అవసరం లేదని వదిలేశా. ఢిల్లీ ప్రభుత్వం పని తీరును పట్టించుకోవడం మానేశా.

గొప్ప ఉద్యమానికి నేతృత్వం వహించిన మీ ఇద్దరి మధ్య ఎందుకీ విభేదాలు?
ఆయన (కేజ్రీవాల్) తనకుతానే చాలా గొప్ప వ్యక్తినని ఫీలైపోతారు. ఏ విలువలతో నడక మొదలుపెట్టాడో ఆ మార్గంలో నడవట్లేదిప్పుడు. అందుకే మా దారులు వేరయ్యాయి. ఇంతకంటే ఎక్కువ చెప్పలేను.

తెలుగు రాష్ట్రాల సీఎంలపై మీ కామెంట్..
తెలంగాణ సీఎం కేసీఆర్ గురించి గతంలో పెద్దగా తెలియదు. రైతు బంధు పథకం తర్వాత దేశమంతా ఆయన వైపు చూడటం మొదలు పెట్టింది. ప్రజాసేవ చేసే నిజమైన నాయకుడు వేరు, ఎప్పుడూ పావులు కదిపే పొలిటీషియన్ వేరు. ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు పక్కా పొలిటీషియన్ అని చెప్పగలను.

సదస్సు నిర్వాహకురాలు కవిత గురించి?
యువ నాయకత్వ సదస్సు నిర్వహించిన ఎంపీ కవితలో ఒక తపన కనిపించింది. రాష్ట్రంలోని యువతను సరైన దారిలో నడపాలని భావిస్తున్నారు. మేమిద్దరం చాలా విషయాలు షేర్ చేసుకున్నాం.

ఫెడరల్ ఫ్రంట్, థర్డ్ ఫ్రంట్‌లపై మీ అభిప్రాయం?

నేనేమంటానంటే.. పాత పార్టీలు, ఆయా నాయకులు కలిసి కొత్త ఫ్రంట్ పెట్టినంత మాత్రాన ఒరిగేదేమీలేదు. ఎందుకంటే వాళ్లు పాత రాజకీయాలనే చేస్తారు. అలా కాకుండా, ఉన్నత లక్ష్యం, రైతుల పట్ల ప్రేమ, పల్లెల్ని బాగు చేయాలన్న కాంక్షతో ఎవరు పనిచేసినా మంచిదే.





రైతు కోసం పనిచేస్తోన్న లీడర్లు లేరా?

ఎందుకు లేరు, ఈ మధ్య దేశంలో ఎక్కడ విన్నా రైతుబంధు పథకం గురించే మాట్లాడుతున్నారు. పంటకు పెట్టుబడి అందించాలన్న ఆలోచన నిజంగా గొప్పది. దాన్ని అమలు చేస్తోన్న తెలంగాణ సీఎం కేసీఆర్ నా దృష్టిలో రైతుపక్షపాతి అనిపిస్తున్నారు. ఒక ముఖ్యమంత్రి స్థాయి నాయకులకు రైతు బంధు, రైతు బీమా లాంటి ఆలోచనలు రావడం చాలా అరుదు. రైతాంగానికి అండగా నిలబడ్డారు కాబట్టే రెండో సారి కూడా ఆయన అధికారంలోకి వచ్చారని అనుకుంటున్నా. ఆ రెండు పథకాల గురించి నేనింకా పూర్తిగా పరిశీలించాల్సి ఉంది. ప్రాథమికంగా ఇవి గొప్ప కార్యక్రమాలని మాత్రం చెప్పగలను. దేశానికి ఇప్పుడొక రైతుపక్షపాతి కావాలి.



వారేవా ఉగాండా

పేద దేశం.. ఫిట్‌నెస్‌లో ఘనం

ప్రపంచంలోని అత్యంత పేద దేశాల్లో ఒకటైన ఉగాండా.. ఫిట్‌నెస్‌లో మాత్రం టాప్ పొజిషన్‌లో ఉంది. వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్(డబ్ల్యూహెచ్‌వో) తాజాగా విడుదల చేసిన రిపోర్టులో ఈ విషయం వెల్లడైంది. ఉగాండన్ లైఫ్‌స్టైల్‌లోనే ఎక్సర్‌సైజ్ కలిసిపోయి ఉంటుంది. ప్రస్తుతం అక్కడ ఉద్యోగుల్లో రవాణా, కూలీ పనులు చేసే వారే ఎక్కువ. యువత కూడా డిగ్నిటీ ఆఫ్ లేబర్‌ను గుర్తించి చిన్న చిన్న పనుల్లో చేరుతున్నారు. ఈ పనులన్నీ శారీరక శ్రమతో కూడుకున్నవే. గ్రామీణ పరిస్థితులు దాదాపు ఇలానే ఉన్నాయి. 70 శాతం ప్రజలు వ్యవసాయం చేస్తారు. వాళ్ల భూములను వాళ్లే దున్నుకుంటారు. పాడిపరిశ్రమ కూడా అంతే. ఇవన్నీ వాళ్లకి శారీరక, మానసిక దృఢత్వాన్ని ఇస్తున్నాయి. దీనికితోడు మారుతున్న పరిస్థితులు కూడా ప్రజల్లో ఫిట్‌నెస్ గురించి ఆలోచించేలా చేస్తున్నాయి.



రాజధాని నగరం కంపాలాలో రోడ్లు నడవటానికి పనికిరాని దుస్థితి ఉండేది. క్రమక్రమంగా మౌలిక సదుపాయాలతోపాటు శుభ్రతనూ అలవాటుచేసుకున్న జనం.. అటుపై 'ఫిట్‌నెస్ మంత్ర'ను పట్టుకున్నారు. ప్రజల్లో ఈ ఉత్సుకతను గమనించిన అధ్యక్షుడు యోవెరీ ముసెవినీ జూలై 7వ తేదీని 'నేషనల్ డే ఆఫ్ ఫిజికల్ యాక్టివిటీ'గా ప్రకటించారు. ఫిట్‌నెస్ గురించి ఇంత ఆలోచిస్తున్న వీళ్లు తిండి విషయంలో ఏమాత్రం కాంప్రమైజ్ కావట్లేదు. ఎంత తింటారో అంతగా వర్కౌట్స్ చేస్తున్నారు. రోజుకు సగటున 85 శాతం మంది ఉగాండన్లు ఎక్సర్‌సైజ్‌లు చేస్తున్నారు. ఆర్థిక, సామాజిక అంశాల్లో ఉగాండాతో సమాన స్థాయి దేశాల్లో ఈ రకమైన మార్పు కనిపించదు. దేశం మొత్తం మీద సుమారు 45 శాతం ఉద్యోగులు చాలా దూరం నడుస్తున్నవాళ్లై ఉంటారు. ఖర్చులు తగ్గించుకోవడంలో భాగంగా ఒంటికి పనిచెబుతారన్నమాట. ఆ ఫిజికల్ యాక్టివిటీనే వాళ్ల దేశం నంబర్‌వన్‌గా నిలబడటానికి కారణమైంది. అన్నింటికంటే ఇంపార్టెంట్ విషయమేమిటంటే, ఉగాండన్లు మొబైల్స్, ట్యాబ్స్ వంటి గాడ్జెట్స్‌కు సాధ్యమైనంత దూరంగా ఉంటారు. అన్నట్లు మన ఇండియాలో మాత్రం 34 శాతం ప్రజలు మాత్రమే ఫిజికల్ ఫిట్‌నెస్‌పై దృష్టి పెడుతున్నారు.

ఎక్సర్‌సైజ్‌లో రకాలివి

- **ఏయిరోబిక్ యాక్టివిటీ:** తేలికపాటి వ్యాయామాలు. వేగంగా నడవటం, వాటర్ ఎక్సర్‌సైజులు, డబుల్ టెన్నిస్, స్కేటింగ్, వాలీబాల్, బాస్కెట్‌బాల్ లాంటి క్రీడలు ఆడటం.
- **విగరెస్ యాక్టివిటీ:** అంటే కఠిన వ్యాయామాలు. జాగింగ్ లేదా పరుగులు తీయటం, వేగంగా ఈదటం, టెన్నిస్, రగ్బీ, స్కిప్పింగ్ రోప్, హాకీ, జిమ్నాస్టిక్స్, మార్షల్ ఆర్ట్స్ తదితరాలు.
- **కండరాలను పటిష్టపరిచేవి:** మీ సొంత బాడీని కష్టపెడుతూ చేసే వ్యాయామాలు. ఉదాహరణకు వెయిట్ లిఫ్టింగ్, యోగా లాంటివి. వారానికి 150 నిమిషాల సాధారణ ఎక్సర్‌సైజులు (లేదా) 75 నిమిషాలపాటు కఠినమైన వ్యాయామాలు చేయాలని డబ్ల్యూహెచ్‌వో తమ మార్గదర్శకాల్లో పేర్కొంది.

ట్విటర్ టాక్



"ఇప్పటికే పది రకాల జంతు జాతులు అంతరించి పోయాయి. పర్యావరణం, వాతావరణం పాడైపోతున్నాయి. పన్నెండేళ్లలో వాటిని సరి చేసుకోవాలంటూ ఐక్యరాజ్య సమితి డెడ్ లైన్ పెట్టింది. స్వార్థాన్ని విడిచిపెట్టండి. నీళ్లు, ఇంధనాలు వృధా చేయకండి. శాకాహారానికి మారిపోండి. దేనినీ పారేయకుండా రీసైకిల్ చేసి వాడండి. ఇది మనల్ని లక్ష్యానికి దగ్గర చేస్తుంది."

– శోభిత ధూళిపాళ, 'గూఢచారి' ఫేమ్

ఈవెంట్




కంగనా రనౌత్ ఝాన్సీ లక్ష్మీబాయి పాత్రలో నటించిన 'మణికర్ణిక' చిత్రాన్ని రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఏరి కోరి చూశారు. సినిమా రిలీజుకి ముందే ఆయన కోసం రాష్ట్రపతి భవన్‌లో ప్రత్యేక షో వేశారు. అనంతరం 'మణికర్ణిక' టీమ్‌ను రాష్ట్రపతి ప్రత్యేకంగా సత్కరించారు. ఆ సందర్భంగా తీసిన ఫొటో.

గప్‌చుప్



ఒకప్పుడు హీరోగా అలరించిన అర్జున్... ఇప్పుడు స్పెషల్ పాత్రలతో పాటు, నెగటివ్ రోల్స్‌తో కూడా మార్కులు కొట్టేస్తున్నాడు. లై, అభిమన్యుడు చిత్రాల్లో విలన్‌గా ఇంప్రెస్ చేశాడు. 'నా పేరు సూర్య'లో హీరో తండ్రిగా మెప్పించాడు. త్వరలో వరుణ్ తేజ్ సినిమాలో కూడా కనిపించనున్నాడట. కిరణ్ కొర్రపాటి డైరెక్షన్లో రూపొందుతోన్న ఈ చిత్రంలో వరుణ్ బాక్సింగ్ కోచ్‌గా చేస్తున్నాడు. మరి అర్జున్ అతనికి రైవల్‌గా కనిపిస్తాడా, లేక మరేదైనా ముఖ్యమైన క్యారెక్టరా అన్నది తెలియదు. అసలీ వార్తలో ఎంత నిజముందో ఏమో!

ఫొటో ఫీస్ట్



పిల్లగాలికి ఎగురుతోన్న ముంగురులు... సిగ్గుతో వాలిపోయిన కనురెప్పలు... చిరు దరహాసంతో మెరుస్తోన్న అధరాలు... అసలైన సొగసుకు సిసలైన నిర్వచనంలా ఉంది కదూ కాజల్! 'భారతీయుడు' సీక్వెల్ ప్రారంభోత్సవానికి ఇలా అందంగా ముస్తాబై వచ్చింది. అందరి మనసులూ దోచింది.

టాకీస్

ప్రభాత వెలుగు
09
ఆదివారం | హైదరాబాద్
20.01.2019
www.v6velugu.com
Follow: v6velugu

సంచలనాలు ఆగలేదు



భారతీయ సినిమాని మరో మైలురాయిని దాటించిన చిత్రాలలో '2.ఓ' ఒకటి. రజనీ కాంత్, శంకర్‌ల కాంబినేషన్లో తెరకెక్కిన ఈ విజువల్ వండర్... మొట్టమొదటి పూర్తి స్థాయి త్రీడీ చిత్రం. పదివేల థియేటర్లలో రిలీజయ్యింది. త్వరలో చైనాలో కూడా కొన్ని వేల థియేటర్లలో రిలీజ్ కానుంది. బడ్జెట్ నుంచి కలెక్షన్ల వరకూ ప్రతి విష యంలోనూ సంచలనాలు సృష్టించింది. ఈ సంచలనాలు ఇంకా ఆగలేదు. సౌండ్ ఎడిటింగ్ ఇన్ ద ఫారిన్ లాంగ్వేజ్ కేటగిరీలో ప్రతిష్ఠాత్మక గోల్డెన్ రీల్ అవార్డుకు నామినేట్ అయ్యింది. ఫీచర్ ఫిల్మ్ కేటగిరిలో కూడా నామినేటయింది. "భారతదేశ సినిమా '2.ఓ 'చిత్రంతో ఒక కొత్త సౌండ్ సిస్టమ్‌ని ప్రపంచానికి పరిచయం చేసింది. ఈ సాంకేతిక విప్లవాన్ని ప్రపంచమంతా గుర్తించడం ఆనందంగా ఉంది'' అంటూ ఆనందంగా ట్వీట్ చేశారు ఈ చిత్రానికి సౌండ్ డిజైనర్‌గా పనిచేసిన రసూల్ పూకుట్టి. ఈ ఆస్కార్ అవార్డ్ గ్రహీత... '2.ఓ'తో 4డి ఎస్ ఆర్ ఎల్ సౌండ్ సిస్టమ్‌ని మొట్టమొదటి సారిగా మన భారతీయ సినీ పరిశ్రమకి పరిచయం చేశాడు.



చిరు సంబరం

ఇంట్లోకి పసిపాప వస్తే ఎంత సంతోషం! ప్రస్తుతం ఆ సంతోషాన్ని అనుభవిస్తున్నారు మెగాస్టార్ చిరంజీవి. ఆయన కుమార్తె శ్రీజ, కళ్యాణ్ దేవ్ దంపతులకు కొద్ది రోజుల క్రితమే పాప పుట్టింది. ఆ పాపకు రీసెంట్‌గా నవిష్క అని పేరు పెట్టారు. ఆ చిట్టి తల్లిని ఆప్యాయంగా చూసుకుంటోన్న చిరంజీవి దంపతులు.



గేమర్ ట్రైలర్ రిలీజ్

బి.జి.వెంచర్స్ పతాకంపై నూతన నటీనటులతో రాజేష్ తడకల స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'గేమర్'. శనిత్ రాజ్, కల్యాణి పటేల్, అనిరుధ్, నేహ ప్రధాన పాత్రలు పోషించారు. ఈ సినిమా ట్రైలర్ రిలీజ్ కార్యక్రమం హైదరాబాద్‌లో జరిగింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వివేక్ వెంకటస్వామి ట్రైలర్ ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ "ట్రైలర్ చూశాను. అద్భుతంగా ఉంది. రాజేష్ నూతన నటీనటులను ప్రోత్సహిస్తూ ఈ సినిమా తీశారు. మంచి డ్యాన్సులు, ఎంటర్టైన్మెంట్, సస్పెన్స్, హారర్ ఎలిమెంట్స్ అన్నింటితో ప్రేక్షకులకు నచ్చేలా ఈ సినిమా చేశాడు రాజేష్. ఇలాంటి చిన్న సినిమాల దర్శక నిర్మాతలను ప్రోత్సహించే బాధ్యత ప్రభుత్వం పైనా, సమాజం పైనా ఉంది. ఎందుకంటే వీళ్లందరికీ థియేటర్లు దొరకడం కష్టంగా ఉంది. కొత్త టాలెంట్ రావాలంటే చిన్న దర్శక నిర్మాతలను ఎంకరేజ్ చేయాలి. తద్వారా గ్రామాల్లో ఉన్న టాలెంట్ కి అవకాశాలు దక్కుతాయి. ఈ సినిమా మంచి విజయం సాధిస్తుందనిపిస్తోంది'' అంటూ నటీనటులకు, దర్శక నిర్మాతకు ఆల్ ద బెస్ట్ చెప్పారు. హీరో శనిత్ మాట్లాడుతూ "ట్రైలర్ విడుదల చేసిన వివేక్ గారికి థ్యాంక్స్. నా తల్లిదండ్రుల వల్లే ఈ స్థాయికి చేరుకున్నాను. రాజేశ్ గారు ఎంతో క్లారిటీ ఉన్న దర్శకుడు. టీమ్ అంతా ఈ సినిమా కోసం హార్డ్ వర్క్ చేశారని చెప్పాడు. సినిమా బాగా వచ్చిందని, అందరికీ నచ్చుతుందని చెప్పింది హీరోయిన్ కల్యాణి. దర్శక నిర్మాత రాజేష్ మాట్లాడుతూ "ఎంతో బిజీగా ఉండి కూడా చిన్న సినిమాని ఎంకరేజ్ చేయడం కోసం మా సినిమా ట్రైలర్ ను ఆవిష్కరించిన వివేక్ అన్నకు ధన్యవాదాలు. నాకిది ఏడవ సినిమా. బి.జి.యాక్టింగ్ అకాడెమీ ద్వారా నటీనటులకు శిక్షణనివ్వడంతో పాటు వారికి అవకాశం ఇస్తున్నాను. ఇందులో ప్రతి సీన్ డిఫరెంట్‌గా ఉంటుంది. ఆసక్తి రేపుతుంది. సెన్సార్ కార్యక్రమాలు కూడా పూర్తయ్యాయి. ఫిబ్రవరి ఒకటిన విడుదల చేయబోతున్నాం' అన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో అనిరుధ్, నరేందర్, అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీయార్‌ని చెక్కుతున్నాడు



ఎన్టీయార్ వర్ధంతి సందర్భంగా 'లక్ష్మీస్ ఎన్టీయార్'లో ఎన్టీయార్ పాత్ర పోషించే నటుడి మోషన్ పోస్టర్‌ను విడుదల చేశాడు వర్మ. అయితే ఆ నటుడి వివరాలేవీ అప్పుడు చెప్పలేదు. తర్వాత బయటపెట్టాడు. అతడు పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన రంగస్థల నటుడట. నాటకాల్లో మంచి ప్రావీణ్యం ఉందట. అతణ్ని ఎంచుకుని, కొన్ని నెలలుగా శిక్షణనిస్తున్నాడట. ఎన్టీయార్ నడక, నడత, నవ్వు, హావభావాలు, మాట... ప్రతి విషయంలోనూ ట్రెయినింగ్ ఇస్తున్నాడట. మొత్తంగా ఎన్టీయార్‌ని బాగానే చెక్కుతున్నాడన్నమాట.

నీడతో యుద్ధం



సందీప్ కిషన్ హీరోగా కార్తీక్ రాజు రూపొందిస్తున్న చిత్రం 'నిను వీడని నీడను నేనే'. దయా పన్నెం, వి.జి.సుబ్రహ్మణ్యన్ నిర్మిస్తున్నారు. అన్య సింగ్ కథానాయిక. సాధారణంగా మనిషి సాటి మనుషులతో యుద్ధం చేస్తూ ఉంటాడు. కానీ తన నీడతోనే యుద్ధం చేయాల్సి వస్తే ఏం జరుగుతుంది అన్నది మెయిన్ పాయింట్. ఈ ఎమోషనల్ హారర్ ఎంటర్‌టైనర్ చివరి షెడ్యూల్‌ను హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో చిత్రీకరిస్తున్నారు. హీరో హీరోయిన్లపై కొన్ని సన్నివేశాలు, ఒక ఫైట్ సీన్ తీస్తే సినిమా పూర్తవుతుందని, ఫిబ్రవరిలో రిలీజ్ చేయడానికి ప్లాన్ చేస్తున్నామని దర్శకుడు చెప్పారు.

నా స్థాయేంటో నాకు తెలుసు



బాలీవుడ్ హీరోయిన్లలో దీపికా పదుకొనె టాప్ ప్లేస్‌లో ఉందిప్పుడు. భారీ బడ్జెట్ బయోపిక్స్ దగ్గర్నుంచి సెన్సేషనల్ సబ్జెక్టుల వరకూ ఫస్ట్ అండ్ బెస్ట్ చాయిస్ ఆమే. అలాంటిది తనను రెమ్యునరేషన్ విషయంలో తక్కువ చేస్తే ఊరుకుంటుందా? రీసెంట్‌గా ఓ పెద్ద నిర్మాత ఒక టాప్ హీరోతో తీయబోయే సినిమాలో దీపికనే ఎంపిక చేసుకున్నాడట. అయితే హీరో కంటే తక్కువ రెమ్యునరేషన్ ఆఫర్ చేయడంతో రిజెక్ట్ చేసేసింది. ఆ నిర్మాత, హీరోల వివరాలు చెప్పలేదు కానీ... నో అన్న విషయాన్ని మాత్రం కన్‌ఫర్మ్ చేసింది. "నా స్థాయేంటో నాకు తెలుసు. దానికి తగ్గ రెమ్యునరేషన్ కోరుకోవడంలో తప్పేముంది! పైగా ఆయన హీరో కంటే హీరోయిన్ రెమ్యునరేషన్ తక్కువే ఉండాలన్నట్టు మాట్లాడాడు. పాత్రలు సమానమైనప్పుడు, ఇద్దరికీ రెమ్యునరేషన్ కూడా సమానంగా ఉండాలి కదా' అంది. నిజమేగా మరి!

2018 నా కెరీర్‌లో బెస్ట్ ఇయర్

బాల నటుడిగా పరిచయమై, హీరోగా నవ్వించి, క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా వైవిధ్యమైన పాత్రలతో మెప్పిస్తున్నారు నరేష్. నలభై ఏడేళ్ల సినీ ప్రయాణంలో ఇప్పటికీ బిజీ నటుడిగా కొనసాగడం తనకు దక్కిన అరుదైన అదృష్టం అంటున్నారాయన. ఈరోజు తన పుట్టినరోజు సందర్భంగా పాత్రికేయులతో ఇలా ముచ్చటించారు.

- ఎంత పెద్ద నటీనటులకైనా సక్సెస్, ఫెయిల్యూర్ సహజం. ఆరేడేళ్ల క్రితం ఒక్క హిట్ వస్తే చాలు అని కోరు కునేవాడిని. గత నాలుగైదేళ్లుగా వరుసగా మంచి సినిమాలు, మంచి పాత్రలు వస్తున్నాయి. ఒక తెలుగు నటుడు ఏ పాత్రనైనా చేయగలడని ఎస్వీ రంగారావు నిరూపించారు. ఆయనలాగే అన్ని జానర్లలో, అన్ని రకాల పాత్రలు చేయాలన్నది నా కోరిక.
- నటుడిగా నలభై ఏడేళ్ల సుదీర్ఘ ప్రయాణం నాది. మరో రెండేళ్లలో గోల్డెన్ జూబ్లీకి చేరువ కానున్నా. ఇంతకాలం బిజీగా ఉండటం అతి కొద్ది మందికే దక్కే అదృష్టం. నా కెరీర్‌లో బెస్ట్ ఇయర్ 2018. నెలకు 29 రోజులు పనిచేశాను. త్రివిక్రమ్, సుకుమార్ వంటి అగ్ర దర్శకులతో పాటు వెంకీ అట్లూరి, వెంకీ కుడుముల వంటి యువ దర్శకులతోనూ పనిచేశాను. నన్ను దృష్టిలో ఉంచుకుని చాలామంది రచయితలు పాత్రలు సిద్ధం చేయడం చూస్తే ఆనందమేస్తోంది.
- 2019లోనూ అవకాశాలు ఎక్కువగానే వస్తున్నాయి. సెలెక్టివ్‌గా అంగీకరిస్తున్నాను. 'ఆర్‌ఎక్స్ 100' ఫేమ్ కార్తికేయ హీరోగా మల్లి జంధ్యాల దర్శకత్వంలో నటిస్తున్నాను. ఈ ఏడు ఇదే నా తొలిచిత్రం. బుర్రా సాయిమాధవ్ అసిస్టెంట్ ఫణిరాజ్ దర్శకత్వంలోనూ చేస్తున్నాను. 'పవనిజం'లో విలన్‌గా నటిస్తున్నాను. ఇంకొన్ని చిత్రాలు పైప్ లైన్‌లో ఉన్నాయి. ఇండస్ట్రీకి కూడా 2019 మెరుగ్గా ఉంటుందని ఆశిస్తున్నాను.
- మరో పదేళ్లు నాకు మంచి కెరీర్ ఉంటుందని నమ్ముతున్నాను. మంచి సినిమాలతో పాటు న్యూ జెనరేషన్ నుంచి వచ్చే కొత్త కాన్సెప్టులకూ సిద్ధంగా ఉంటాను. పారితోషికాలు, ఇతర అంశాలేవీ పరిగణనలోకి తీసుకోను. మంచి పాత్రలకు మాత్రమే ప్రాధాన్యత. అందులోనూ చిన్న సినిమాలు, కొత్త దర్శకులకు అందుబాటులో ఉంటాను. వెబ్ సిరీస్‌లో అవకాశాలొస్తున్నాయి. త్వరలోనే అవి కూడా చేయబోతున్నాను.
- ఒకప్పుడు రీమేక్స్ కోసం ఇతర భాషలకు వెళ్లేవాళ్లం. కానీ ఇప్పుడు ఇతర భాషల వాళ్లే మన కథల కోసం వస్తుండటం గర్వకారణం. తెలుగు సినిమాకి ఇదొక పెద్ద వరం. చాలామంది కొత్త దర్శకులు కొత్త తరహా కాన్సెప్టులతో వస్తున్నారు. మంచి విజయాలు ఇస్తున్నారు.
- పాతికేళ్ల 'మా' చరిత్రలో సభ్యుడిగానే కొనసాగాను. సందర్భవశాత్తూ దాసరిగారి ఆదేశాల మేరకు జాయింట్ సెక్రెటరీగా పోటీ చేయవలసి వచ్చింది. అప్పుడే 'మా' రెండుగా చీలిపోయింది. మళ్లీ కలిపాం. లాస్ట్ టర్మ్‌లో మంచి సహాయ కార్యక్రమాలు జరిగాయి. వెల్ఫేర్‌కి ఎక్కువ ప్రాధాన్యతనివ్వాలని చెప్పింది నేనే.
- కాంట్రవర్సీలు కూడా జరిగాయి. కాదనను. జనరల్ సెక్రెటరీగా ఇబ్బందులూ ఎదుర్కొన్నాను. కానీ 'మా' ఫ్యూచర్ చాలా కీలకం. ఇండస్ట్రీ పెద్దలను సంప్రదించి ఈసారి 'మా' ఎన్నికలు సామరస్యంగా జరిగేట్టు చూస్తాం. అనివార్యమైతే గెలుపోటములకు అతీతంగా ధర్మం కాపాడడం కోసం నేనే పోటీ చేస్తాను. పదవుల కోసం కాదు. 'మా' ప్రతిష్ఠను పెంచడానికే. ఒకవేళ నేను గెలిచినా ఒక్క పర్యాయం మాత్రమే ఆ పదవిలో ఉంటాను.

"మహానటి, కథానాయకుడు వంటి బయోపిక్స్‌లో కీలక పాత్రలు పోషించడం ఆనందంగా ఉంది. పదహారో ఏట నుంచి బాలకృష్ణ నాకు మంచి మిత్రుడు. రామారావు గారు బాలయ్యను ఆవహించాడా అనే విధంగా నటించాడు. 'కథానాయకుడు' చిత్రాన్ని మించిన బయోపిక్ తెలుగులో ఇంతవరకూ రాలేదని నేను నమ్ముతాను.



హెచ్‌డీఎఫ్‌సీ లాభం 5,586 కోట్లు

న్యూఢిల్లీ: ప్రైవేటురంగ బ్యాంక్ హెచ్‌డీఎఫ్‌సీ నికర లాభం గత నెలతో ముగిసిన క్వార్టర్‌లో 20.3 శాతం పెరగడంతో రూ.5,586 కోట్లకు చేరింది. నికరవడ్డీ ఆదాయం భారీగా నమోదవడంతో ఆదాయం భారీగా పెరిగింది. గత ఆర్థిక సంవత్సరంలో ఇదే క్వార్టర్‌లో రూ.4,642 కోట్ల నికరలాభాన్ని సాధించింది. ఇక మొత్తం ఆదాయం రూ.24,450.44 కోట్ల నుంచి రూ.30,811.27 కోట్లకు పెరిగింది. "నికరవడ్డీ ఆదాయం 21.9 శాతం పెరిగి రూ.12,576 కోట్లుగా



నమోదయింది. 2017 డిసెంబరుతో ముగిసిన క్వార్టర్‌లో ఇది రూ.10,314.3 కోట్లు. ఆస్తులు 23.7 శాతం, నికర వడ్డీ మార్జిన్ 4.3 శాతం పెరగడమే ఇందుకు కారణం. స్థూల ఎన్‌పీఏలు 1.29 శాతం నుంచి 1.38 శాతానికి పెరిగాయి. నికర ఎన్‌పీఏలు (నాన్ ఫెర్ఫామింగ్ అసెట్స్) మాత్రం 0.44 శాతం నుంచి 0.42 శాతానికి తగ్గాయి" అని బ్యాంకు విడుదల చేసిన ప్రకటన తెలిపింది. మొండిబకాయిలకు కేటాయింపులు (పన్నులు మినహాయించి) వార్షిక ప్రాతిపాదికను రూ.1,351 కోట్ల నుంచి రూ.2,211 కోట్లకు పెరిగాయి. కంటెజెన్సీ ప్రొవిజన్లకు రూ.3,869 కోట్లు కేటాయించారు. ఇతర ఆదాయాలు వార్షిక ప్రాతిపదికన రూ.3,869 కోట్ల నుంచి రూ.4,921 కోట్లకు పెరిగాయి. బ్యాలన్స్‌షీటు పరిమాణం రూ. 9,49,079 కోట్ల నుంచి 11,68,556 కోట్లకు పెరిగింది. మొత్తం డిపాజిట్లు 22 శాతం పెరిగి రూ.8,52,502 కోట్లకు , మొత్తం అడ్వాన్సులు 24 శాతం పెరిగి రూ.7,80,951 కోట్లకు చేరాయి. బాసెల్ 3 గైడ్‌లైన్స్ ప్రకారం బ్యాంకు క్యాపిటల్ అడెక్వసీ రేషియో 17.3 శాతం నమోదయింది. రెగ్యులేటరీ ప్రమాణాల ప్రకారం ఇది 11.025 శాతం ఉండాలి.

సౌత్ ఇండియన్ బ్యాంక్ లాభాలు తగ్గాయ్

సౌత్ ఇండియన్ బ్యాంక్ డిసెంబర్ క్వార్టర్‌లో నిరాశజనకమైన ఫలితాలను ప్రకటించింది. ఈ బ్యాంక్ నికర లాభాలు 27 శాతం పడిపోయి, రూ.83.85 కోట్లగా నమోదయ్యాయి. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో బ్యాంక్ రూ.115 కోట్ల నికర లాభాలను రికార్డు చేసిన సంగతి తెలిసిందే. క్వార్టర్ రివ్యూలో బ్యాంక్ మొత్తం ఆదాయం రూ.1,921.93 కోట్లకు పెరిగింది. అంతకముందటి ఏడాది ఇది రూ.1,735.77 కోట్లగానే ఉందని సౌత్ ఇండియా బ్యాంక్ రెగ్యులేటరీ ఫైలింగ్‌లో పేర్కొంది. మొత్తం అడ్వాన్సుల్లో స్థూల నిరర్థక ఆస్తులు 4.88 శాతానికి పెరిగాయి. నికర ఎన్‌పీఏలు డిసెంబర్ క్వార్టర్‌లో 3.54 శాతానికి పెరిగినట్టు బ్యాంక్ క్వార్టర్ ఫలితాల్లో వెల్లడించింది.

తెలంగాణ చేనేత వస్త్రాలకు మైక్రోసాఫ్ట్ మార్కెటింగ్

హైదరాబాద్, వెలుగు: కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కార్యక్రమంలో భాగంగా ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీ మైక్రోసాఫ్ట్ తెలంగాణ చేనేత కార్మికుల కోసం ఈకామర్స్ పోర్టల్‌ను శుక్రవారం ప్రారంభించింది. వీళ్లు తయారు చేసిన వస్త్రాలను అమ్మడానికి రూపొందించిన reweave.in వెబ్‌సైట్‌ను తెలంగాణ ఐటీ, పరిశ్రమలశాఖ కార్యదర్శి జయేశ్ రంజన్ నిఫ్ట్‌లో జరిగిన కార్యక్రమంలో ఆవిష్కరించారు. దీని ద్వారా కళాకారుల సిగ్నేచర్ కలెక్షన్లను కొనుక్కోవచ్చు. ఆకర్షణీయ డిజైన్లతో దుస్తులను రూపొందించడానికి నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ (నిఫ్ట్), స్వచ్ఛంద సంస్థ చైతన్య భారతి సాయంతో క్యాడ్, కలర్స్ ఫర్ హ్యాండ్లూమ్ వీవింగ్, డిజైన్, మార్కెటింగ్‌పై 100 మంది చేనేత కళాకారులకు మైక్రోసాఫ్ట్ శిక్షణ ఇప్పించింది. ఇందుకోసం రాజోలి, చౌటుప్పల్‌లో డిజిటల్ ఎంపవర్‌మెంట్ కేంద్రాన్ని ప్రారంభించింది. వరంగల్, సిద్ధిపేట క్లస్టర్లలో త్వరలో ప్రారంభించనుంది. పోచంపల్లి, గద్వాల్, నారాయణపేట్ క్లస్టర్లలో గత రెండేళ్లుగా ఇలాంటి కేంద్రాలు పనిచేస్తున్నాయి. వీటిలో శిక్షణ పూర్తి చేసుకున్న మొదటి బ్యాచ్ కళాకా



వెబ్‌సైట్‌ను ప్రారంభిస్తున్న జయేశ్ రంజన్

రులకు జయేశ్ రంజన్ చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ తరం యువత ఆన్‌లైన్ షాపింగ్‌పై మక్కువ చూపిస్తున్నందున, ఈ వెబ్‌సైట్‌కు తప్పక ఆదరణ ఉంటుందని అన్నారు. దీనికి తగిన ప్రచారం కల్పించడానికి తెలంగాణ ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు. మైక్రోసాఫ్ట్ చేపట్టిన ఈ ప్రాజెక్టుతో ప్రాచీన చేనేత కళలను పునరుద్ధరించే అవకాశం దక్కిందని హర్షం వ్యక్తం చేశారు. రీవీవ్ సాయంతో కళాకారుల ఆదాయం మరింత పెరుగుతుందని అన్నారు.

విండోస్ ఫోన్లు ఇక ఉండవు

డిసెంబర్ నుంచి ఆపివేసినట్టు అధికార ప్రకటన

శాన్‌ఫ్రాన్సిస్కో : టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ అధికారికంగా విండోస్ ఫోన్లకు గుడ్‌బై చెప్పేసింది. డిసెంబర్‌లో ఈ ఫోన్లకు గుడ్‌బై చెప్పినట్టు వెల్లడించింది. యూజర్లు ఆండ్రాయిడ్ లేదా ఐఓఎస్ డివైజ్‌లకు మారాలని మైక్రోసాఫ్ట్ సూచించింది. విండోస్ 10 మొబైల్ ఇక సపోర్ట్ చేయవని స్పష్టం చేసింది. 'ఎండ్ ఆఫ్ సపోర్ట్' పేజీలో విండోస్ 10 మొబైల్, డిసెంబర్ 10 తర్వాత కొత్త సెక్యూరిటీ అప్‌డేట్లను తీసుకోవడం మానేసిందని యూజర్లకు తెలిపింది. విండోస్ 10 మొబైల్ ఓఎస్ సపోర్ట్ చేయడం ముగియడంతో, కస్టమర్లు ఆండ్రాయిడ్ లేదా ఐఓఎస్ డివైజ్‌లలోకి మారాలని పేర్కొంది. విండోస్ మొబైల్ 10 చివరి వెర్షన్ 1709. దీన్ని 2017 అక్టోబర్‌లో విడుదల చేశారు. విండోస్ 10 మొబైల్‌ను ఆపివేస్తున్నామని



2017లోనే మైక్రోసాఫ్ట్ సంకేతాలిచ్చింది. దీని కోసం కొత్త ఫీచర్లను కానీ, హార్డ్‌వేర్ కానీ డెవలప్‌చేయడం లేదని తెలిపింది. 'ఈ భూమిపై ఉన్న ప్రతి ఒక్కరూ, ప్రతి ఒక్క సంస్థ మరింత సాధించాలనుకుంటుంది. ఇతర ప్లాట్‌ఫామ్స్, డివైజ్‌లపై ఉన్న తమ మొబైల్ యాప్స్‌కు సపోర్ట్ ఇస్తారని కోరుకుంటున్నాం' అని మైక్రోసాఫ్ట్ ఓ ప్రకటన విడుదల చేసింది.

టారిఫ్ మార్చనంటున్న జియో

ప్రత్యర్థుల గుండెల్లో దడ



- జియోకు భారీగా పెరుగుతున్న కస్టమర్లు
- ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియాలకు మరిన్ని కష్టాలు

న్యూఢిల్లీ: టెలికం మార్కెట్లో టారిఫ్‌ల యుద్ధం ఇప్పట్లో ఆగే అవకాశాలు కనిపించడం లేదు. మనదేశంలో మూడో అతిపెద్ద టెల్కో రిలయన్స్ జియో చేసిన ప్రకటనే ఇందుకు నిదర్శనం. ఇక నుంచి కూడా తమ చవక ధరలు కొనసాగుతాయని ఇది వెల్లడించింది. ఆదాయాలు పెరుగుతూ, కొత్త కస్టమర్లు భారీగా చేరుతున్నందున ప్రస్తుత టారిఫ్‌లో మార్పులు చేసే అవకాశాలు లేవని తెలిపింది. జియో రాక తరువాత గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటున్న వొడాఫోన్ ఐడియా లిమిటెడ్ (విల్), భారతీ ఎయిర్‌టెల్‌ల రాబడి లక్ష్యాలను చేరుకోవడం సాధ్యమయ్యే పరిస్థితులు కనిపించడం లేదు. ఈ ఏడాది మూడో క్వార్టర్‌లో జియో ఆదాయపరమైన లక్ష్యాలను సాధించింది. ఇప్పటికే 28 కోట్ల మంది కస్టమర్లు ఉన్నా, మరింత మందిని చేర్చుకోవడానికి అధిక ప్రాధాన్యం ఇస్తోంది. మార్కెట్‌పరంగా 24 శాతం, రెవెన్యూ మార్కెట్‌పరంగా 26 శాతం వాటా దక్కించుకుంది. కస్టమర్ల సంఖ్యను 40 కోట్లకు పెంచుకోవాలన్న కంపెనీ లక్ష్యం నెరవేరేదాకా ప్రత్యర్థి కంపెనీలకు రాబడుల లక్ష్యాలను చేరుకోవడం సాధ్యం కాదని నిపుణులు చెబుతున్నారు. జియో ప్రకటన నేపథ్యంలో శుక్రవారం ఎయిర్‌టెల్ షేరు 6.4 శాతం, విల్ షేరు 4.5 శాతం నష్టపోయాయి.

ప్రతినెలా లక్షల సంఖ్యలో కస్టమర్లు చేరుతున్నందున ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేలోపు జియో కస్టమర్ బేస్ 30 కోట్లకు చేరుతుందని అంచనా. గత ఏడాది నవంబరు నాటి లెక్కల ప్రకారం ఎయిర్‌టెల్‌కు 34 కోట్ల మంది, వొడాఫోన్ ఐడియాకు 42 కోట్ల మంది కస్టమర్లు ఉన్నారు. గత కొన్ని నెలలుగా ఎయిర్‌టెల్ యూజర్ బేస్ పెద్దగా తగ్గకపోయినప్పటికీ, వొడాఫోన్ ఐడియా కస్టమర్లు మాత్రం భారీగా తగ్గిపోతున్నారు.

అప్పుల నుంచి ఉపశమనం..

టవర్, ఫైబర్ వంటి ఆస్తులను వేర్వేరు ఆస్తులుగా విభజించినందున అప్పులు బాగా తగ్గుతాయి. కాబట్టి రేట్లు పెంచాల్సిన అవసరం ఉండదు. ఫలితంగా ప్రత్యర్థి కంపెనీలు కూడా ప్రస్తుత టారిఫ్‌లను యథాతథంగా కొనసాగించకతప్పదని క్రెడిట్ సూసీ సంస్థ విశ్లేషించింది. జియోకు ఇప్పుడు రూ.1.78 లక్షల కోట్ల అప్పులు ఉండగా ఈ ఏడాది తొలి ఆరు నెలల్లోనే ఇందులో చాలా వరకు భారం తగ్గుతుందని మరో బ్రోకరేజీ సంస్థ సీఎల్ఎస్ఏ పేర్కొంది. ఇప్పటికే దీనికి ఆదాయాలు, కస్టమర్లు బాగానే ఉన్నందున గత రెండేళ్ల మాదిరిగా కస్టమర్ల సంఖ్య పెరగకపోవచ్చని మరికొందరు విశ్లేషకులు భావిస్తున్నారు. ఇది ప్రత్యర్థి కంపెనీలకు అనువైన పరిణామం కాబట్టి అవి టారిఫ్‌లు పెంచే అవకాశాలు ఉన్నాయని వాదిస్తున్నారు. ఇందులో భాగంగానే ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియా నెలకు కనీస రీచార్జ్‌ను రూ.34గా నిర్ణయించాయి. లేకపోతే ఇన్‌కమింగ్ కాల్స్‌ను నిలిపివేస్తున్నాయి. జియో చవక టారిఫ్‌లతో గత రెండేళ్లుగా ఆదాయాలను నష్టపోతున్న ఈ కంపెనీలు ఇలా లోటును కాస్త పూడ్చుకుంటున్నాయి. ఔట్ గోయింగ్ కాల్ రేట్లను మాత్రం యథాతథంగానే ఉంచవచ్చని అంటున్నారు. కనీస చార్జీల వసూలు వల్ల కస్టమర్ల సంఖ్య భారీగా తగ్గిపోయే చాన్సులు ఉన్నాయి. ఇది అంతిమంగా జియోకు మేలు చేయవచ్చు. అందుకే వచ్చే నెల ఈ రెండు కంపెనీలు భారీ నష్టాలను ప్రకటించే అవకాశాలు కనిపిస్తున్నాయి. జియో మాత్రం వరుసగా ఐదో క్వార్టర్‌లోనూ లాభాలను ప్రకటించింది. తాజాగా డిసెంబరుతో ముగిసిన క్వార్టర్‌లో లాభం 65 శాతం పెరిగి రూ.831 కోట్లకు చేరుకుంది. ఆపరేటింగ్ రెవెన్యూ రూ.10,383 కోట్లుగా నమోదయింది.

ఎవరి టారిఫ్‌లు ఎలా ఉన్నాయంటే..

ఎయిర్‌టెల్

టారిఫ్ (రూ.)	డేటా (జీబీ)	గడువు (రోజులు)
199	1.5	28
249	2	28
399	1	84
448	1.5	82
499	2	82

వొడాఫోన్

టారిఫ్ (రూ.)	డేటా (జీబీ)	గడువు (రోజులు)
199	1.5	28
255	2	28
399	1	84
479	1.5	84
511	2	84

జియో

టారిఫ్ (రూ.)	డేటా (జీబీ)	గడువు (రోజులు)
149	1.5	28
198	2	28
349	1.5	70
398	2	70
399	1.5	84
448	2	84

ఐడియా

టారిఫ్ (రూ.)	డేటా (జీబీ)	గడువు (రోజులు)
199	1.5	28
227	1.5	28
399	1	84
449	1.4	82
499	2	82

ఇద్దరు పీఎన్బీ డైరెక్టర్లపై వేటు..

చెన్నై: డైమండ్ కింగ్ నీరవ్ మోదీ పాల్పడిన భారీ కుంభకోణ కేసులో పంజాబ్ నేషనల్ బ్యాంక్‌కు(పీఎన్‌బీకి) చెందిన ఇద్దరు డైరెక్టర్లపై వేటు పడింది. పీఎన్‌బీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు సంజీవ్ శరణ్, కే. వీర బ్రహ్మాజి రావులను కేంద్ర ప్రభుత్వం తొలగించింది. ఈ విషయాన్ని పీఎన్‌బీ శుక్రవారం స్టాక్ ఎక్స్ఛేంజ్‌లకు తెలిపింది. 'పీఎన్‌బీకి చెందిన ఇద్దరు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లను తొలగిస్తూ.. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలను మేము స్వాగతిస్తున్నాం. టాప్ మేనేజ్‌మెంట్‌కు తెలియకుండా ఇంత పెద్ద స్కాం జరుగదు' అని ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్(ఏఐబీఏ) జనరల్ సెక్రటరీ సీహెచ్ వెంకటాచలం అన్నారు. జాతీయ బ్యాంక్‌ల స్కీమ్ 1970 కింద ప్రభుత్వ బ్యాంక్‌కు చెందిన ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లను కేంద్రం తొలగించడం ఇదే మొదటిసారి. ప్రభుత్వ రంగానికి చెందిన బ్యాంక్‌ల టాప్ మేనేజ్‌మెంట్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లను కాంట్రాక్ట్ ప్రాతిపదికనే నియమిస్తున్నారు.

అమెజాన్ ధూంధాం ఆఫర్లు

హైదరాబాద్, వెలుగు: అమెజాన్ మరోసారి భారీ ఆఫర్లతో ముందుకు వచ్చింది. గ్రేట్ ఇండియన్ సేల్ పేరిట క్రేజీ ఆఫర్లను ప్రకటించింది. జనవరి 20 నుండి ప్రారంభమైన ఈ డిస్కౌంట్లు జనవరి 23 వరకు కొనసాగుతాయి. ప్రైమ్ మెంబర్షిప్ ఉన్న వారికి 12 గంటల ముందుగానే డీల్స్ అందుబాటులోకి రాగా, నాన్ ప్రైమ్ మెంబర్స్ కు జనవరి 20 నుండి అందుబాటులోకి వచ్చాయి. మొబైల్స్, రిఫ్రిజి



రేటర్స్, వాషింగ్ మెషిన్స్, టీవీలు ఇలా అన్నింటిపై భారీ డిస్కౌంట్లు ప్రకటించింది అమెజాన్.ఇన్‌లో డిస్కౌంట్లతో పాటు ఎక్స్ఛేంజ్ ఆఫర్, అదనపు క్యాష్ బ్యాక్, నో కాస్ట్ ఈఎమ్ఐ వంటి ఆఫర్లున్నాయి.

మొబైల్స్ పై భారీ తగ్గింపు

ఈ సారి సేల్ లో మొబైల్ ఫోన్లపై భారీ తగ్గింపును ప్రకటించింది. ఎల్జీ వి 40 థింక్యూ ఫోన్ పై ఏకంగా రూ.10 వేలు తగ్గింపునిస్తోంది. 3 రియర్ కెమెరాలు, 2 ఫ్రంట్ కెమెరాలతో ఉన్న ఎల్జీ వి థింక్యూ ఫోన్ అసలు ధర రూ.60 వేల కాగా, రూ.49 వేలకే అందిస్తోంది. హానర్ ప్లే 4 జిబి ర్యామ్ వేరియంట్ ధర రూ.20,999 కాగా, రూ.13,999 కు వస్తోంది. హానర్ 8 సి పై రూ.2 వేలు, హానర్ 7 సి పై రూ.4,500, రెడ్ మి 6ఎ పై రూ.వెయ్యి, రియల్ మి యుఐ ఫోన్ పై రూ.2 వేలు తగ్గింపు లభిస్తోంది. ఇక రెడ్ మి వై2 ఫోన్ పై రూ.2,500 డిస్కౌంట్ తో పాటు ప్రైమ్ కస్టమర్లకు హెచ్‌డీఎఫ్‌సీ క్రెడిట్, డెబిట్ కార్డు ద్వారా రూ.1500 దాకా ఇన్‌స్టాంట్ డిస్కౌంట్ ను అదనంగా ఇస్తోంది. ఐఫోన్ 6 ధర రూ.31,900 కాగా రూ.20,900 లకే లభిస్తోంది. ఇక ఎమ్ఐ ఎ2 6జిబి ర్యామ్ 128 జిబి మెమరీ ఫోన్ అసలు ధర రూ.20,500 కాగా ప్రస్తుతం రూ.15,999 కే అందుబాటులో ఉంది. శాంసంగ్ ఫోన్లపై కూడా భారీ డిస్కౌంట్లున్నాయి. శాంసంగ్ గెలాక్సి నోట్ 8 అసలు ధర రూ.74,690 కాగా ఇప్పుడు ఏకంగా దాదాపు రూ.35 వేల డిస్కౌంట్ తో రూ.39,990 కే లభ్యమవుతోంది.

టీవీలపై హాట్ డీల్స్

టీసీఎల్ 55 ఇంచెస్ ఆండ్రాయిడ్ టీవి 45 శాతం డిస్కౌంట్ తో రూ.43,990 కే వస్తోంది. ఇక 65 ఇంచుల టీసీఎల్ ఆండ్రాయిడ్ టీవి అసలు ధర రూ.1,49,990 కాగా ఫ్లాష్ సేల్ లో రూ.79,990 కే లభ్యమవుతోంది. దీనికి రూ.10 వేల క్యాష్ బ్యాక్ అదనం. బిపిఎల్ 32 ఇంచుల హెచ్ డి ఎల్ఈడి టీవి రూ.9,699 కే లభిస్తోంది. ఇక 49 ఇంచుల ఎమ్ఐ ఎల్ఈడి ఫుల్ హెచ్ డి ఆండ్రాయిడ్ టీవి ధర రూ.32,999 కాగా రూ.29,999 కే అందుబాటులో ఉంది.



ఎల్&టి బై బ్యాక్‌కు సెబీ అడ్డు

న్యూఢిల్లీ: ఇంజనీరింగ్ దిగ్గజం ఎల్ అండ్ టి కి సెబీ (సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా) నుండి నిరాశ ఎదురైంది. రూ.9 వేల కోట్ల విలువైన షేర్ల బై బ్యాక్ ఆఫర్‌కు సెబి అనుమతించలేదని ఎల్ ఆండ్ టి శనివారం తెలిపింది. సెబీ నిబంధనలకు అనుగుణంగా లేదనే కారణంతో ఈ బై బ్యాక్ ఆఫర్ ను తిరస్కరించింది. షేర్ హోల్డర్ల నుండి 6.1 కోట్ల షేర్లను రూ.1,475 ల ఈక్విటీ షేర్ ధరతో, రూ.9,000 కోట్ల విలువైన షేర్లు బై బ్యాక్ చేయాలని గతేడాది ప్రతిపాదించింది. కానీ సెబీ నుండి చుక్కెదురైంది.



పుణేలో స్కోడా, ఫోక్స్‌వేగన్‌ల టెక్నాలజీ సెంటర్

పుణే: కార్ల తయారీ సంస్థలు స్కోడా, ఫోక్స్‌వేగన్‌లు పుణేలో సరికొత్త టెక్నాలజీ సెంటర్‌ను ప్రారంభించాయి. 2.0 ఇండియా ప్రాజెక్ట్‌లో భాగంగా ఛకన్ మానుఫ్యాక్చరింగ్ ప్లాంట్‌లో ఈ టెక్నాలజీ సెంటర్‌ను శనివారం ప్రారంభించాయి. స్కోడా, ఫోక్స్‌వేగన్ గ్రూప్ ఇండియా రెండూ కలిసి మన దేశంలో రీసెర్చ్, డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్‌లో రూ.2000 కోట్లను సంయుక్తంగా పెట్టుబడి పెట్టాయి. ఇండియాలో ఫోక్స్‌వాగన్ గ్రూప్‌ను స్కోడానే నిర్వహిస్తోంది. ఇందులో 250 మంది ఇంజనీర్లకు ఉద్యోగవకాశాలు కల్పిస్తారు. ఈ టెక్నాలజీ సెంటర్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో, చెక్ రిపబ్లిక్ ప్రధానమంత్రి ఆంద్రెజ్ బాబిస్, స్కోడా ఆటో టెక్నికల్ డెవలప్‌మెంట్ బోర్డు సభ్యుడు క్రిస్టియన్ స్ట్రూబ్ పాల్గొన్నారు. ఇండియా 2.0 ప్రాజెక్ట్.. ఔరంగాబాద్, పుణేలో ఉన్న గ్రూప్‌కు చెందిన రెండు ప్లాంట్ల సామర్థ్యాన్ని పెంపొందించనుంది.

కరీంనగర్.. కొత్త ఐటీ హబ్

హైదరాబాద్, వెలుగు:

వరంగల్, ఖమ్మం తరువాత ఇప్పుడు కరీంనగర్ కూడా ఐటీ హబ్ టాగ్ ను సొంతం చేసుకుంటోంది. గత యేడాది కరీంనగర్ లోని లోయర్ మానేర్ డ్యాం వద్ద అప్పటి ఐటీ మినిస్టర్ కేటీఆర్ ఐటీ టవర్ నిర్మాణానికి పునాదిరాయి వేశారు. ప్రభుత్వం ఈ ఐటీ టవర్ కోసం రూ.25 కోట్లు కేటాయించింది. ఇది ఇతర పట్టణాలకు కేటాయించిన బడ్జెట్ కంటే దాదాపు 50 శాతం ఎక్కువ. బిజినెస్ అవకాశాలను మరింత మెరుగుపరిచాలనేది ప్రభుత్వ లక్ష్యం. ఇప్పుడు దాదాపు 70 శాతం పూర్తయిన ఈ ఐటీ టవర్ త్వరలోనే అందుబాటులోకి వచ్చి ఎంతో మంది యువతకు ఉపాధి కల్పించనుంది. హైదరాబాద్ కాకుండా, టైర్ 2 పట్టణాల్లో కూడా ఐటీ కంపెనీలు నెలకొల్పాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందడుగు వేస్తోంది. ఇందులో భాగంగా వరంగల్, ఖమ్మం, కరీంనగర్, మహబూబ్ నగర్, నిజామాబాద్ పట్టణాలపై ప్రత్యేక దృష్టి సారించింది.

తక్కువ రెంట్, ఉచిత కోచింగ్

యుఎస్, యూకే వంటి దేశాల్లో ఉన్న కరీంనగర్ కు చెందిన ఐటీ ఉద్యోగులు అక్కడ మిడ్ సైజ్ కంపెనీలు నెలకొల్పి ఐటీ సంబంధిత కార్యకలాపాలు సాగిస్తున్నారు. ఇప్పటిదాకా కరీంనగర్ కు చెందిన దాదాపు 50 మంది అక్కడ కంపెనీలు నెలకొల్పారు. అలాంటి వారిని ఇక్కడ కూడా తమ కంపెనీ శాఖ ను ప్రారంభించాలని ప్రభుత్వం కోరుతోంది. అక్కడ 100 సీటింగ్ కెపాసిటీ తో కంపెనీ ఉంటే, కరీంనగర్ లో 25 సీట్లతో శాఖ ను ప్రారంభించాలనేది ప్రతిపాదన. ఇక్కడ కంపెనీలు ఏర్పాటు చేయాలంటే మళ్లీ కొత్తగా బిల్డింగ్ ఏర్పాటు చేయడం, స్కిల్డ్ ఎంప్లాయిస్ ను వెతకడం వంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వమే ఐటీ టవర్ ను ఏర్పాటు చేసి, కంపెనీలకు తక్కువ కిరాయికే ఆఫీస్ స్పేస్ ను అందిస్తుంది. దీంతో పాటు ఉద్యోగులకు ట్రెయినింగ్ ప్రోగ్రామ్స్ ను కూడా నిర్వహించి స్కిల్డ్ ఎంప్లాయిస్ ను సమకూరుస్తుంది. దీనివల్ల ఉపాధి అవకాశాలు మరింత మెరుగుపడతాయనేది ప్రభుత్వం ఆలోచన. స్టార్టప్‌లను కూడా కంపెనీలు పెట్టడానికి ప్రోత్సహిస్తోంది.

వెయ్యి సీటింగ్ కెపాసిటి

ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న కరీంనగర్ ఐటీ టవర్ దాదాపు 70 శాతం పూర్తయింది. మరి కొన్ని నెలల్లో అందుబాటులోకి రానున్న ఈ టవర్ ను వెయ్యి మందికి సరిపడా 25 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే 40 కంపెనీలు కరీంనగర్ లో తమ కార్యకలాపాలు ప్రారంభించడానికి ముందుకు వచ్చాయని తెలంగాణ ప్రభుత్వ ఐటీ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేష్ రంజన్ తెలిపారు. పలు కంపెనీలు ఇప్పటికే ఒప్పందం కుదుర్చుకున్నాయి. వెయ్యి సీట్ల సామర్థ్యం నిండిన తరువాత మరిన్ని కంపెనీలు వస్తే మరో టవర్ నిర్మించి ఇచ్చేందుకు కూడా ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. కరీంనగర్ తో పాటు నిజామాబాద్, మహబూబ్ నగర్ పట్టణాలపై కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఇలాంటి ప్రాజెక్టులే చేపట్టేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు.

రూ. లక్ష కోట్లకు ఐటీ ఎగుమతులు

2017-18 ఆర్థిక సంవత్సరంలో హైదరాబాద్ ఐటీ ఎగుమతులు దేశ సగటుకంటే కూడా ఎక్కువ వృద్ధి నమోదు చేశాయి. రూ.93,422 కోట్ల ఐటీ ఎగుమతులు జరిగాయి. దేశంలో ఐటీ ఎగుమతుల్లో బెంగుళూరు తరువాత హైదరాబాద్ రెండవ స్థానంలో నిలిచింది. 2016-17 ఆర్థిక సంవత్సరంలో రూ.85,475 కోట్ల మేర ఐటీ ఎగుమతులు నమోదయ్యాయి. ఈ యేడాది కూడా ఐటీ ఎగుమతుల విలువ రూ.లక్ష కోట్లకు చేరవచ్చని పరిశ్రమ వర్గాలు అంచనా వేస్తున్నాయి. 2014-15 లో రూ.55 వేల కోట్ల మేర ఐటీ ఎగుమతులు జరగగా, దానికి రెండింతల ఎగుమతులు జరగాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందడుగు వేసి విజయవంతంగా దూసుకెళ్తోంది. . ప్రస్తుతం 2020 నాటికి రూ.1,20,000 కోట్ల ఐటీ ఎగుమతులు జరుగుతాయని పరిశ్రమ వర్గాలు అంచనా వేస్తున్నాయి.



అన్నిరకాలుగా తోడ్పాటు



విదేశాల్లో చిన్న, మధ్య తరహా కంపెనీలు ఏర్పాటు చేసిన తెలంగాణ వాసులను ఇక్కడ చిన్న శాఖలను ఏర్పాటు చేయాలని కోరుతున్నాం. ఇందుకు పలు కంపెనీలు అంగీకారం తెలిపాయి. దీనికి సంబందించిన ఒప్పందం కూడా కుదుర్చుకున్నాం. ఐటీ టవర్ నిర్మించి దాన్లో తక్కువ అద్దెకే కంపెనీలకు ఆఫీస్ స్పేస్ ను కల్పించడంతో పాటు ఉద్యోగులకు ప్రత్యేక శిక్షణనిచ్చి నైపుణ్యం మెరుగుపరుస్తాం. కరీంనగర్ తో పాటు ఇతర పట్టణాల్లో కూడా ఐటీ, ఐటీ ఆధారిత సేవలు అందించే కంపెనీలు నెలకొల్పడానికి తగిన సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నాం. స్టార్టప్స్ ఏర్పాటు చేయడానికి కూడా ప్రత్యేకంగా టీహబ్ వంటివి ఏర్పాటు చేసి ప్రోత్సహిస్తున్నాం.

- జయేష్ రంజన్, రాష్ట్ర ఐటీ ప్రిన్సిపల్ సెక్రటరీ

నెక్ గుడ్ల ధరలు (100కు)	ఫామ్‌గేట్	రిటెయిల్
హైదరాబాద్	రూ.405	రూ.4.65
వరంగల్	రూ.407	రూ.4.65

సైనా ఫ్లే..!

'మలేసియా' సెమీస్‌లోనే ఓటమి

కౌలాలంపూర్: మలేసియా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీలో ఇండియా అగ్రశ్రేణి ప్లేయర్ సైనా నెహ్వాల్ పోరాటం ముగిసింది. శనివారం జరిగిన మహిళల సింగిల్స్ సెమీస్‌లో ప్రపంచ మాజీ నం.1, ఏడో సీడ్ సైనా 16-21, 13-21తో నాలుగో సీడ్, కరోలినా మరీన్ (స్పెయిన్) చేతిలో వరుస గేమ్‌ల్లో ఓటమిపాలైంది. 2017లో ఈ టోర్నీలో విజేతగా నిలిచి, 2011లో రన్నరప్ అయిన సైనా ఈసారి మాత్రం తుదిపోరుకు అర్హత సాధించలేకపోయింది. 40 నిమిషాల పాటు జరిగిన ఈ మ్యాచ్‌లో మరీన్ ధాటికి చేతులెత్తేసింది. మరీన్‌తో పోరును మెరుగ్గానే ఆరంభించిన సైనా తర్వాత క్రమంగా వెనకబడింది. తొలిగేమ్‌లో 5-2తో ముందంజ వేసిన నెహ్వాల్ ఆధిక్యాన్ని కాపాడుకోలేకపోయింది. దాంతో, మరీన్ 13-9తో ముందంజ వేసింది.



ఈ దశలో సైనా అద్భుతమైన పోరాటపటిమతో 14-14తో స్కోరు సమం చేసింది. పట్టువదలని మరీన్ వరుసగా పాయింట్లు సాధించి గేమ్‌ను తన ఖాతాలో వేసుకుంది. ఇక రెండోగేమ్‌లో ఆరంభంలో 6-1తో ముందంజ వేసిన మరీన్.. జోరు కనబర్చి 11-6తో స్పష్టమైన ఆధిక్యాన్ని దక్కించుకుంది. ఈ దశలో పుంజుకునేందుకు సైనా తీవ్రంగా ప్రయత్నించినా.. మరీన్ ఎలాంటి అవకాశమివ్వకుండా గేమ్‌తోపాటు మ్యాచ్‌ను కైవసం చేసుకుంది.



హలెప్ X సెరెనా



ప్రిక్వార్టర్స్‌కు సిమోనా, విలియమ్స్ • ఒసాక, జొకోవిచ్ ముందుకు • ఆస్ట్రేలియన్ ఓపెన్

మెల్‌బోర్న్: వరల్డ్ నంబర్ వన్ సిమోనా హలెప్, అమెరికా టెన్నిస్ గ్రేట్ సెరెనా విలియమ్స్ ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో ప్రిక్వార్టర్ ఫైనల్‌లో అమీతుమీకి రెడీ అయ్యారు. మూడో రౌండ్‌లో అలవోక విజయాలు సాధించిన ఈ ఇద్దరూ ప్రిక్వార్టర్స్‌కు దూసుకెళ్లారు. వీరితో పాటు నవోమి ఒసాక, ఎలినా స్వితోలినా కూడా ముందంజ వేశారు. గత మ్యాచ్‌లో అనామక ప్రత్యర్థిని ఓడించేందుకు కష్టపడిన టాప్ సీడ్ హలెప్ (రొమేనియా) శనివారం జరిగిన మూడో రౌండ్‌లో 6-2, 6-3తో అమెరికా వెటరన్‌ప్లేయర్ వీనస్ విలియమ్స్‌పై సులువుగా నెగ్గి.. ఆమె చెల్లి సెరెనాతో పోరుకు సిద్ధమైంది. ఇక, 24వ గ్రాండ్‌స్లామ్‌పై కన్నేసిన సెరెనా విలియమ్స్ వరుసగా మూడో మ్యాచ్‌లోనూ సెట్ కోల్పోకుండా విజయం సాధించింది. 16వ సీడ్‌గా బరిలో నిలిచిన అమెరికా గ్రేట్ 6-2, 6-1తో డయానా యస్త్రెమ్‌స్కా (ఉక్రెయిన్)ను చిత్తుగా ఓడించింది. తొలి రౌండ్‌లో సమంతా స్టోసర్, రెండో రౌండ్‌లో 23వ సీడ్ సువారెజ్ నవారోను ఓడించి జోరు మీదున్న అన్‌సీడెడ్ డయానా ఆటలు సెరెనా దగ్గర సాగలేదు. మూడు రౌండ్లలో కలిపి తొమ్మిది గేమ్‌లు మాత్రమే కోల్పోయిన సెరెనా పవర్ గేమ్ ముందు టీనేజర్ డయానా తేలిపోయింది. మ్యాచ్ ముగిశాక.. వెక్కివెక్కి ఏడ్చిన డయానాను సెరెనా ఓదార్చింది. నాలుగో సీడ్ నవోమి ఒసాక (జపాన్) ఈ రౌండ్ దాటేందుకు తీవ్రంగా చెమటోడ్చింది. ఒసాక 7-5, 4-6, 6-1తో తైవాన్ వెటరన్ ప్లేయర్ సు-వెయిపై గెలిచి ఈ మెగా టోర్నీలో వరుసగా రెండోసారి ప్రిక్వార్టర్స్ చేరింది. మరో మ్యాచ్‌లో ఆరో సీడ్ ఎలినా స్వితోలినా (ఉక్రెయిన్) భుజం నొప్పితో బాధపడుతున్నా విరామ సమయాల్లో చికిత్స తీసుకుంటూ 4-6, 6-4, 7-5తో చైనా ప్లేయర్ షుయ్ జాంగ్‌పై అద్భుత విజయం సాధించింది. తర్వాతి రౌండ్‌లో అమెరికా ప్లేయర్ మాడిసన్ కీస్‌తో ఆమె పోటీ పడనుంది. మరో పోరులో 17వ సీడ్ కీస్ 6-3, 6-2తో ఎలైస్ మార్టెన్స్ (బెల్జియం)పై నెగ్గింది. 18వ సీడ్ గార్బిన్ ముగురుజా (స్పెయిన్) 7-6 (10/5), 6- 2తో



టిమెయా బాసిన్‌స్కి (స్విట్జర్లాండ్)ను ఓడించగా.. 13వ సీడ్ అనస్తేనియా సెవత్సోవా (లాత్వియా) 6-3, 6-3తో వాంగ్ జింగ్ (చైనా)పై, ఏడో సీడ్ కరోలినా ప్లిస్కోవా 6-4, 3-6, 6-2తో కమిలా జియార్గి (ఇటలీ)పై నెగ్గి ముందంజ వేశారు.

జొకో సెట్ కోల్పోయినా..

14 గ్రాండ్‌స్లామ్‌ల వీరుడు, టాప్ సీడ్ నొవాక్ జొకోవిచ్ ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో ఏడో టైటిల్ దిశగా వడివడిగా అడుగులు వేస్తున్నాడు. మూడో రౌండ్‌లో 6-3, 6-4, 4-6, 6-0తో 25వ సీడ్ డెనిస్ షపలోవ్ (కెనడా)పై విజయం సాధించి ప్రిక్వార్టర్స్‌కు చేరుకున్నాడు. ఈ పోరులో నొవాక్‌కు కెనడా ఎమర్జింగ్ స్టార్ డెనిస్ కాస్త పోటీ ఇచ్చాడు. ఈ ఏడాది తొలిసారి ఒక సెట్ కోల్పోయినప్పటికీ నాలుగో సెట్‌లో ఒక్క గేమ్ కూడా విడిచిపెట్టకుండా నొవాక్ మ్యాచ్‌ను ముగించాడు.

ఇక, మరో యంగ్ గన్, నాలుగో సీడ్ అలెగ్జాండర్ జ్వెరెవ్ (జర్మనీ) 6-4, 6-1, 6-4తో వరుస సెట్లలో అలెక్స్ బోల్ట్ (ఆస్ట్రేలియా)ను చిత్తుగా ఓడించి మెల్‌బోర్న్‌లో తొలిసారి రౌండ్-16లోకి వచ్చాడు. అయితే, 12వ సీడ్ ఫాబియో ఫోగ్నిని (ఇటలీ) 2-6, 4-6, 6-2, 4-6తో 23వ సీడ్ పాబ్లో కారెనొ బుస్టా (స్పెయిన్) చేతిలో కంగుతిన్నాడు. 16వ సీడ్ మిలోస్ రోనిచ్ (కెనడా) 6-4, 6-4, 7-6 (10/6)తో పీర్-హెర్బర్ట్ (ఫ్రాన్స్)పై, 11వ సీడ్ బోర్నా కొరిచ్ 2-6, 6-3, 6-4, 6-3తో ఫిలిప్ క్రజినోవిచ్ (సెర్బియా)పై నెగ్గారు.

పేస్ జోడీ బోణీ.. బోపన్న జంట ఇంటికి

మిక్స్‌డ్ డబుల్స్‌లో ఇండియాకు మిశ్రమ ఫలితాలు దక్కాయి. రోహన్ బోపన్న తొలి రౌండ్‌లోనే ఓడిపోయి నిరాశ పరచగా.. లియాండర్ పేస్ బోణీ కొట్టి ప్రిక్వార్టర్స్‌కు చేరుకున్నాడు. ఆస్ట్రేలియా ప్లేయర్ సమంతా స్టోసర్‌తో జోడీ కట్టిన పేస్ 6-4, 7-5తో క్వెటా పష్కె (చెక్ రిపబ్లిక్)-వెస్లే కూల్హాఫ్ (నెదర్లాండ్స్) జంటపై గెలిచాడు. మరో మ్యాచ్‌లో రోహన్ బోపన్న-యాంగ్ జవొగ్సన్ (చైనా) జోడీ 6-3, 3-6, 6-10తో గ్రాన్‌ఫెల్డ్ (జర్మనీ)-రోబర్ట్ ఫరా (కొలంబియా) జంట చేతిలో పోరాడి ఓడింది.



హుమేరా జోడీకి రజతం

హైదరాబాద్, వెలుగు: ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో తెలంగాణ టెన్నిస్ ప్లేయర్లు షేక్ హుమేరా, శ్రీవల్లి రష్మిక రజతంతో మెరిశారు. అండర్-21 బాలికల డబుల్స్‌లో వీరిద్దరూ రన్నరప్‌గా నిలిచారు. శనివారం జరిగిన ఫైనల్లో హుమేరా-రష్మిక జోడీ 3-6, 2-6తో గుజరాత్‌కు చెందిన వైదేహి చౌదరి-జీల్ దేశాయ్ చేతిలో ఓడిపోయి రన్నరప్‌తో సరిపెట్టింది.



ధోనీకి, చాహల్‌కి ఫస్ట్‌క్లాస్

కోహ్లీ, భువీ సూపర్.. ధవన్ ఫ్లాప్ • ఆసీస్‌తో వన్డే సిరీస్‌లో టీమిండియా రిపోర్ట్ కార్డ్

ఆస్ట్రేలియా గడ్డపై తొలిసారిగా రెండు దేశాల వన్డే సిరీస్ గెలిచి విరాట్ కోహ్లీ నాయకత్వంలోని టీమిండియా సగర్వంగా తలెత్తుకున్నది. జట్టు సమష్టికృషితోనే ఈ విజయం సాధ్యమైంది. గతంలో మాదిరిగా ఒకరిద్దరూ ఆటగాళ్లపైనే ఆధారపడకుంటా.. జట్టుగా రాణించిన కోహ్లీ సేన వన్డే వరల్డ్‌కప్‌కు సన్నాహకంగా భావించిన ఆసీస్ టూర్‌ను విజయవంతంగా ముగించింది. ఏ ఒక్కరిపైనో భారం వేయకుండా, జట్టులోని ప్రతిఒక్కరూ తమ బాధ్యతను సక్రమంగా నిర్వర్తించడం వల్లే కంగారూల గడ్డపై కోహ్లీసేన జాతీయ జెండాను రెపరెపలాడించగలిగింది. ఈ వన్డే సిరీస్‌లో టీమిండియా ఆటతీరును పరిశీలిస్తే మహేంద్ర సింగ్ ధోనీ అందరి కంటే ఎక్కువ మార్కులు కొట్టేయగా చాహల్, భువనేశ్వర్ కూడా ముందున్నారు.



ఓపెనర్లు: ధవన్ – 4/10, రోహిత్ –7/10

ఈ సిరీస్‌లో టీమిండియా ఓపెనర్లు విఫలమయ్యారు. మూడు మ్యాచుల్లోనూ మిడిలార్డరే బ్యాటింగ్ భారాన్ని మోసింది. శిఖర్ ధవన్ వరుసగా 0, 32, 23 స్కోర్లు చేశాడు. అడిలైడ్‌లో డకౌట్ అయిన శిఖర్, తర్వాతి రెండు వన్డేల్లో బాగానే ఆడినా పెద్ద స్కోర్లు చేయడంలో ఫెయిలయ్యాడు. ఫీల్డింగ్‌లో మాత్రం సత్తా చాటాడు. మరో ఓపెనర్ రోహిత్ తొలి వన్డేలో సెంచరీతో అదరగొట్టి రెండో వన్డేలో 43 రన్స్ చేశాడు. మూడో మ్యాచ్‌లో మాత్రం సింగిల్ డిజిట్ స్కోరుకే పెవిలియన్ చేరాడు.

విరాట్ కోహ్లీ–8/10

తొలి వన్డేలో ఫెయిలైన కెప్టెన్ విరాట్ కోహ్లీ రెండో వన్డేలో కెరీర్‌లో 39వ సెంచరీ చేశాడు. మూడో వన్డేలోనూ 46 రన్స్ చేసి సత్తా చాటాడు. మూడు మ్యాచుల్లో 51 సగటుతో 153 రన్స్ చేసిన కోహ్లీ కెప్టెన్‌గానూ మంచి మార్కులు కొట్టేశాడు. జట్టు ఎంపిక, బౌలర్ల మార్పు, ఫీల్డ్ ప్లేస్‌మెంట్స్‌లో సక్సెస్ అయ్యాడు.

ధోనీ – 9/10

మాజీ కెప్టెన్‌ధోనీ ఈ సిరీస్‌తో జట్టుకు తన అవసరమేంటో చూపించాడు. తొలి వన్డేలో అంబటి రాయుడు ఫెయిలవ్వడంతో చివరి రెండు మ్యాచుల్లో నాలుగో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన ధోనీ హ్యాట్రిక్ హాఫ్ సెంచరీలు చేశాడు. సిరీస్ విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఇండియా గెలిచిన చివరి రెండు మ్యాచుల్లోనూ ధోనీ నాటౌట్‌గా నిలిచాడు. ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా ఎంపికైన ధోనీ కీపర్‌గా కూడా సత్తా చాటాడు. వికెట్ల వెనక నుంచి యువ బౌలర్లకు సలహాలిస్తూ వికెట్లు తీయించాడు.

జాదవ్ –5/10, రాయుడు–3/10

తొలి మ్యాచ్‌లో డకౌటైన రాయుడు, సెకండ్ మ్యాచ్‌లో 24 రన్స్‌కే పెవిలియన్ చేరాడు. రాయుడు స్థానంలో ఆఖరి వన్డేలో ఆడిన కేదార్ జాదవ్, ధోనీతో కలిసి జట్టుకు విజయం అందించాడు. బౌలింగ్‌లో కూడా రాణించాడు.

భువనేశ్వర్–8/10

టెస్ట్ సిరీస్‌లో బెంచ్‌కు పరిమితమైన భువనేశ్వర్ వన్డేల్లో శభాష్ అనిపించుకున్నాడు. తొలి వన్డేలో లయ తప్పినా చివరి రెండు మ్యాచుల్లో అద్భుతంగా బౌలింగ్ చేశాడు. మొత్తం ఎనిమిదితో ఈ సిరీస్‌లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా నిలిచాడు.

దినేశ్ కార్తీక్–6/10

ధోనీ ఉన్నప్పటికీ బ్యాట్స్‌మెన్‌గా జట్టులో కొనసాగుతున్న దినేశ్ కార్తీక్‌కు ఈ సిరీస్‌లో రెండు మ్యాచుల్లో బ్యాటింగ్ చాన్స్ దొరికింది. తొలి మ్యాచులో 21 బాల్స్ ఆడి 12 రన్స్ చేసిన కార్తీక్, రెండో వన్డేలో ధోనీతో కలిసి చివరి వరకు క్రీజులో ఉండి జట్టును గెలిపించాడు. ఇక సిడ్నీ వన్డేలో మాక్స్‌వెల్ క్యాచ్‌ను పట్టుకున్న కార్తీక్ మ్యాచ్ గతిని మార్చేశాడు.

జడేజా –4/10

టెస్ట్ సిరీస్‌లో మెరిసిన జడేజా వన్డే సిరీస్‌లో మాత్రం సత్తా చాటలేకపోయాడు. మూడు మ్యాచుల్లో కలిపి రెండు వికెట్లు తీసిన జడ్డూ, ఓ మ్యాచ్‌లో బ్యాటింగ్‌కు వచ్చి కేవలం 8 రన్స్ మాత్రమే చేశాడు. వన్డే వరల్డ్‌కప్ ఆడే తుది జట్టులో కచ్చితంగా ఉండే జడేజా నుంచి జట్టు మరింత ఆశిస్తుంది.

సిరాజ్, ఖలీల్, శంకర్ –1/10

లెఫ్టార్మ్ పేసర్ ఖలీల్, ఈ సిరీస్‌లో వన్డే అరంగేట్రం చేసిన మహ్మద్ సిరాజ్, విజయ్ శంకర్ తీవ్రంగా నిరాశ పరిచారు. ఏ ఒక్కరు కూడా గుర్తుండిపోయే ప్రదర్శన చేయలేకపోయారు. సిరాజ్ అరంగేట్ర మ్యాచ్‌లో అత్యధిక పరుగులు సమర్పించుకున్న రెండో బౌలర్‌గా నిలిచి చెత్త రికార్డును మూటగట్టుకున్నాడు.

కుల్దీప్–5/10, చాహల్–10/10

ఈ సిరీస్‌లో రెండు మ్యాచులు ఆడిన కుల్దీప్ కేవలం రెండు వికెట్లు తీసి ఫర్వాలేదనిపించాడు. మూడో వన్డేలో కోహ్లీ అనూహ్యంగా చాహల్‌ను తీసుకోగా, ఆ ప్రయోగం ఫలించింది. ఆ మ్యాచ్‌లో ఆరు వికెట్లు తీసిన చాహల్ జట్టును గెలిపించాడు. అంతేకాక ఆసీస్ గడ్డపై ఆరు వికెట్ల ఘనత సాధించిన తొలి స్పిన్నర్‌గా రికార్డు సాధించాడు.

మహ్మద్ షమి – 6/10

పేసర్ మహ్మద్ షమి ఈ సిరీస్‌లో ఐదు వికెట్లు తీశాడు. తొలి మ్యాచ్‌లో ఒక్క వికెట్ తీయలేకపోయిన షమి, రెండో వన్డేలో మూడు, ఆఖరి వన్డేలో రెండు వికెట్లు తీశాడు. ఎకానమీ పరంగా కూడా షమీ ఈ సిరీస్‌లో రాణించాడు. చాలా సందర్భాల్లో ఐదు కంటే తక్కువ రన్సే ఇచ్చి జట్టుకు ఉపయోగపడ్డాడు.

సస్పెన్షన్ ఎత్తేయండి

పాండ్యా, రాహుల్‌కు బీసీసీఐ మద్దతు



న్యూఢిల్లీ : మహిళలను అవమానించే రీతిలో మాట్లాడిన క్రికెటర్లు పాండ్యా, రాహుల్ వ్యవహారం రోజుకో మలుపుతిరుగుతోంది. ఈ ఇద్దరిపై నిషేధం ఎత్తేసి మ్యాచ్‌లు ఆడించాలని భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు (బీసీసీఐ) యాక్టింగ్ ప్రెసిడెంట్ కేసీఖన్నా కమిటీ ఆఫ్ అడ్మినిస్ట్రేటర్స్ (సీఓఏ)ను కోరారు. ఇద్దరిపై విచారణ కొనసాగిస్తూనే మ్యాచ్‌లు ఆడించాలన్నారు. పాండ్యా, లోకేశ్ వ్యవహారాన్ని తేల్చేందుకు ప్రత్యేక సర్వసభ్య సమావేశాన్ని ఏర్పాటు చేసేందుకు నిరాకరించారు. ఈ ఇద్దరు ప్లేయర్లపై విచారణ కోసం ప్రత్యేక సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించి, అంబుడ్స్‌మన్‌ను నియమించడం సరికాదని, ఈ వ్యవహారంపై వచ్చేవారం సుప్రీం కోర్టు విచారణ జరుపుతోందని ఖన్నా అన్నారు. 'ఆ ఇద్దరూ తప్పు చేశారు, అందుకే ఇద్దరూ సస్పెండ్ అయ్యారు, ఆస్ట్రేలియా సిరీస్ నుంచి వెనక్కు పిలిపించాం, ఇద్దరూ సారీ చెప్పారు కూడా' అని సీఓఏకు రాసిన లేఖలో ఖన్నా వివరించారు. ఈ నేపథ్యంలో ఇద్దరిపై విచారణ కొనసాగిస్తూనే వీలైనంత త్వరగా జట్టుకు అందుబాటులో ఉండేలా చూడటం మంచిదంటూ ఆ లేఖలో ఖన్నా తన అభిప్రాయాన్ని వెల్లడించారు. అయితే పాండ్యా, రాహుల్ వ్యవహారాన్ని తేల్చేందుకు అంబుడ్స్‌మన్‌ను నియమించాలని సీఓఏ సుప్రీంకోర్టును కోరింది.

టెన్నిస్ లెజెండ్‌తో క్రికెట్ కింగ్



ఆస్ట్రేలియాలో టూర్ అయిపోవడంతో భార్య అనుష్కతో కలిసి టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ ఎంజాయ్ చేస్తున్నాడు. న్యూజిలాండ్ టూర్‌కువెళ్లే ముందు భార్యతో కలిసి శనివారం ఆస్ట్రేలియన్ ఓపెన్ టెన్నిస్ మ్యాచ్‌లను చూడ్డానికి వెళ్లాడు. నొవాక్ జొకోవిక్, డెన్నిస్ షపలోవ్ మ్యాచ్ చూసేందుకు వెళ్లిన.. విరుష్క జంటకు అనుకోకుండా 20 సార్లు గ్రాండ్‌స్లామ్ విన్నర్ రోజర్ ఫెదరర్‌ను కలిసే అవకాశం లభించింది. టెన్నిస్ లెజెండ్‌తో కలిసి ఫొటోలు దిగారు. ఈ ఫొటోలను ట్విట్టర్‌లో పోస్ట్ చేశాడు కోహ్లీ. ఆస్ట్రేలియన్ ఓపెన్ సందర్భంగా ఫెదరర్‌ని కలుసుకోవడం మరచిపోలేనని ట్వీట్ చేశాడు.

ఫెడరర్‌కు చేదు అనుభవం



ఆస్ట్రేలియా ఓపెన్‌లో రోజర్ ఫెడరర్‌కు చేదు అనుభవం ఎదురైంది. అక్రిడేషన్ మర్చిపోయిన ఫెడరర్‌ను డ్రెస్సింగ్ రూంలో వెళ్లకుండా భద్రతా సిబ్బంది అడ్డుకున్నారు. డ్రెస్సింగ్ రూంలోకి వెళ్లడానికి.. నేనే 'రోజర్ ఫెడరర్' అని ఫెడ్డీ నిరూపించుకోవాల్సి వచ్చింది. అయితే ఫెడెక్స్ ఓపికగా నిలబడగా.. ఆయన కోచ్ జుబిసిస్ వెంటనే అక్కడికి వచ్చాడు. ఆయన ఐడీ కార్డ్ చూపించిన తర్వాత గానీ ఫెడ్డీని లోపలికి అనుమతించలేదు.

సౌరాష్ట్ర సంచలనం

రంజీల్లో అతిపెద్ద ఛేజింగ్‌తో రికార్డు

లక్నో: రంజీ ట్రోఫీ చరిత్రలో సౌరాష్ట్ర 11 ఏళ్ల రికార్డును బద్దలు కొట్టింది. ఈ టోర్నీలో అత్యధిక పరుగుల టార్గెట్‌ను ఛేజ్ చేసిన జట్టుగా నిలిచింది. ఉత్తరప్రదేశ్ నిర్దేశించిన 372 పరుగుల లక్ష్యాన్ని శనివారం కేవలం నాలుగు వికెట్లు కోల్పోయి ఛేదించింది. హార్విక్ దేశాయ్ (116) ఫస్ట్‌క్లాస్ కెరీర్‌లో తొలి సెంచరీతో కదం తొక్కాడు. అతనికి స్నెల్ పటేల్ (72), చటేశ్వర్ పుజారా (67 నాటౌట్), షెల్డన్ జాక్సన్ (73 నాటౌట్) చక్కని సహకారం అందించారు. దీంతో గతంలో అసోం పేరిట ఉన్న రికార్డు (371)ను సౌరాష్ట్ర తిరగరాసింది.

విదర్భ ఘనవిజయం

మరో క్వార్టర్స్‌లో డిఫెండింగ్ చాంప్ విదర్భ ఇన్నింగ్స్ 115 పరుగులతో ఉత్తరాఖండ్‌పై గెలుపొందింది. ఓవర్‌నైట్ స్కోరు 152/5తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఉత్తరాఖండ్ మరో 7 పరుగులు జోడించి 159 రన్స్ వద్ద కుప్పకూలింది. ఉమేశ్ యాదవ్ (5/23), స్పిన్నర్ ఆదిత్య (5/55) విదర్భను గెలిపించారు. తొలి ఇన్నింగ్స్‌లో విదర్భ 629 రన్స్ చేయగా, ఉత్తరాఖండ్ 355కే ఆలౌటైంది.

వికాస్ క్రిషన్ బోణీ

న్యూఢిల్లీ: ప్రొఫెషనల్ బాక్సర్‌గా మారిన ఇండియన్ స్టార్ వికాస్ క్రిషన్ తొలి బౌట్‌లో విజయం సాధించాడు. న్యూయార్క్‌లో అమెరికన్ బాక్సర్ స్టీవెన్ ఆండ్రెడ్‌తో జరిగిన ఆరు రౌండ్ల సూపర్ వెల్టర్ వెయిట్ పోరును ఈజీగా ముగించాడు. కేవలం రెండు రౌండ్లు మాత్రమే జరిగిన పోరులో టెక్నికల్ నాకౌట్‌తో వికాస్ గెలుపొందాడు.



ఫేక్ న్యూస్‌కు పడట్లేదు

సోషల్ మీడియాలో జాగ్రత్తగా ఉంటున్న ఇండియన్లు

- వాట్సాప్‌లో వచ్చిన ప్రతి మెసేజ్‌ను నమ్మట్లేదు
- షేర్ చేసేటప్పుడూ జాగ్రత్తగానే
- యూగోవ్ సంస్థ సర్వేలో వెల్లడి

న్యూఢిల్లీ: వాట్సాప్‌లో వచ్చిన ప్రతి మెసేజ్‌ను ఇండియన్లు నమ్మేయడం లేదట. ఫేక్ న్యూస్ విషయంలో చాలా జాగ్రత్తపడుతున్నారట. వాట్సాప్, ఫేస్‌బుక్, ట్విటర్‌లో వచ్చిన మెసేజ్‌లను షేర్ చేసేటప్పుడూ ఒకటికి రెండుసార్లు ఆలోచిస్తున్నారట. పబ్లిక్ ఒపీనియన్ రీసెర్చ్ సంస్థ యూగోవ్ తాజా సర్వేలో ఈ విషయం వెల్లడైంది. ఈ సర్వేలో పాల్గొన్న వారిలో సగం మంది న్యూ ఇయర్ తీర్మానాలుగా 2019లో తమ వాట్సాప్ నంబర్‌కు వచ్చిన ప్రతి మెసేజ్‌నూ నమ్మబోమని చెప్పారు. యూగోవ్ సంస్థ 732 మంది ఇండియన్లపై ఆన్‌లైన్‌లో డిసెంబర్ 31 నుంచి జనవరి 3 మధ్య ఈ సర్వే చేసింది.

చదివిన ప్రతీది నమ్మబోం

ఫేస్‌బుక్‌కు అనుబంధంగా ఉన్న వాట్సాప్‌ను 2018లో ప్రపంచవ్యాప్తంగా ఎక్కువ మంది డౌన్‌లోడ్ చేసుకున్నారు. ఇండియాలో 25 కోట్ల మంది వాట్సాప్ యూజర్లు ఉన్నారు. వాట్సాప్ పాపులారిటీ నేపథ్యంలో యూగోవ్ సంస్థ ఈ సర్వేలో రెస్పాండెంట్లను వారి వాట్సాప్ తీర్మానాలు ఏమిటని ప్రశ్నించింది. దీనికి 47 శాతం మంది "నేను వాట్సాప్‌లో చదివిన ప్రతి విషయాన్నీ నమ్మను" అని చెప్పారు. . ఇక 41 శాతం మంది వాట్సాప్‌లో వచ్చిన మెసేజ్‌ను సోర్స్ ఏమిటీ అనేది వెరిఫై చేయకుండా ఫార్వర్డ్ చేయమని అన్నారు. ఇక కొంత మంది మూడుకంటే ఎక్కువ గ్రూపులకు అడ్మినిస్టేటర్‌గా ఉండటానికి ఇష్టపడలేదు. గుడ్ మార్నింగ్, గుడ్ నైట్ మెసేజ్‌లను పంపబోమని మరికొందరు చెప్పారు. ఫేక్ న్యూస్‌కు సంబంధించిన తీర్మానాలకు పాపులారిటీ పెరగడం ఇండియన్స్‌కే కాదు వాట్సాప్‌కూ గుడ్ న్యూసే. ప్రస్తుతం దేశంలో ఫేక్ న్యూస్‌కు సంబంధించి ఎక్కువ ఇబ్బందులు ఎదురవుతున్నది వాట్సాప్ నుంచే. ఈ మధ్యకాలంలో సోషల్ మీడియా ద్వారా ఫేక్ న్యూస్ ప్రచారం విపరీతంగా పెరిగింది. ఫేక్ న్యూస్‌నే నిజమని నమ్మి సర్క్యులేట్ చేయడం వల్ల గతేడాది 25కుపైగా వివాదాలు చెలరేగాయి. ఈ నేపథ్యంలో ఇండియాకు సంబంధించి మెసేజ్‌ను ఫార్వర్డ్ చేయడంపై వాట్సాప్ లిమిట్ పెట్టింది. ఫేక్ న్యూస్‌పై టీవీ, రేడియో, ప్రింట్ యాడ్స్ కోసం రూ.120 కోట్లు వెచ్చిస్తోంది.

సోషల్ మీడియాకి ఎడిక్ట్

ఎక్కువ మంది ఇండియన్లు సోషల్ మీడియాకి ఎడిక్ట్ అయ్యారని యూగోవ్ సర్వే వెల్లడించింది. 37 శాతం మంది తాము ఫోన్‌కు ఎడిక్ట్ అయ్యామని చెప్పగా.. 31 శాతం మంది ఫేస్‌బుక్‌లో గడుపుతున్నామన్నారు. అయితే మొబైల్‌ఫోన్ వాడకాన్ని తగ్గిస్తామని చాలా మంది కొత్త ఏడాది తీర్మానంగా నిర్ణయించుకున్నామని పేర్కొన్నారు. 37 శాతం మంది భోజనం చేసేటప్పుడు మొబైల్ చూడబోమని చెప్పారు. 35 శాతం మంది డ్రైవింగ్ చేసేటప్పుడు ఫోన్ వాడబోమన్నారు. 34 శాతం మంది ఫోన్‌ను దగ్గరగా పెట్టుకుని నిద్రపోబోమని కొందరు.. సోషల్ మీడియాలో కాకుండా పర్సనల్‌గా ఫ్రెండ్స్, ఇతరులతో ఇంటరాక్షన్ పెట్టుకుంటామని మరికొందరు చెప్పారని యుగోవ్ సర్వే పేర్కొంది.

సర్వేలో వెల్లడైన వాట్సాప్ తీర్మానాలు

చదివిన ప్రతి విషయాన్నీ నమ్మను	47 శాతం
సోర్స్‌ను వెరిఫై చేయకుండా ఫార్వర్డ్ చేయను	41 శాతం
వాట్సాప్‌లో కాక నేరుగా గ్రీటింగ్స్ చెబుతాం	37 శాతం
గుడ్‌మార్నింగ్, గుడ్ నైట్ మెసేజ్‌లు పంపను	30 శాతం
మూడు గ్రూపులకు మించి అడ్మిన్‌గా ఉండను	23 శాతం

2019లో టాప్ 5 సోషల్ మీడియా తీర్మానాలు

ఫేస్‌బుక్‌లో ఫ్రెండ్స్‌ను సెలెక్టివ్‌గా యాడ్ చేస్తా	34 శాతం
సోషల్ మీడియాలో కాదు.. నేరుగా గ్రీటింగ్స్ చెబుతా	29 శాతం
నా ఎమోషన్లను స్నేహితునితో పంచుకుంటా	27 శాతం
ర్యాండమ్ పోస్టులను వెరిఫై చేశాకే షేర్ చేస్తా	27 శాతం
ఫేస్‌బుక్ క్రియేట్ చేసిన వీడియోలు షేర్ చేయను	24 శాతం

పాదాలకు డిజిటల్ తొడుగు

నైక్ నుంచి ఆటో లేసింగ్ షూ

ఎలక్ట్రానిక్ వస్తువులనే కాదు.. షూలనూ స్మార్ట్‌ఫోన్‌తో కంట్రోల్ చేయొచ్చు. కాస్త వింతగా అనిపించినా ఇది నిజమేనని నైక్ కంపెనీ కొత్త షూలను చూస్తే తెలుస్తుంది. ఆటోలేసింగ్ పేరుతో తయారు చేసిన ఈ బూట్లలోఆధునిక టెక్నాలజీని కంపెనీ వాడింది. వీటిని కాళ్లకు తొడిగాక లేస్ బిగించాలన్నా, కాస్త వదులు చేసుకోవాలన్నా స్మార్ట్ ఫోన్‌లోని యాప్‌తో ఇట్టే చేసేసుకోవచ్చు. బేసిక్‌గా ఈ బూట్లను బాస్కెట్ బాల్ ఆటగాళ్లను దృష్టిలో పెట్టుకొని తయారు చేసింది. ఇవి అథ్లెట్స్‌కూ బాగా ఉపయో



గపడతాయట. ప్రాక్టీస్ సమయంలో ఈ బూట్ల సాయంతో అథ్లెట్స్ తమ పెర్ఫార్మెన్స్ ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చని కంపెనీ చెబుతోంది. ఈ సమాచారం మొత్తం తమకూ అందుతుందని, ఆ వివరాలతో ప్రోడక్ట్‌ను మరింత మెరుగుపరుస్తామని వెల్లడించింది. ఆటగాళ్లు తమ వివరాలు బయటికి చెప్పొద్దనుకుంటే సీక్రెసీ మెయింటెయిన్ చెయ్యొచ్చనీ అంటోంది. కానీ సీక్రెసీ వల్ల షూల ఫీచర్లను పూర్తిస్థాయిలో వాడుకోలేరంది. ఈ బూట్లు బాస్కెట్‌బాల్ ఆటగాళ్లకోమే తయారు చేసినా అందరికీ ఉపయోగపడతాయని నైక్ ప్రతినిధి చెప్పారు. ఇంతకీ ఈ బూట్ల ధర ఎంతో చెప్పలేదు కదూ.. జస్ట్ 350 డాలర్లు మాత్రమే. కాస్త అటూఇటూగా పాతిక వేల రూపాయలన్నమాట. అయినాసరే ఓ జత కొనేద్దామని అనుకుంటే ఇంకొన్ని రోజులు ఆగాల్సిందే! వచ్చే నెలలో అమెరికా మార్కెట్లో విడుదల చేస్తున్న ఈ సెల్ఫ్ లేసింగ్ షూలు ఇండియన్ మార్కెట్లోకి రావడానికి ఇంకాస్త టైం పడుతుందట.

షూ ఫీచర్స్

- ఆటో లేసింగ్
- పెర్ఫార్మెన్స్ ట్రాకింగ్
- ఆక్సిలరో మీటర్స్
- గైరోస్కోప్స్
- రెండు వారాల బ్యాటరీ లైఫ్

మ్యూజిక్‌కు మనోళ్లు ఫిదా

- యూట్యూబ్‌లో ఆ చానళ్లనే ఇష్టపడుతున్న ఇండియన్స్
- 2018లో 34 కోట్ల సబ్ స్క్రయిబర్లు
- రెండో ప్లేస్‌లో ఎంటర్‌టైన్‌మెంట్

న్యూఢిల్లీ: 'శిశుర్వేత్తి, పశుర్వేత్తి, వేత్తి గానరసం ఫణి'.. పిల్లలు, పశువులు, చివరికి పాములూ సంగీతానికి స్పందిస్తాయంటారు పెద్దలు. చిటపట చినుకులు పడుతూ ఉంటే.. చూరు కిందికెళ్లి.. వేడి వేడి టీనో కాఫీనో తాగుతూ.. లయబద్ధంగా సాగే సంగీతాన్ని, సాహిత్యాన్ని వింటుంటే మనసు ఎంత ప్రశాంతంగా ఉంటుందో..! చలికాలంలో ముసుగేసుకొని ఇయర్‌ఫోన్స్ పెట్టుకొని పాటలు వింటుంటే.. ఎండా కాలంలో సాయంత్రం ఆరుబయట మంచంపై పడుకొని రాగాలు తీస్తుంటే.. చెప్పలేనంత హాయిగా ఉంటుంది!! ఒంటరిగా ఉన్నప్పుడైనా, నలుగురితో కలిసినప్పుడైనా సంగీతం మనసును సమ్మోహనపరుస్తుంది. అందుకే ఇండియన్స్ ఎక్కువగా మ్యూజిక్‌నే ఇష్టపడుతున్నారట. మ్యూజిక్ చానల్స్‌కు ఓటేస్తున్నారట. యూట్యూబ్‌లో ఎక్కువ మంది మ్యూజిక్ చానల్స్‌నే సబ్‌స్క్రయిబ్ చేస్తున్నట్లు ఓ అధ్యయనంలో తేలింది. 2018లో ఇండియన్స్ ఎక్కువగా సబ్‌స్క్రయిబ్ చేసిన యూట్యూబ్ చానల్స్ ఏమిటని నోయిడాకి చెందిన వీడియో అనలైటిక్స్ సంస్థ 'విడూలీ' విశ్లేషించింది. రిపోర్టును విడుదల చేసింది. 2018 జనవరి 1 నుంచి డిసెంబర్ 31 వరకు యూ ట్యూబ్‌లో 34 కోట్ల మంది వివిధ రకాల మ్యూజిక్ చానల్స్‌ను సబ్‌స్క్రయిబ్ చేశారని విడూలీ వెల్లడించింది. సెల్‌ఫోన్‌లో ఇంటర్నెట్ ఉంటే చాలు.. రోజులో ఏదో ఓ సందర్భంలో మ్యూజిక్ చానల్స్‌ను సర్ఫ్ చేయకుండా ఉండలేనంతగా జనం ఫిదా అయిపోయారని అభిప్రాయపడింది. మ్యూజిక్ చానల్స్ తర్వాత.. హిందీ, తెలుగు, బెంగాలీ, భోజ్‌పురి భాషల్లోని ఎంటర్‌టైన్‌మెంట్ చానల్స్‌ను 22 కోట్ల మంది సబ్‌స్క్రయిబ్ చేశారని వివరించింది. 2,900 ఇండియన్ యూట్యూబ్ చానల్స్‌ను ప్రాతిపదికగా తీసుకొని 18 కేటగిరీలుగా విడూలీ సంస్థ ర్యాంకింగ్‌లు ప్రకటించింది. మొదటి స్థానంలో మ్యూజిక్, రెండో స్థానంలో ఎంటర్‌టైన్‌మెంట్ ఉండగా మూడో స్థానంలో న్యూస్ అండ్ పాలిటిక్స్ చానల్స్ నిలిచాయి. సినిమాలు, కామెడీ, కిడ్స్ చానల్స్‌ను కూడా మనవాళ్లు ఎక్కువగా ఇష్టపడుతున్నట్లు తేలింది.

2018లో విభాగాలవారీగా సబ్‌స్క్రయిబర్లు

మ్యూజిక్	34 కోట్లు
ఎంటర్‌టైన్‌మెంట్	22 కోట్లు
న్యూస్ అండ్ పాలిటిక్స్	11 కోట్లు
సినిమాలు	10 కోట్లు
కామెడీ	10 కోట్లు
ఎడ్యుకేషన్	7.5 కోట్లు

ట్రంపన్నా, ఆయన ట్వీట్లన్నా యాక్!

అమెరికా యూత్‌లో 63 శాతం వ్యతిరేకం



వాషింగ్టన్: అమెరికా యువతకు ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంపన్నా, ఆయన చేసే ట్వీట్లన్నా పడట్లేదట. ట్విట్టర్ ప్లాట్ ఫాంనూ దూరం పెడుతున్నారట. దాదాపు 63 శాతం మంది దేశ యువత ట్రంప్‌ను వ్యతిరేకిస్తున్నారని మసాచుసెట్స్ యూనివర్సిటీ సర్వేలో తేలింది. గవర్నమెంట్ షట్‌డౌన్‌పై 1,000 మంది యువత నుంచి వర్సిటీ రీసెర్చర్లు అభిప్రాయాలు తెలుసుకున్నారు. వీళ్లలో 54 శాతం మంది డెమొక్రాట్లకు, 32 శాతం మంది రిపబ్లికన్లకు, 12 శాతం మంది స్వతంత్రులకు మద్దతిచ్చారు. రిపబ్లికన్లకు మద్దతు తెలుపుతున్నామని చెప్పిన యువత ప్రెసిడెంట్‌గా ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాలను స్వాగతించారని వర్సిటీ పేర్కొంది. కానీ వీళ్లలో 40 శాతం మంది ట్రంప్ అతిగా ట్వీట్లు చేస్తారని అభిప్రాయపడ్డారంది. డెమొక్రాట్లు, స్వతంత్ర అభ్యర్థులకు సపోర్టు చేస్తామన్న వాళ్లు ట్విట్టర్‌లో ట్రంప్ ప్రవర్తనను తీవ్రంగా తప్పుబట్టారని తెలిపింది. సర్వేలో పాల్గొన్న 1,000 మందిలో 37 శాతం మంది యువతకు ట్విట్టర్, ఫేస్‌బుక్ అంటే ఇష్టం లేదని రీసెర్చర్లు పేర్కొన్నారు. వీళ్లందరూ ఇన్‌స్టాగ్రామ్, స్నాప్‌చాట్‌కు మారిపోతున్నారన్నారు. దేశంలోకి ఎక్కువ మంది విదేశీయులు రావడానికి చాన్స్ ఇవ్వాలని 35 శాతం అభిప్రాయపడగా, రానివ్వొద్దని 34 శాతం మంది చెప్పారట. 2020లో ప్రెసిడెంట్ పదవి అభ్యర్థులుగా ఎవరు పోటీ పడతారనగా ట్రంప్, జోయ్ బిడెన్, బెటో ఓ రౌర్కె, బెర్నీ శాండర్స్, ఎలిజబెత్ వారెన్ అని చెప్పారని సర్వే వెల్లడించింది. 4 శాతం మంది డెమొక్రటిక్ పార్టీకి, 27 శాతం మంది రిపబ్లికన్ పార్టీకి ఓటేస్తామన్నారంది.

మెంగ్లా.. ఎబోలా కన్నా డేంజర్

చైనాలో గుర్తించిన సైంటిస్టులు.. గబ్బిలాల ద్వారా వ్యాప్తి

ఎబోలా.. ఈ పేరు వినగానే ప్రపంచం వణికిపోతుంది. ఆఫ్రికాలో వేలాది మందిని కబలించిన ఈ వైరస్‌కన్నా ప్రమాదకరమైన మరో వైరస్‌ను చైనాలో గుర్తించారు. అక్కడి యునాన్ ప్రావిన్స్‌లోని మెంగ్లా కౌంటీలో ఉండే ఓ రకం గబ్బిలాల్లో ఈ వైరస్‌ను కనుగొన్నారు. ఆ కౌంటీ పేరుమీదుగానే దానికి 'మెంగ్లా వైరస్'గా పేరు పెట్టారు. పాలిచ్చి పెంచే జీవుల్లో మనుషుల తర్వాత అత్యంత ఎక్కువ ఉప జాతులుగా ఉన్నవి గబ్బిలాలే. వాటితోపాటు కోతులు, కుక్కలు, ఎలుకల్లో చాలా వరకు జన్యువుల్లో పోలికలు ఉంటాయి. అందువల్ల ఈ జంతువుల్లో ఉండే వైరస్‌లు, బ్యాక్టీరియాల వంటివి మనుషులకూ సంక్రమించే అవకాశాలు చాలా ఎక్కువ. ఇప్పుడు గుర్తించిన మెంగ్లా వైరస్‌కు ఎబోలా వైరస్‌కు చాలా వరకు పోలికలు ఉన్నట్టు తేల్చారు.



ఇదీ 'ఫిలో వైరస్'రకమే..

మనుషులు, జంతువులకు సంక్రమించే వైరస్‌లలో అత్యంత ప్రమాదకరమైన రకం 'ఫిలో వైరస్'. ఈ తరహా వైరస్‌లు 'ఎన్‌పీసీ 1'అనే రిసెప్టార్ సహాయంతో జీవ కణజాలంపై దాడి చేస్తాయి. తీవ్రస్థాయి రోగాలకు కారణమవుతాయి. అయితే వీటిల్లోనూ సగానికిపైగా జన్యువులు ఒక్కో వైరస్‌కు వేర్వేరుగా ఉంటాయి. అందువల్ల ఒకదానిని నియంత్రించే ఔషధం మరోదానిపై పనిచేసే అవకాశాలు తక్కువ. ప్రమాదకరమైన ఎబోలా, మార్‌బర్గ్, క్యూవా వైరస్‌లతోపాటు తాజాగా గుర్తించిన మెంగ్లా వైరస్ కూడా 'ఫిలో వైరస్'రకానికి చెందినదిగా గుర్తించారు.

ఇప్పటికే సోకిందా?

మనుషులు నివసించే ప్రదేశాలకు సమీపంలో ఎక్కువగా ఉండే 'ఫ్రీ టెయిల్డ్, ఫ్రూట్ బ్యాట్స్'వంటి రకాలకు చెందిన గబ్బిలాల్లో ఫిలో వైరస్‌లను కనుగొన్నారు. ఆఫ్రికాలో గబ్బిలాల మాంసాన్ని ఆహారంగా కూడా ఉపయోగిస్తారు. దాంతో 'ఫ్రీటెయిల్డ్'రకం గబ్బిలం నుంచే ఎబోలా వైరస్ మనుషులకు సోకినట్టు గతంలోనే గుర్తించారు. ఇప్పుడు చైనాలో ఫ్రూట్‌బ్యాట్ రకం గబ్బిలంలోనే మెంగ్లా వైరస్‌ను గుర్తించారు. ఇది ఇంకా మనుషులకు సోకిందా లేదా అన్నది తేల్చాల్సి ఉందని సైంటిస్టులు చెబుతున్నారు. ఒకవేళ ఇప్పటికే కోతులు, ఎలుకల వంటివాటికి ఈ వైరస్ సంక్రమించి ఉంటే.. తర్వాత మనుషులపై తీవ్రంగా ప్రభావం చూపే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు.



నీళ్లయినా.. నేలయినా.. ఉరుకుడే

కారులో వెళ్తున్నారు. ట్రాఫిక్ జామ్ అయింది. వెంటనే పక్కనున్న నదిలోకి కారును తిప్పారు. నీళ్లపై రయ్యిన దూసుకెళ్లి కావాల్సిన చోట మళ్లీ రోడ్డుపైకొచ్చింది. భలే ఉంది కదా.. ఇలా నీటిలో, నేలపై నడిచే కారునే ఆస్ట్రేలియాలోని మోనాష్ వర్సిటీ స్టూడెంట్ బీచెన్ నాన్ 'యాంఫీ ఎక్స్' పేరుతో తయారు చేశారు. నేలపై గంటకు 420 కి.మీ. వేగంతో, నీటిపై 150 కి.మీ. వేగంతో దూసుకెళ్లేలా రూపొందించారు. ముందుకు, వెనక్కే కాకుండా.. కుడి, ఎడమలకూ వెళ్లేలా టైర్లు డిజైన్ చేశామని నాన్ చెప్పారు. ఈ బ్యాటరీ కారు ధర జస్ట్ రూ. 23 కోట్లే.



ఒకవైపే చూడకు..

ప్రపంచంలో ఉగ్ర దాడులు, యుద్ధాలే కాదు.. అభివృద్ధి కూడా జరుగుతోంది

- పెరుగుతున్న జీవన ప్రమాణాలు
- రోజుకు 2 లక్షల మందికి కనీస సౌకర్యాలు
- 3 లక్షల మందికి నీరు, విద్యుత్ అందుబాటులోకి
- 'ఫాక్ట్‌ఫుల్‌నెస్' బుక్‌లో స్వీడిష్ విద్యావేత్త హన్స్ వెల్లడి

ప్రపంచంలో రోజూ 2 లక్షల మంది కన్నా ఎక్కువ మంది కనీస సౌకర్యాలున్న జాబితా (దారిద్రరేఖకు పైన)లో చేరుతున్నారని తెలుసా? రోజూ 3 లక్షల మందికి కొత్తగా నీరు, విద్యుత్ అందుబాటులోకి వస్తోందని తెలుసా? తక్కువ ఆదాయ దేశాల్లో శరవేగంగా జరుగుతున్న ఈ అభివృద్ధి పనులు ఎప్పుడూ వార్తల్లోకెక్కవు. జనాలకు తెలియవు. అభివృద్ధి చెందుతున్న దేశాల ప్రజలకైతే అస్సలు తెలియవు. ఎప్పుడూ భీకర యుద్ధాలు, కరువుకాటకాలు, ఉగ్రవాద దాడులు, రాజకీయ ఎత్తుగడలనే వార్తల్లో ప్రధానంగా చూపిస్తుంటే ఎలా తెలుస్తుంది. అందుకే నాణేనికి రెండోవైపును ప్రపంచానికి చెప్పేందుకు స్వీడిష్ విద్యావేత్త హన్స్ రోస్లింగ్ ప్రయత్నం చేశారు. గత కొన్ని దశాబ్దాలుగా ప్రపంచం ఎలా అభివృద్ధి చెందుతోందో చూపించేందుకు 'ఫాక్ట్‌ఫుల్‌నెస్' పేరుతో ఓ బుక్ రాశారు. తక్కువ, మధ్య ఆదాయ దేశాలు ఎలా అభివృద్ధి చెందుతున్నాయో స్పష్టంగా వివరించారు. ప్రపంచీకరణ వల్ల మిడిల్ క్లాస్ ప్రజలు కొంత ఇబ్బంది పడుతున్న మాట వాస్తవమే అయినా లక్షల్లో పేదలకు కనీస అవసరాలు అందుతున్నాయని చెప్పారు. ముఖ్యంగా ఈశాన్య దేశాల్లో ఇది ఎక్కువగా కనబడుతోందన్నారు. ట్రంప్ ప్రొటెక్షనిజం, బ్రెగ్జిట్ తదితరాలు ప్రపంచీకరణపై ప్రభావం చూపుతున్నా ఆర్థిక అసమానతలు తొలగి అందరికీ కనీస అవసరాలు చేరాలంటే ప్రపంచీకరణ ఒక్కటే మార్గమంటున్నారు. ఇంకా అనేక వివరాలు పంచుకున్నారు..

పెరుగుతున్న జీవితకాలం

పారిశ్రామిక విప్లవం సమయంలో యూరోపియన్ దేశాల్లో ప్రజల జీవితకాలం 35 ఏళ్లకు మించి లేదు. అంటే ప్రజలందరూ 35 నుంచి 40 ఏళ్లే బతుకుతారని కాదు. చిన్నారుల మరణాలు ఎక్కువగా ఉండటం వల్ల సగటు జీవితకాలం తగ్గింది. అప్పట్లో ప్రసూతి మరణాలూ మరో సమస్య. మశూచి, ప్లేగు కూడా విజృంభించిన దాఖలాలున్నాయి. కానీ ఇప్పుడు అభివృద్ధి చెందిన దేశాల్లో ఈ వ్యాధులే లేవు. 2015 లెక్కల ప్రకారం ప్రపంచ సగటు ఆయుర్దాయం 70 ఏళ్లపైనే. యూరప్ దేశాల్లోనైతే 80 ఏళ్లపైన. అమెరికాలో 75 ఏళ్లు, ఆసియాలో 70 ఏళ్లు, ఆఫ్రికాలో 60 ఏళ్లుగా ఉంది.

తగ్గుతున్న పిల్లల మరణాలు

శతాబ్దం కిందట అభివృద్ధి చెందిన దేశాల్లోనే ఐదేళ్లలోపు పిల్లల మరణాల రేటు 10 శాతానికి పైగా ఉండేది. కానీ ఆధునిక మందులతో ఈ పరిస్థితి తగ్గింది. ప్రస్తుతం డబ్బున్న దేశాల్లో పిల్లల మరణాలు చాలా వరకు తగ్గాయి. ఇండియా, బ్రెజిల్ లాంటి అభివృద్ధి చెందుతున్న దేశాల్లోనూ చాలా తగ్గాయి. 2015లో ఇండియాలో పిల్లల మరణాల రేటు 4.8 శాతంగా ఉంటే ప్రపంచ సగటు 4.5గా ఉంది. అభివృద్ధి చెందిన దేశాలైన స్వీడన్‌లో ఇది 0.3 శాతం, యూకేలో 0.5, అమెరికాలో 0.7 శాతంగా ఉంది.

50% మధ్య తరగతి ప్రజలే

ప్రపంచీకరణ వల్ల దేశంలోని ప్రజల్లో ఆదాయ అసమానతలు పెరిగినా ప్రపంచ వ్యాప్తంగా మాత్రం చాలా వరకు తగ్గాయి. చైనా, ఇండియా లాంటి అభివృద్ధి చెందుతున్న దేశాల్లో కొన్ని దశాబ్దాలుగా ప్రజల ఆదాయాల్లో పెరుగుదల కనిపించింది. వారి జీవన ప్రమాణమూ పెరిగింది. ప్రస్తుతం ప్రపంచంలో 50 శాతానికిపైగా ప్రజలు మధ్య తరగతి వారే ఉన్నారంటే ఆదాయాల్లో పెరుగుదల ఎంతలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

సంతాన రేటూ కిందికే

ప్రపంచవ్యాప్తంగా జనాభా పెరుగుతోందని అందరికీ తెలుసు. ఇప్పటికే జనాభా 800 కోట్లు దాటింది. కానీ ప్రపంచవ్యాప్తంగా సంతాన రేటు మాత్రం భారీగా తగ్గుతోంది. చైనా, ఇండియా, బ్రెజిల్ లాంటి అభివృద్ధి చెందుతున్న దేశాలు తక్కువ సమయంలోనే సంతాన రేటును తగ్గించుకోగలిగాయి. ప్రస్తుతం ఇండియాలో మహిళల సగటు సంతాన రేటు 2.35గా ఉంది. అదే కెనడాలో 1.59, ఆస్ట్రేలియాలో 1.86, అఫ్ఘనిస్తాన్‌లో 4.8, నైజర్‌లో 7.29గా ఉంది. ఈ శతాబ్దం చివరన 11 కోట్లకు ప్రపంచ జనాభా చేరి అక్కడితో ఆగిపోతుందని యూఎన్ అంటోంది.


జీడీపీ పరుగులు

టెక్నాలజీ లీడర్లు అమెరికా, పశ్చిమ యూరప్‌లు 150 ఏళ్లుగా ఏడాదికి 2 శాతం పెరుగుదల నమోదు చేస్తున్నాయి. అంటే రియల్ ఇన్‌కమ్ రేట్లు 36 ఏళ్లలో రెండింతలవుతాయన్నమాట. అయితే మధ్యమధ్యలో 'ఆర్థిక మాంద్యం' లాంటి కుదుపులూ ఉన్నాయనుకోండి. ఇక ఇండియా, చైనా లాంటి దేశాలైతే దశాబ్ద కాలంగా జీడీపీని పరుగులు పెట్టిస్తున్నాయి. 2015 లెక్కల ప్రకారం చైనా తలసరి ఆదాయం రూ.8 లక్షలు, ఇండియాది రూ.4 లక్షలు. అదే అమెరికా తలసరి ఆదాయం రూ.37 లక్షలు, యూరప్‌లో రూ.28 లక్షలుగా ఉంది.

పోయిన ఏడాది ఎండ మండించింది

- దేశంలో పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- రికార్డుల్లో ఆరో స్థానంలో 2018
- ఎండదెబ్బకు 1,400 మంది మృతి

న్యూఢిల్లీ: దేశంలో ఏటేటా ఎండలు మండిపోతున్నాయి. గతేడాది (2018) ఈ మంట ఇంకాస్త ఎక్కువైందని వాతావరణ శాఖ పేర్కొంది. ఎంతగా అంటే సగటు ఉష్ణోగ్రత ఎక్కువగా నమోదైన సంవత్సరాలలో ఆరో స్థానంలో నిలిచేటంతగానట. ఇక ఈ లిస్ట్‌లో తొలి స్థానంలో నిలిచింది మాత్రం 2016. పోయిన ఏడాది దేశవ్యాప్తంగా సగటున 0.41 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత పెరిగిందని సైంటిస్టులు చెప్పారు. ఏడారి రాష్ట్రం రాజస్థాన్‌తో పాటు ఆంధ్రప్రదేశ్‌లోనూ వేసవి తీవ్రత ఎక్కువగానే రికార్డయిందట. ఈ స్థాయిలో గ్లోబల్ వార్మింగ్ పెరిగిపోతుంటే మనుషులు పిట్టల్లా రాలిపోతారని వారు హెచ్చరిస్తున్నారు. భూతాపం పెరిగితే ఎండలతో పాటు తుఫాన్లు, చలిగాలుల వంటి పకృతి వైపరీత్యాలు కూడా పెరుగుతాయన్నారు. గతేడాది లెక్కలు చూస్తే.. ఎండలకు తాలలేక దేశం మొత్తంమ్మీద 1,400 మంది చనిపోయారు.



సైక్లోన్లు, వరదల కారణంగా మరో 800 మంది మరణించారు. ఇందులో ఒక్క కేరళలోనే 223 మంది చనిపోగా, యూపీలో 160 మంది, మహారాష్ట్రలో 139, పశ్చిమ బెంగాల్‌లో 116 మంది ప్రాణాలు కోల్పోయారు. చలిగాలులకు బలైన వారి లెక్కలు చూస్తే.. యూపీలో 600 మంది, 92 మంది ఇసుక తుఫాన్ల వల్ల చనిపోయారు. భూతాప ప్రభావం మనుషులపైనే కాదు పంటలపైనా పడుతోందని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. రాబోయే కాలంలో.. అంటే 2050 నాటికి దేశంలో గోధుమ పంట ఉత్పత్తి ఏకంగా 623 శాతం పడిపోతుందని అగ్రికల్చర్ సైంటిస్టులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భూతాపాన్ని తగ్గించే చర్యలు చేపట్టకుంటే వరి, మొక్కజొన్న, జొన్న, ఆవాలు, బంగాళదుంప, పత్తి, కొబ్బరి పంటలపైనా ప్రభావం తప్పదని హెచ్చరిస్తున్నారు.

Printed and Published by Ankam Ravi on behalf of VIL MEDIA Pvt. Ltd., and Printed at Venkateshwara Publishers, Survey No. 8/A2, Raikunta Village, Pedda Golconda, Shamshabad Mandal, Ranga Reddy District - 500008. and Published from VIL MEDIA Pvt. Ltd., Plot No. 13/A/B/C, Road No. 12, MLA's Extension Colony, Banjara Hills, Hyderabad-500034, Telangana. Editor: Ankam Ravi, Phone: 040-23606681, RNI: TELTEL/2015/64779.